

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆత్మకూరులో బర్డ్‌ఫ్లూ కలకలం

3 రోజుల్లో 450కి పైగా కోళ్ల మృత్యువాత

చికెన్ విక్రయాలు నిలిపివేయాలన్న కలెక్టర్

బర్డ్‌ఫ్లూతో అప్రమత్తంగా ఉండాలి

3 పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ సూచన

శుక్రవారం | 21-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 324 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి ఉ. 11.58 తదుపరి నవమి; నక్షత్రం: అనూరాధ మ. 3.54 తదుపరి జ్యేష్ఠ వర్జ్యం: రా.9.54-11.37; దుర్ముహూర్తం: ఉ.9.00-9.46, మ.12.50-1.38; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 6.15 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఎల్‌ఆర్‌ఎస్ వేగవంతానికి

జీవో జారీ

మార్చి 31లోగా చార్జీలు చెల్లిస్తే 25% రాయితీ

లేఅవుట్‌లో 10% ప్లాట్ల రిజిస్ట్రేషన్ అయి ఉంటే..

నిర్ణీత చార్జీలతో మిగతా వాటి నమోదుకు అనుమతి

అనధీకృత లే అవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ కుదరదు

హైదరాబాద్, ఫిబ్రవరి 20: లే అవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతానికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. గురువారం దానికి సంబంధించి ఉత్తర్వు జారీ చేసింది. 'తెలంగాణ రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్‌అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్ 2020'కి సవరణలు చేస్తూ.. సీఎస్ శాంతి కుమారి జీవోఎంఎస్ నంబర్ 28 విడుదల చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జరిపిన సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అందులో పొందుపరచారు. ఆ జీవో ప్రకారం..

లే-అవుట్ యజమాని 2020 ఆగస్టు 26కు ముందు.. తాను అభివృద్ధి చేసిన లే-అవుట్‌లో 10 శాతం ప్లాట్లను రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా విక్రయించి ఉంటే, వారు ఎల్‌ఆర్‌ఎస్-2020 కింద దరఖాస్తు చేసుకున్నా, చేసుకోకపోయినా కూడా.. ఆ లే అవుట్‌లోని మిగతా 90 శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. సదరు లే-అవుట్‌లో భూమిని కొనుగోలు చేసినవారు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే వారి వద్ద నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలు సేకరించి.. ఎల్‌ఆర్‌ఎస్ పోర్టల్‌కు పంపుతారు. అక్కడ నిర్ణీత క్రమబద్ధీకరణ చార్జీలు, ప్రోరేటా ఓపెన్ స్పేస్ చార్జీలు వసూలు చేసి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వచ్చే ఆ వివరాలను రూల్ నంబర్ 6 కింద ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తుగా పరిగణిస్తారు.

మార్చి 31/అంతకుముందు.. క్రమబద్ధీకరణ చార్జీలు, ప్రోరేటా ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించేవారికి 25 శాతం రాయితీ ఇస్తారు. రెగ్యులరైజ్ కాని అనధీకృత, అనుమతిలేని లే-అవుట్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్ కుదరదు.

సోమేశ్ ఆదేశించారు..

వారు పాటించారు!

జీఎస్టీ కుంభకోణంలో ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక సిద్ధం



స్కాంలో ఎవరెవరి పాత్ర ఎంత అన్నది తేల్చిన నివేదిక!

సోమేశ్‌కుమార్ సహా నలుగురు అధికారుల ఫోన్ల స్వాధీనం

'స్పెషల్ ఇనిషియేటివ్స్' వాట్సాప్ గ్రూప్‌లోని సందేశాల రిట్రీవ్

మొత్తం 1100 కోట్ల మేర కుంభకోణం జరిగినట్లు నిర్ధారణ!

ముడిసరుకులు కొనకుండానే కొన్నట్లు దొంగ ఇన్వాయిస్‌లు

ఈ-బైక్‌లు తయారు చేయకుండానే అమ్మినట్లు రికార్డులు

జీఎస్టీ చెల్లించినట్లు చూపి.. దొంగ ఇన్వాయిస్‌లతో రిఫండ్

విచారణకు ఫోరెన్సిక్ నివేదిక ఉపకరిస్తుందన్న అభిప్రాయం

ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వస్తుసేవల పన్ను (జీఎస్టీ) కుంభకోణంలో ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తయింది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించకపోవడం, దొంగ క్లెయిమ్‌లు చేసి ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం నుంచే డబ్బులు లాగేసిన కేసులో.. ఎవరెవరి పాత్ర ఏంటి? ఏమేం వ్యవహారాలు నడిచాయి? అన్నదానిపై నివేదిక సిద్ధమైంది. గత ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉండడంతోపాటు వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ కమిషనర్ బాధ్యతలను కూడా తన దగ్గరే ఉంచుకున్న సోమేశ్‌కుమార్, మరో ఇద్దరు అధికారులు, ఒక సాంకేతిక నిపుణుడిపై ఈ కుంభకోణంలో గతంలోనే కేసు పెట్టారు. ఈ నలుగురు కలిసి అప్పట్లో 'స్పెషల్ ఇనిషియేటివ్స్' పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ఆ గ్రూప్‌లో అప్పటి వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ కాశీ విశ్వేశ్వర్‌రావు, డిప్యూటీ కమిషనర్ శివరాంప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు ఉన్నారు. గ్రూప్‌లో సోమేశ్‌కుమార్ ఇచ్చే ఆదేశాలను మిగిలిన ముగ్గురు పాటించేవారు. జీఎస్టీ పన్నులకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ తయారీలో సహకరించిన ప్లియాంటో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ఈ కుంభకోణంలో పాలుపంచుకుంది. దీంతో అప్పట్లో సోమేశ్‌కుమార్

మిగతా 13వ పేజీలో...

ఎస్సీ కార్పొరేషన్‌లో 4% లంచం

బిల్లు పాసవ్వాలంటే తప్పనిసరి అని హుకుం

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ జీఎం ఆనంద్

రూ.3 వేల లంచం.. ఏసీబీ వలలో సర్వేయర్

మరో కేసులో అశ్వాపురం ఏవో పట్టివేత 13



రాజలింగమూర్తి హత్యపై

రాజకీయ దుమారం

బీఆర్ఎస్ నేతలు, కేసీఆర్ కుటుంబమే హత్య చేయించారంటున్న మృతుడి భార్య

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని అరెస్టు చేయాలన్న మంత్రి కోమటిరెడ్డి

హత్యతో నాకు, బీఆర్ఎస్‌కు సంబంధం లేదు: వెంకటరమణారెడ్డి

సీబీఐతో విచారణ జరిపించాలంటూ ఎమ్మెల్యే సత్యనారాయణరావు డిమాండ్

కేసు దర్యాప్తుపై సీఎం రేవంత్ ఆరా

పోలీసుల అదుపులో ముగ్గురు.. తామే చంపినట్టు అంగీకారం?.. పరారీలో ఇద్దరు

భూపాలపల్లి/కృష్ణకాలనీ/బాలసముద్రం/హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తీవ్ర సంచలనం సృష్టించిన భూపాలపల్లికి చెందిన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి (52) హత్య.. రాజకీయ దుమారం రేపుతోంది. ఈ హత్య వెనుక బీఆర్ఎస్ నేతలు, కేసీఆర్ కుటుంబం హస్తం ఉందంటూ మృతుడి భార్య సరళ ఆరోపించడంతో ఈ ఘటన రాజకీయ రంగు పులుముకుంది. రాజలింగమూర్తి గతంలో పలు భూ వివాదాలు, ప్రజా సమస్యలపై కోర్టుల్లో కేసులు వేయడం, 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ

మిగతా 14వ పేజీలో...

పట్టణాల్లో నీటికి కటకట

తాగునీరు, ఇతర అవసరాలకు సమస్యలు.. ఎండాకాలం రాకముందే తీవ్ర నీటి ఎద్దడి

సన్నగా కుళాయి నీరు.. వట్టిపోయిన బోర్లు.. 18 జిల్లాల్లో పడిపోయిన భూగర్భజలాలు

వేసవిలో మాదిరిగా ట్యాంకర్లకు డిమాండ్.. లీకేజీలతో నల్లాల నుంచి కలుషిత నీరు

ప్రభుత్వానికి మాత్రం తాగునీటి సమస్య లేదంటూ నివేదికలిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఇంట్లో పొద్దున లేచింది మొదలు ఒకటే ఆలోచన! చాయ్ తాగేందుకు పాలు ఎలా అని కాదు.. వంట కోసం కూరలు, పప్పులు ఎలా అనీ కాదు. గొంతు తడుపుకోవడానికి, ఇతర అవసరాలకు నీళ్లు ఎలా అనే! కుళాయిల్లో నిండుగా వచ్చే ధార బాగా సన్నబడింది.. నల్లానీరు వదిలే టైమూ తగ్గిపోయింది. ఏదో మొక్కుబడిగా వస్తున్న ఆ నీళ్లూ రోజు విడిచి రోజు వదులుతుండటంతో గృహ అవసరాలకు ఏమాత్రం సరిపోతాయి? స్నానం చేసేందుకు బకెట్ నీళ్ల కోసం ఆలోచించాల్సి వస్తోందటే నీటి కొరత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. బోరు ఆన్ చేసినా

మిగతా 3వ పేజీలో...



కామారెడ్డిలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

అశ్లీల 'యూట్యూబ్' చానళ్లను

తొలగిస్తాం

పోలీసుశాఖతో కలిసి ప్రత్యేక కార్యాచరణ

ఐటీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అశ్లీల, అసభ్య యూట్యూబ్ చానళ్లపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. యూట్యూబ్‌తోపాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో అశ్లీలత హద్దులు దాటుతోందని, వీటిని నియంత్రించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. 'బూతులే బంగారు బాతులు' శీర్షికన ఈనెల 18న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై

మిగతా 13వ పేజీలో...

నైతిక విలువలు పాటించండి!

'ఏ' రేటెడ్ కంటెంట్.. పిల్లలకు అందుబాటులో

2 ఉండొద్దు: ఓటీటీలకు కేంద్రం హెచ్చరిక

భారత ఎన్నికల్లో బైడెన్ జోక్యం 2



అక్కడ ఎవరినో గెలిపించేందుకు యత్నించారు

భారత్‌లో ఓటింగ్‌కు మన నిధులెందుకు?

దీని గురించి మనం భారత ప్రభుత్వానికి తెలియజేయాలి: ట్రంప్ 2

విదేశీ శక్తుల ఆయుధంగా రాహుల్: బీజేపీ

భారత్‌కు యూఎస్ఎయిడ్ సాయంపై శ్వేతపత్రానికి కాంగ్రెస్ డిమాండ్

ఢిల్లీలో కొలువుదీరిన

బీజేపీ ప్రభుత్వం

సీఎంగా రేఖా గుప్తా ప్రమాణం

హాజరైన ప్రధాని, ఎన్డీయే సీఎంలు

హైకోర్టు జడ్జిపై లోక్‌పాల్ విచారణ

2 ఆందోళనకరం

ఇది న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై ప్రభావం చూపుతుంది: సుప్రీం



విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఆ పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే

ధైర్యం లేదు

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల తెరవెనుక నాటకం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం 14

కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అసంతృప్తి

ఆరు గ్యారెంటీలపై ప్రజలు నిలదీస్తుంటే

ఏం చెప్పాలో అర్థం కాని పరిస్థితి వారిది

రహస్య సమావేశం జరిపిన ఎమ్మెల్యేలు

రాష్ట్రంలో ఎప్పుడైనా, ఏమైనా జరగొచ్చు!!

కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

ఎన్ఎంఐఎంఎస్ వర్సిటీలో

విద్యార్థినులకు అస్వస్థత

చికెన్, గుడ్లు తిన్న 18 మందికి

వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి

నేలపై పడుకోబెట్టి, కుర్చీలకు

సెలైన్ బాటిళ్లతో గుట్టుగా వైద్యం

స్థానిక ఎమ్మెల్యే ఆగ్రహం.. ఆస్పత్రికి తరలింపు

నిలకడగా బాధితుల ఆరోగ్య పరిస్థితి

జడ్చర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నార్సిమోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎన్ఎంఐఎంఎస్) వర్సిటీలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దాదాపు 18 మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధపడ్డారు. అయితే మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి టీజీఐఐసీ ప్రాంగణంలో ఉన్న వర్సిటీలోనే విద్యార్థినులకు చికిత్స అందించడం గమనార్హం. యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా వర్సిటీలో విధులు

మిగతా 14వ పేజీలో...



14

ఉద్దేశపూర్వకంగా

ఆ వ్యాఖ్యలు చేయలేదు

ఎవరినీ కించపరచాలనుకోలేదు

గత ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపేందుకే

ఎన్నికల ప్రచారంలో అలా మాట్లాడా

నాంపల్లి కోర్టుకు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

3 కేసుల్లో విచారణకు హాజరు.. 20కి వాయిదా

నేడు ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

నారాయణపేట జిల్లా అప్పక్‌పల్లిలో శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి 13



పూజా సామగ్రి తదితర వ్యర్థాలతో సంగమం నీళ్లు

మహాకుంభమేళా ప్రారంభానికి ముందే నీళ్ల మీద పరీక్షలా? 2

ఆ నివేదికే మాకిస్తారా?

మా సమయాన్ని వృథా చేయడానికా?.. 250 పేజీల్లో ఫీకల్ కోలీఫామ్ ప్రస్తావనే లేదు


కుంభమేళాలో నీటి కాలుష్యానికి సంబంధించి యూపీపీసీబీ అఫిడవిట్‌పై ఎన్జీటీ ఆగ్రహం

సీపీసీబీ నివేదికతో విభేదిస్తున్నారా అని నిలదీత.. వారంలో కొత్త నివేదిక ఇస్తామన్న యూపీ

కుంభమేళాలో మహిళా భక్తుల స్నానాల వీడియోలు!.. విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

జనవరి 12న సేకరించిన పాత నమూనాలతో నివేదికా?

- మా సమయాన్ని వృథా చేయడానికి ఇచ్చారా?
- 250 పేజీల్లో ఫీకల్ కొలీఫామ్ ప్రస్తావనే లేదు
- కుంభమేళాలో నీటి కాలుష్యానికి సంబంధించి యూపీపీసీబీ అఫిడవిట్‌పై ఎన్జీటీ తీవ్ర ఆగ్రహం
- తదుపరి విచారణ 28కి వాయిదా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కోట్లాది మంది పుణ్యస్నానాలు ఆచరిస్తున్న మహా కుంభమేళా స్నానఘట్టాల్లో నీటి నాణ్యతకు సంబంధించి.. ఉత్తరప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు (యూపీపీసీబీ) దాఖలు చేసిన ప్రమాణపత్రంపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) మండిపడింది. మేళా మొదలు కావడానికి ముందు రోజైన జనవరి 12న సేకరించిన నమూనాలకు సంబంధించిన రిపోర్టులు ఇవ్వడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిం ది. ప్రయాగరాజ్‌లోని త్రివేణీ సంగమ ప్రాంతంలో నీటి నాణ్యత దారుణంగా ఉందని.. ఆ నీటిలో 'ఫీకల్ కొలీఫామ్' నిర్ణీత స్థాయిలకు వించి ఉందని, ఆ నీరు స్నానానికి పనికిరాదని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఎన్జీటీకి ఇటీవలే నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే. అక్క డ కాలుష్య నియంత్రణకు సంబంధించి తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని యూపీపీసీబీని కోరినా ఇవ్వకపోవడంపై నాడు ఎన్జీటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 18న యూపీపీసీబీ ఆ ని వేదికను ఎన్జీటీకి సమర్పించింది. ప్రయాగరాజ్‌లో నీటి నాణ్యత చాలా బాగుందని అందులో పేర్కొంది. ఒక్క బ్రిడ్జి వద్ద మినహా మిగతా అన్నిచోట్ల నీటి నాణ్యత స్నా నానికి అనుకూలంగా ఉందని తెలిపిం ది. ఎన్జీటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ, జ్యుడీషియల్ మెంబర్ జస్టి స్ సుధీర్ అగర్వాల్, ఎక్స్‌పర్ట్ మెంబర్ ఎ.సెంథిల్ వేల్‌తో కూడిన బెంచ్.. 19న దీనిపై విచారణ జరిపింది. యూపీపీసీబీ తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వొకేట్ జనరల్ గరిమా ప్రసాద్.. నీటి నమూనాలు ఎక్కడ సేకరిస్తోందనే విషయంపై సీపీసీబీ నుంచి తమకు ఎలాంటి సమాచారమూ లేదని పేర్కొన్నారు. నీటిలో కాలుష్య నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై నివేదికను మంగళవారమే సమర్పించినట్టు తెలిపారు. సీపీసీబీ నివేదికను కూడా సమగ్రంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దీనికి బెంచ్.. "అసలు మీరిచ్చిన 250 పేజీల నివేదికలో ఫీకల్ కొలీఫామ్ స్థాయుల గురించి ఎక్కడా లేదు. పైగా ఆ నమూనాలు సేకరించింది జనవరి 12న. ఈ మాత్రం దానికి అంత పెద్ద డాక్యుమెంట్ ఎందుకు సమర్పించారు? మా సమయాన్ని వృథా చేయడానికా?" అని నిప్పులు చెరిగింది. 'సీపీసీబీ నివేదికతో విభేదిస్తున్నారా? దాన్ని సవాల్ చేస్తున్నారా?' అని నిలదీసింది. దీనికి ఏఏజీ.. రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని, ఇటీవలే యూపీపీసీబీ కొన్ని నమూనాలు సేకరించిందని, ఆ వివరాలన్నింటితో కలిపి కొత్త అఫిడవిట్‌ను వారం రోజుల్లోగా దాఖలు చేస్తామని పేర్కొన్నారు. దీంతో ఎన్జీటీ తదుపరి విచారణను ఫిబ్రవరి 28కి వాయిదా వేసింది.

లోకం తీరు



పనామాలో వలసదారుల నిర్బంధం!

- అమెరికా బహిష్కరించిన 300 మందిలో భారతీయులు కూడా..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: అమెరికా నుంచి బహిష్కరణకు గురైన వందలాది మంది అక్రమ వలసదారులను ఆ దేశ మిలటరీ పనామాకు చేర్చింది. దాదాపు 300 మందిని పనామాలోని ఓ హోటల్‌లో నిర్బంధించారని, వారిలో భారతీయులు కూడా ఉన్నారని వార్తలు వచ్చాయి. కొంత మంది ఆ హోటల్ రూమ్ కిటికీల నుంచి 'కాపాడండి(హెల్ప్)', 'మా దేశంలో మేం సురక్షితంగా ఉండలేం' అంటూ ప్లకార్డులు ప్రదర్శించడం కనిపించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేపట్టిన డ్రైవ్‌లో భాగంగా ఈ అక్రమ వలసదారులను వారి స్వదేశాలకు పంపే క్రమంలో పనామాకు చేర్చారు. ఐరాస శరణార్థి సంస్థ, అంతర్జాతీయ వలస సంస్థల అధికారులు వారిని తమ దేశాలకు పంపే ఏర్పాట్లు చేసే వరకు పనామా ప్రభుత్వం బయటకు పంపేందుకు అనుమతించ లేదు. అక్రమ వలసదారుల్లో 40% మంది స్వచ్ఛందంగా తమ స్వదేశాలకు తిరిగి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదని అక్కడి అధికారులు చెబుతున్నారు.

ఆస్ట్రేలియా విద్యార్థి వీసా నిబంధనలు కఠినతరం

- భారతీయ విద్యార్థుల ఎంపికపై ప్రభావం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: వివిధ దేశాల్లో విదేశీ విద్యార్థులకు నిర్దేశించిన నిబంధనల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఆయా దేశాల్లో వివిధ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఎంపికను ఈ మార్పులు ప్రభావితం చేస్తాయి. ఈ మధ్య కాలంలో ఆస్ట్రేలియాను ఎంపిక చేసుకొనే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. 2004లో 1,18,109 మంది విద్యార్థులు ఆస్ట్రేలియాలోని పలు విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసుకొన్నారు. తమ విద్యార్థి వీసా నిబంధనల్లో పేర్కొనదగ్గ మార్పులను చేయనున్నట్లు గత ఏడాది ఆస్ట్రేలియా ప్రకటించింది. ఇప్పటి వరకూ ఆ దేశానికి వెళ్లే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి లేదు. తాజాగా పరిమితి విధించాలని నిర్ణయించినట్లు సమాచారం. వివిధ దేశాల నుంచి వచ్చే విద్యార్థుల సంఖ్యను 2.70లక్షలకు పరిమితం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్ప టి వరకూ అధికారికంగా ప్రకటన లేనప్పటికీ ఆస్ట్రేలియా ఫెడరల్ ఎన్నికల సమయానికి ఆ ప్రకటన ఉండవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

మహాకుంభమేళాలో మహిళా భక్తుల స్నానాల వీడియోలు!

- సోషల్ మీడియాలో విక్రయిస్తున్న దుండగులు

లఖ్‌నవూ, ఫిబ్రవరి 20: మహాకుంభమేళాలో మహిళా భక్తులు స్నానం చేస్తున్న దృశ్యాలను రికార్డు చేసి ఆ వీడియోలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. సదరు వ్యక్తులపై యూపీ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. రెండు సోషల్ మీడియా ఖాతాలపై న్యాయపరమైన చర్యలు చేపట్టారు. ప్రయాగ్‌రాజ్‌లోని గంగానదిలో మహిళలు స్నానం చేస్తున్న, దుస్తులు మార్చుకుంటున్న వీడియోలను కొందరు దుండగులు సోషల్ మీడియా వేదికల్లో రూ.2,000-3,000 చొప్పున విక్రయిస్తున్నారంటూ ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై దర్యాప్తు జరిపిన పోలీసులు ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ ద్వారా ఈ తరహా వీడియోలు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు శిక్ష

- 30 ఏళ్ల క్రితం తప్పుడు పత్రాలతో ఫ్లాట్లు పొందారని కేసు

నాసిక్, ఫిబ్రవరి 20: మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, ఎన్‌సీపీ నాయకుడు మాణిక్‌రావు కొకాటేకు గురువారం నాసిక్ జిల్లా సెషన్స్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. రూ.50 వేలు జరిమానా కూడా వేసింది. ఆయన సోదరుడు సునీల్ కొకాటేకు కూడా ఇదే శిక్ష విధించింది. 30 ఏళ్ల క్రితం తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి ప్రభుత్వ కోటా కింద రెండు ఫ్లాట్లు పొందారన్న నేరంపై ఈ శిక్ష వేసింది. తాము అల్పాదాయ వర్గాలకు చెందిన వారమని, తమకు ఎక్కడా ఫ్లాట్లు లేవంటూ తప్పుడు పత్రాలు సమర్పించి ఆ సోదరులు ఇద్దరూ కాలేజీ రోడ్డులోని యెవలాకర్ మలలో ప్రభుత్వ కోటా కింద రెండు ఫ్లాట్లు పొందినట్టు కేసు నమోదయింది. 1995లో దివంగత మంత్రి టి.ఎస్.డిఘోలే చేసిన ఫిర్యాదు మేరకు మోసం, ఫోర్జరీ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం వారిద్దరికీ శిక్ష విధించింది. కోర్టు బయట మంత్రి కొకాటే మాట్లాడుతూ తాను బెయిల్ పొందానని చెప్పారు. తీర్పుపై అప్పీలు చేస్తానని తెలిపారు.

సిగరెట్లపై జీఎస్టీ 40 శాతానికి పెంపు!

- పన్ను పెంపు యోచనలో కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీని 40 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ఉత్పత్తులపై జీఎస్టీ ప్రస్తుతం 28% ఉంది. దీంతోపాటు కాంపెన్సేషన్ సెస్, ఇతర చార్జీలు కలిపి 53 శాతం దాకా అవుతున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కాంపెన్సేషన్ సెస్ గడువు 2026 మార్చి 31తో ముగుస్తుంది. అయినప్పటికీ మొత్తం పన్నుపై దీని ప్రభావం పడకుండా ఉండేందుకు జీఎస్టీని పెంచాలని భావిస్తోంది. కాగా, సిగరెట్లపై పన్ను 75%దాకా ఉండాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు కన్నా తక్కువే కానుంది. ఇదిలా ఉండగా.. కాంపెన్సేషన్ సెస్ స్థానంలో హెల్త్‌సెస్‌ను ప్రవేశపెట్టే యోచనలో కూడా కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, పొగాకు ఉత్పత్తులపై పన్నుతో ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ ఉత్పత్తులపై పన్నుల రూపంలో రూ.72,788 కోట్ల ఆదాయం రావడం గమనార్హం.

ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి20: కాంగ్రెస్ అగ్రనేత, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ ఆస్పత్రిలో చేరారు. ఉదర సంబంధిత సమస్యలతో ఆమె ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆమె శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

యువతకు కొత్త నైపుణ్యాలు నేర్పించి, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ రెండో విడతకు కేంద్రప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ స్కీమ్ కింద 300పైగా కంపెనీల్లో లక్షకు పైగా అవకాశాలున్నాయి. ఇంటర్న్‌షిప్ కోసం మార్చి 12లోపు దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్, దరఖాస్తుకు ఎలాంటి రుసుము లేదు. వయస్సు 21 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండి పదో తరగతి నుంచి ఆపైన చదివిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల వారు, వార్షిక ఆదాయం రూ.8లక్షలు దాటిన వారు, ఐఐటీలు, ఐఐఎంలలో చదివే వారు, సీఏ, సీఎంఏ వంటి కోర్సుల్లో చేరిన వారు దరఖాస్తు చేసుకోకూడదు. వివరాలకు https://pminternship. mca.gov.in/login/ వెబ్‌సైట్ చూడవచ్చు.

ఆర్ఆర్‌బీ దరఖాస్తుల గడువు పెంపు

అసిస్టెంట్, ఇతర పోస్టుల దరఖాస్తుల గడువును రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు 2025 మార్చి 1వ తేదీ వరకు పొడిగించింది. గతంలో ఈ గడువు ఫిబ్రవరి 22 ఉండగా ప్రస్తుతం దీనిని మరో వారం రోజులు పొడిగించింది. పది, ఇంటర్ పాసైన వారి కోసం 32,438 పోస్టులతో ఆర్ఆర్‌బీ ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. దరఖాస్తుల్లో సవరణలను మార్చి 4వతేదీ నుంచి మార్చి 13వరకు చేసుకోవచ్చు. వివరాలకు ఆర్ఆర్‌బీ వెబ్‌సైట్ చూడవచ్చు.

కొలువుతీరిన బీజేపీ ప్రభుత్వం

ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా.. మంత్రులుగా ఆరుగురి ప్రమాణం

- తొలి క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు
- ఢిల్లీలో 'ఆయుష్మాన్ భారత్' అమలు


కొత్త మంత్రివర్గాన్ని అభినందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి20: ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం కొలువుతీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణం చేశారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో వేలాది మంది కార్యకర్తల సమక్షంలో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా మంత్రివర్గ ప్రమాణాలు చేయించారు. మంత్రులుగా ప్రమాణం చేసిన వారిలో పర్వేశ్ వర్మ, మంజిందర్ సింగ్ సిర్సా, కపిల్ మిశ్రా, ఆశిశ్ సూద్, రవీందర్ ఇంద్రజ్ సింగ్, పంకజ్ సింగ్ ఉన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, బీజేపీ సీఎంలు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. మంత్రివర్గ ప్రమాణం తర్వాత ఢిల్లీలోని ఓ ప్రముఖ హోటల్‌లో ఎన్డీయే నేతలకు లంచ్ ఏర్పాటు చేశారు. అనంతరం ఎన్డీయే నేతల ను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. రానున్న రెండేళ్లలో జరగబోయే ఎన్నికల్లో విపక్షాలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఆ తర్వాత సచివాలయంలో రేఖా గుప్తా సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఢిల్లీ యమునా నదీ తీరంలోని వాసుదేవ్ ఘాట్ వద్ద నిర్వహించిన హారతి కార్యక్రమంలో కొత్త మంత్రివర్గం పాల్గొంది. ఆ తర్వాత సచివాలయంలో జరిగిన తొలి క్యాబినెట్ భేటీలో రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సీఎం రేఖా గుప్తా వెల్లడించారు. అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ఆప్ సర్కారు పదేళ్ల పాలనపై కాగ్ నివేదికను ప్రవేశపెట్టాలని నిర్ణయించామన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఢిల్లీలో అమలు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

ఎవరెవరికి ఏ పదవులు?

ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఆర్థిక, విజిలెన్స్ శాఖలతో పాటు, మహిళా, శిశు సంక్షేమ, సాధారణ పరిపాలన శాఖలు తన వద్దే ఉంచుకున్నారు. పర్వేశ్ వర్మకు ప్రజాపనులు, జలవనరులు, వ్యవసాయ శాఖలు కేటాయించారు. ఆశిశ్ సూద్‌కు హోం, విద్య, పట్టణాభివృద్ధి శాఖలను కేటాయించారు. మంజిందర్ సింగ్ సిర్సాకు పరిశ్రమలు, పర్యావరణ శాఖలు, కపిల్ మిశ్రాకు న్యాయ, పర్యాటక శాఖలను, పంకజ్ కుమార్ సింగ్‌కు ఆరోగ్యశాఖ, రవీందర్ ఇంద్రజ్ సింగ్‌కు సామాజిక సంక్షేమ శాఖలను కేటాయించారు.

హిమాలయాలకు వెళ్తున్నారా?.. పవన్‌తో మోదీ సరదా వ్యాఖ్య

ఢిల్లీలో బీజేపీ కొత్త ప్రభుత్వం కొలువుతీరిన వేళ వేదికపై ఉన్న బీజేపీ, ఎన్డీయే నేతలను ప్రధాని మోదీ పలకరించారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గంధం రంగు దుస్తుల్లో ఉండటంతో అన్నీ వదిలేసి హిమాలయాలకు వెళ్తున్నారా అని మోదీ సరదాగా ప్రశ్నించారు. అయితే తాను ఎక్కడికీ వెళ్లడం లేదని, చేయాల్సిన పని ఇంకా చాలా ఉందని పవన్.. ప్రధానికి నవ్వుతూ చెప్పారు. ఈ సంభాషణ సమయంలో అక్కడే ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులు నవ్వులు చిందించారు.

వికసిత్ ఢిల్లీ కోసం ఉద్యమం: రేఖ

ఇంటినుంచి బయలుదేరినప్పుడు సీఎం అవుతానని తనకు తెలియదని రేఖా గుప్తా వెల్లడించారు. తన పేరును పర్వేశ్ వర్మ ప్రతిపాదించేదాకా తనకు తెలియదన్నారు. ఢిల్లీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని, వికసిత్ ఢిల్లీ కోసం ఉద్యమ తరహాలో శ్రమిస్తామన్నారు. కేజ్రీవాల్ హయాంలో నిర్మించిన శీశ్‌మహల్(అద్దాల మేడ)ను మ్యూజియంగా మారుస్తామన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా ఎంపికయ్యారు. ఎన్నికల్లో ఆయన రోహిణి నియోజకవర్గం నుంచి గెలిచారు. 2015లో నాటి ఆప్ ఎమ్మెల్యే అల్కాలాంబాపై ఎమ్మెల్యే ఓపీ శర్మ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో సభలో కలకలం రేగింది. సభలో చేపట్టిన ఆందోళనల్లో పాల్గొన్నారంటూ విజేందర్ గుప్తాను నాటి స్పీకర్ సస్పెండ్ చేశారు. అయితే బయటకు వెళ్లేందుకు నిరాకరించడంతో ఆయన్ను మార్షల్స్ సభ బయటకు తీసుకెళ్లారు. పదేళ్ల విజేందర్ గుప్తా స్పీకర్‌గా ఎంపికయ్యారు.

హైకోర్టు జడ్జిపై లోక్‌పాల్ విచారణ ఆందోళనకరం

- సుప్రీంకోర్టు వ్యాఖ్య
- వెంటనే నిలిపివేయాలని ఉత్తర్వులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు సిటింగ్ జడ్జిపై అందిన ఫిర్యాదులను లోక్‌పాల్ విచారణకు స్వీకరించడం 'చాలా చాలా ఆందోళనకర విషయమ'ని గురువారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇది న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై ప్రభావం చూపించేదని అభిప్రాయపడింది. అసలు లోక్‌పాల్‌కు ఆ పరిధి ఉందా అని ప్రశ్నించింది. దీనిని వెంటనే నిలిపివేయాలని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాల ప్రత్యేక ధర్మాసనం ఆదేశించింది. ఫిర్యాదును రహస్యంగా ఉంచాలని, న్యాయమూర్తి పేరును వెల్లడించకూడదంటూ ఫిర్యాదుదారుకు ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సమస్యపై వైఖరి చెప్పాలని కేంద్రం, లోక్‌పాల్ రిజిస్ట్రార్, ఫిర్యాదుదారుకు నోటీసులు పంపించింది. ఫిర్యాదుదారు పేరునూ బయటపెట్టొద్దని, ఆయన నివాసానికి వెళ్లి నోటీసులు అందజేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు సూచించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ హైకోర్టు సిటింగ్ జడ్జీలు లోక్‌పాల్, లోకాయుక్త చట్టం-2013 పరిధిలోకి రారని స్పష్టం చేశా రు. గత నెల 27న ఓ హైకోర్టు జడ్జిపై జస్టిస్ ఎ.ఎం.ఖాన్విల్కర్ ఆధ్వర్యంలోని లోక్‌పాల్ బెంచ్ విచారణ ప్రక్రియను ప్రారంభించడంపై తనుకుతానుగా సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. ధర్మాసనం కార్యకలాపాలను ప్రారంభించగానే జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ లోక్‌పాల్ చేపట్టిన విచారణపై స్టే విధిస్తున్నట్టు ప్రకటించారు. తదుపరి విచారణను మార్చి 18న చేపట్టనున్నట్టు ప్రకటించారు.

నైతిక విలువలు పాటించండి

- 'ఎ' రేటెడ్ కంటెంట్ చిన్నారులకు అందుబాటులో ఉండొద్దు
- ఓటీటీలు, సోషల్ మీడియా వేదికలకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: సోషల్ మీడియా వేదికలపై అశ్లీల జోకుల ప్రసారంపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ఓటీటీ వేదికలకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ఐటీ చట్టం నిషేధించిన కంటెంట్ ప్రసారానికి వ్యతిరేకంగా విప్ జారీ చేసింది. కంటెంట్ ప్రసారంలో ఐటీ నిబంధనలు-2021లో పేర్కొన్న నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఓటీటీ వేదికలకు, స్వయం నియంత్రిత సంస్థలకు కేంద్ర సమాచార ప్రసార మాధ్యమాల మంత్రిత్వశాఖ అడ్వైజరీ జారీ చేసింది. ఆయా వేదికలపై నైతిక విలువల ఉల్లంఘనపై తగిన చర్యలు చేపట్టాలని ఓటీటీ వేదికల స్వయం నియంత్రిత సంస్థలను ఆదేశించింది. ఓటీటీ వేదికలపైనా, సోషల్ మీడియాలోనూ అశ్లీలత, పోర్నోగ్రఫిక్, వల్గర్ అంశాలు పెచ్చరిల్లుతున్నాయంటూ పార్లమెంటు సభ్యులు, చట్టబద్ధ సంస్థ లు, ప్రజల నుంచి కూడా ఫిర్యాదులు అందాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో ఓటీటీ వేదికలపై ఏదే ని అంశాన్ని ప్రచురించే సమయంలో చట్టంలోని వివిధ నిబంధనల కింద పేర్కొన్న నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని కోరుతూ ఈ అడ్వైజరీని జారీ చేస్తున్నామని పేర్కొంది. 'ఎ' రేటెడ్ కంటెంట్ చిన్నారులకు అందుబాటులో లేకుండా చూడాలని ఆదేశించింది. యూట్యూబ్‌లో సమయ్ రైనా నిర్వహిస్తున్న 'ఇండియాస్ గాట్ లాటెంట్(ఐజీఎల్)' కార్యక్రమంలో యూట్యూబర్ రణవీర్ అలహాబాదియా చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీంతో పలు రాష్ట్రాల్లో రణవీర్‌పై కేసులు కూడా నమోదవగా, ఆ కేసులన్నింటినీ కలిపి విచారించాలంటూ సుప్రీంకోర్టులో రణవీర్ పిటిషన్ దాఖలు చే శారు. పిటిషన్ విచారణ సందర్భంగా రణవీర్‌పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. దీంతో నైతిక విలువలు పాటించాలంటూ కేంద్రం తాజాగా ఓటీటీ వేదికలకు హెచ్చరిక జారీ చేసింది.

భారత ఎన్నికల్లో బైడెన్ జోక్యం

దీని గురించి మనం భారత ప్రభుత్వానికి తెలియజేయాలి: ట్రంప్

న్యూయార్క్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: భారతదేశ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు యూఎస్ఎయిడ్ నిధులు రూ.181 కోట్లు (21 మిలియన్ డాలర్లు) వెచ్చించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో మరెవరినో గెలిపించేందుకు నాటి బైడెన్ ప్రభుత్వం ప్రయత్నించినట్టుందని ఆరోపించారు. ఇది భారతదేశ ఎన్నికల్లో జోక్యం చేసుకోవడమేనని తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని భారత ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉందన్నారు. గురువారం మియామీలో ఎఫ్ఐఐ ప్రయారిటీ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలోనూ అనేకసార్లు ఈ అంశాన్ని ట్రంప్ లేవనెత్తారు. బుధవారం కూడా భారత్‌లో ఓటింగ్ శాతం పెంచడానికి అమెరికా నిధులు ఎందుకివ్వాలని ట్రంప్ ప్రశ్నించారు. అమెరికా వస్తువులపై భారత్ విధిస్తున్న అధిక సుంకాల వల్ల అమెరికాకు భారీగా నష్టం జరుగుతోందన్నారు. యూఎస్ఎయిడ్ ద్వారా వివిధ దేశాలకు అమెరికా నుంచి అందుతున్న సాయానికి సంబంధించిన జాబితాను ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ) ఇటీవల విడుదల చేసింది. భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల కమిషన్‌కు యూఎస్ఎయిడ్ ద్వారా రూ.181 కోట్లు ఇవ్వడం కూడా ఆ జాబితాలో ఉంది. దీనిపై ఎఫ్ఐఐ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ తాను అధ్యక్షుడవ్వక ముందు అమెరికా నిధులు ఎలా దుర్వినియోగమయ్యాయనేందుకు ఇదొక ఉదాహరణ అన్నారు. 'భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు మనం ఎందుకు రూ.181 కోట్లు వెచ్చించాలి. అక్కడ మరెవరినో గెలిపించేందుకు వారు(బైడెన్ యంత్రాంగం) ప్రయత్నించి ఉంటారని నాకు అనిపిస్తోంది. మనం ఈ విషయాన్ని భారత ప్రభుత్వానికి తెలియజేయాలి. మన దేశంలో రష్యా కేవలం 173 రూపాయలు (2 డాలర్లు) వెచ్చించిందంటేనే అదొక పెద్ద డీల్ అవుతుంది. భారత ఎన్నికల్లో మనం రూ.181 కోట్లు వెచ్చించడం అదొక సంచలనమే. బంగ్లాదేశ్‌లో రాజకీయాలను బలోపేతం చేయడానికి యూఎస్ఎయిడ్ నుంచి రూ.251 కోట్లు (29 మిలియన్ డాలర్లు) వెచ్చించారు. ఆసియా దేశా లు ఆర్థికంగా బలంగానే ఉన్నాయి. వాటికి మన నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదు' అన్నారు. కాగా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తాను ఓడిపోయి ఉంటే తన జీవితం దుర్భరంగా మారి ఉండేదని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. న్యాయపరంగా అనేక సవాళ్లను తాను ఎదుర్కోవాల్సి ఉండేదని, బైడెన్ ప్రభుత్వం తనపై అత్యంత దారుణంగా ప్రవర్తించిందని ఆరోపించారు. అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక క్రిమినల్, సివిల్ కేసుల్లో ట్రంప్‌కు న్యాయస్థానాల్లో ఊరట లభించింది. కాగా చైనాతో వాణిజ్య ఒప్పందం సాధ్యమేనని ట్రంప్ బుధవారం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో వ్యాఖ్యానించారు. 2020లోనూ చైనాతో గొప్ప వాణిజ్య ఒప్పందం చేసుకున్నామని, ఇప్పుడు కొత్త ఒప్పందం కూడా సాధ్యమేనన్నారు. ఫ్రాన్స్, బ్రిటన్ నేతలతోపాటు జిన్‌పింగ్ కూడా తనను కలిసేందుకు అమెరికాకు వస్తున్నారని ట్రంప్ చెప్పారు.



నాటో దేశాలన్నింటి నుంచి అమెరికా సేనల ఉపసంహరణ?

సౌదీ అరేబియాలో ఈ వారం జరగనున్న అమెరికా, రష్యా చర్చల అనంతరం అన్ని నాటో దేశాల నుంచి అమెరికా సేనలను ఉపసంహరించనున్నట్లు జర్మనీ పత్రిక 'బిల్డ్' తాజాగా కథనాన్ని ప్రచురించింది. అయితే, ఈ కథనాన్ని ఇంతవరకు వైట్‌హౌస్ నిర్ధారించలేదు. అయితే, ఆ కథనాన్ని బాల్టిక్ దేశాల అధినేతలు తోసిపుచ్చారు.

భారత్‌లో రాజకీయ దుమారం

ట్రంప్ తాజా వ్యాఖ్యలు భారత్‌లో రాజకీయ దుమారం రేపుతున్నాయి. తాను తిరిగి అధికారంలోకిరాకుండా అడ్డుకునేందుకు విదేశీ శక్తులు ప్రయత్నిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో చేసిన వ్యాఖ్యలను ట్రంప్ తాజా వ్యాఖ్యలు నిర్ధారిస్తున్నాయని బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయ గురువారం 'ఎక్స్'లో వరుస పోస్టులు పెట్టారు. '2024 ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ అనేకసార్లు విదేశీ జోక్యం గురించి ప్రస్తావించారు. మోదీని కాకుండా మరెవరినో గెలిపించేందుకు జరిగిన ప్రయత్నాన్ని తాజాగా ట్రంప్ నిర్ధారించారు. 2023 మార్చిలో రాహుల్ లండన్‌లో ఉన్నారు. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని అమెరికా నుంచి ఐరోపా వరకు విదేశీ శక్తులను ఆయన అభ్యర్థించారు. భారత ప్రయోజనాలను దెబ్బతీసే విదేశీ శక్తులకు రాహుల్ ఆయుధంగా మారారు' అని అమిత్ మాలవీయ పేర్కొన్నారు. ట్రంప్ ఆరోపణల నేపథ్యంలో దశాబ్దాలుగా యూఎస్ఎయిడ్ ద్వారా భారత్‌లోని సంస్థలకు అందుతున్న సాయానికి సంబంధించి ప్రభు త్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కాంగ్రెస్ కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌చార్జి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

సిటీ కిల్లర్!

భూమి దిశగా దూసుకొస్తున్న భారీ గ్రహశకలం



- 2032 డిసెంబరులో భూమిని తాకొచ్చు
- దక్షిణ అమెరికా నుంచి పసిఫిక్ మహా సముద్రం, ఆఫ్రికా మీదుగా ఆసియా దాకా ఎక్కడైనా పడొచ్చు
- భారత్‌లో ముంబై, కోల్‌కతా ఆ పరిధిలో

న్యూయార్క్, ఫిబ్రవరి 20: దాదాపు 130నుంచి 300 అడుగుల విస్తీర్ణం ఉన్న భారీ గ్రహశకలం ఒకటి భూమి దిశగా గంటకు 46,800 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తోంది! ఇది భూమిని 2032 డిసెంబరు 22న ఢీకొట్టే ప్రమాదం ఉందని నాసా హెచ్చరించింది. ఈ గ్రహశకలానికి నాసా శాస్త్రజ్ఞులు '2024 వైఆర్4'గా నామకరణం చేశారు. న్యూయార్క్‌లోని స్వేచ్ఛాప్రతిమ (స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ) అంతపెద్దగా ఉండే ఈ గ్రహశకలం ఢీకొంటే భూమ్మీద ఏకంగా ఒక నగరమే నాశనమైపోతుందనే అంచనాల నేపథ్యంలో దీన్ని 'సిటీ కిల్లర్'గా కూడా వ్యవహరిస్తున్నారు. దక్షిణ అమెరికాలోని ఉత్తర భాగం నుంచి పసిఫిక్ మహాసముద్రం, సబ్-సహారన్ ఆఫ్రికా మీదుగా ఆసియా దాకా.. ఎక్కడైనా ఇది భూవాతావరణంలోకి ప్రవేశించే ముప్పుందని అంచనా వేస్తున్నారు. ఈ పరిధిలో ఈక్వెడార్, కొలంబియా, వెనెజువెలా, నైజీరియా, సూడాన్, ఇథియోపియా, పాకిస్థాన్, భారత్, బంగ్లాదేశ్ దేశాలున్నాయి. భారత్‌లో ముంబై, కోల్‌కతాలకు ముప్పుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అత్యంత వేగంతో ఈ గ్రహశకలం భూవాతావరణంలోకి ప్రవేశించినప్పుడు జరిగే పేలుడు తీవ్రత.. హిరోషిమాలో అణుబాంబు పేలుడు కన్నా 500 రెట్లు అధికంగా ఉంటుందని శాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. హిరోషిమాలో అణుబాంబు పేలుడు తీవ్రత 15 కిలోటన్నుల టీఎన్‌టీ కాగా.. ఈ గ్రహశకలం పేలుడు తీవ్రత 15-30 మెగాటన్నుల టీఎన్‌టీ దాకా ఉంటుందని వారు చెబుతున్నారు. భూమిని తాకితే.. ఆ తాకిడికి 3000 అడుగులకు పైగా వెడల్పైన గొయ్యి ఏర్పడుతుందని, ఒక పెద్ద నగరం పూర్తిగా నాశనమయ్యే స్థాయిలో దాని ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ గ్రహశకలం భూమికి దాదాపుగా 37 మిలియన్ మైళ్ల దూరంలో ఉంది. ఇది భూమిని ఢీకొట్టే ప్రమాదం 3.1శాతంమేర ఉందని తొలుత మంగళవారం నాసా శాస్త్రజ్ఞులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండురోజులపాటు దాని గమనాన్ని నిశితంగా పరిశీలించిన అనంతరం.. ప్రమాద శాతాన్ని 1.5 శాతానికి తగ్గించారు.

గతంలో తుంగుస్కాలో..

1908 జూన్ 30న ఉదయం 7.15గంటల సమయంలో రష్యాలోని సైబీరియా మంచు ఎడారిలోని తుంగుస్కా నదీ పరీవాహక ప్రాంతంలో దాదాపు 177 అడుగుల విస్తీర్ణం ఉన్న భారీ గ్రహశకలం ఒకటి భూవాతావరణంలోకి ప్రవేశించి.. గాల్లోనే పేలిపోయింది. అది మంచు ఎడారికావడం, మనుషుల జాడ అత్యంత తక్కువగా ఉండే ప్రాంతం కావడంతో ఎలాంటి ప్రాణనష్టం నమోదు కాలేదు. ఆ పేలుడు ధాటికి దాదాపు 8కోట్ల చెట్లు నిలువునా కాలిపోయాయి! 1908లోనే ఈ ఘటన జరిగినా రష్యా ప్రభుత్వం అక్కడికి 1921లో మాత్రమే శాస్త్రజ్ఞులను పంపింది. వారు అక్కడికి చేరుకోవడానికి ఆరేళ్లు పట్టింది.



పిన్నంచర్లలోని కోళ్ల షెడ్డులో మృత్యువాత పడిన కోళ్లు

ఆత్మకూరులో బర్డ్ ఫ్లూ కలకలం

- 3 రోజుల వ్యవధిలో 450కి పైగా కోళ్ల మృత్యువాత
- షెడ్డును పరిశీలించిన పశువ్యాధి నిర్ధారణ వైద్యులు
- చికెన్ విక్రయాలు నిలిపివేయాలన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఆత్మకూరు/మదనాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని పిన్నంచర్ల గ్రామంలో బర్డ్ ఫ్లూ వైరస్‌తో 3 రోజుల్లోనే 450 కోళ్లకు పైగా మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న పాలమూరు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం వైద్యాధికారులు కోళ్ల షెడ్డును పరిశీలించారు. కోళ్ల నుంచి నమూనాలను సేకరించారు. ల్యాబ్ నుంచి వచ్చే నివేదిక వచ్చిన తర్వాతే వ్యాధి నిర్ధారించే అవకాశం ఉందన్నారు. కోళ్ల మరణాల కారణంగా తనకు ఇప్పటివరకు రూ. 10 లక్షల నష్టం వాటిల్లిందని షెడ్డు యజమాని దామోదర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు వనపర్తి జిల్లా మదనాపురం మండలం కొన్నూరు గ్రామంలోని ఫౌల్ట్రీ ఫాంలో కోళ్లు చనిపోవడంతో సమీప ప్రాంతాల్లో చికెన్ అమ్మకాలను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. అదనపు కలెక్టర్ సించిత్ గంగ్వార్‌తో కలిసి ఆయన ఫౌల్ట్రీ ఫామ్‌ను పరిశీలించారు. ఎవరైనా అమ్మకాలు జరిపితే వెంటనే బైండోవర్ చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

23న టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం

- నూతన ఇన్‌చార్జి రానున్న నేపథ్యంలో ఏర్పాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో ఈ నెల 23న టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు, రాజకీయ వ్యవహారాల కమిటీ, ఇతర కమిటీల సభ్యులు పాల్గొననున్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులైన మీనాక్షీ నటరాజన్‌ను కార్యవర్గానికి పరిచయం చేసేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపైనా చర్చించనున్నారు. కాగా, రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వాలు లక్ష మార్కును దాటిన నేపథ్యంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గాంధీభవన్‌లో సంబరాలు చేసుకున్నారు.

పడిపోయింది కేసీఆర్ గ్రాఫే!: వీహెచ్

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పడిపోయింది కాంగ్రెస్ గ్రాఫ్ కాదని, బీఆర్ఎస్‌లోనే కేసీఆర్ గ్రాఫ్ పడిపోయిందని మాజీ ఎంపీ వి. హన్మంతరావు ఎద్దేవా చేశారు. అత్యాశకు పోయి పార్టీ పేరును మార్చుకున్న కేసీఆర్.. ఇక్కడ దోచుకున్న సొమ్మును తీసుకెళ్లి పక్క రాష్ట్రాల్లో ఖర్చు పెట్టారని దుయ్యబట్టారు. వెంటిలేటర్‌పైకి ఏ పార్టీ చేరాలన్నది ప్రజలు నిర్ణయిస్తారన్నారు.

సెంట్రల్ వర్సిటీలకు వీసీలను నియమించండి

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరిన చామల

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సెంట్రల్ వర్సిటీలకు పూర్తి స్థాయి వీసీలను నియమించాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. అలాగే, ఇఫ్లూ, ఐఐటీ హైదరాబాద్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ వర్సిటీల్లో ఓబీసీ రిజర్వేషన్ పాలసీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈ నెల 4న ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎంపీ చామల లేఖ రాయగా.. పరిశీలన కోసం సంబంధిత శాఖలకు పంపినట్లు మంత్రి కార్యాలయం తిరుగు లేఖ పంపింది.

బర్డ్ ఫ్లూతో అప్రమత్తంగా ఉండాలి

- పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ గోపి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు రాష్ట్రాల్లో ప్రబలుతున్న బర్డ్‌ఫ్లూతో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ బి.గోపి జిల్లాల అధికారులకు గురువారం లేఖ రాశారు. పౌల్ట్రీ రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. రాష్ట్ర సరిహద్దుల దగ్గర అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కోళ్లు, గుడ్లతో పాటు దాణాపై గట్టి నిఘా ఉంచాలని పేర్కొన్నారు. ఈ విషయంలో వైద్య, పోలీసు, అటవీశాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మృతి చెందిన కోళ్ల నమూనాలను సేకరించి వాటిని భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజ్ కేంద్రానికి పంపామని, త్వరలోనే రిపోర్టులు రానున్నాయని తెలిపారు. వ్యాధి గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మాంసాన్ని 70 డిగ్రీల కంటే అధిక ఉష్ణోగ్రతలో 30 నిమిషాల పాటు ఉడికించి తినొచ్చని లేఖలో పేర్కొన్నారు.

రీ సర్వేలో 4,625 కుటుంబాల నమోదు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 16న ప్రారంభించిన కులగణన రీ సర్వేలో ఇప్పటివరకు 4,652 కుటుంబాలు పాల్గొని వివరాలను నమోదు చేసుకున్నాయి. రీ సర్వే వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం 040-2111111 టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటు చేయగా గురువారం వరకు 6,411 ఫోన్లు వచ్చాయి. రీ సర్వేలో భాగంగా ప్రజాపాలన సేవాకేంద్రాల ద్వారా 4,227 కుటుంబాలు వివరాలను నమోదు చేసుకున్నాయి. వెబ్‌సైట్ ద్వారా 398 సర్వే ఫారాలు డౌన్‌లోడ్ అయ్యాయి. ఇప్పటివరకు వివరాలు నమోదు చేసుకున్న మొత్తం 4,625 కుటుంబాల్లో 2,254 కుటుంబాలకు ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తయింది. 1,091 దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తయింది.

పట్టణాల్లో నీటికి కటకట

(మొదటి పేజీ తరువాయి)

మోటారు తిరుగుతోంది తప్ప పైకి చుక్కనీరు రావడం లేదు. డబ్బులు పోతే పోనీ అనుకొని నీళ్ల ట్యాంకరైనా బుక్ చేసుకోవచ్చు అనుకున్నా ఏం లాభం? ఈ రోజు ఫోన్ చేసి బుక్ చేస్తే రెండ్రోజుల దాకా ట్యాంకర్ రావడం లేదు. నీళ్ల ట్యాంకర్లకూ డిమాండ్ పెరిగిపోయింది. రోడ్ల మీద ఎక్కడ చూసినా వచ్చీపోయే నీళ్ల ట్యాంకర్లే కనిపిస్తున్నాయి. ఇదీ రాష్ట్రంలో మునిసిపాలిటీల్లో ఎక్కువ చోట్ల ప్రస్తుతం ఉన్న పరిస్థితి. ఇంకా ఎండాకాలం మొదలవ్వనే లేదు.. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర నీటి కొరత ఏర్పడింది. చిత్రం ఏమిటంటే.. రాష్ట్రంలో తాగునీటి సమస్యే లేదని.. ఇప్పటి వరకు ఎక్కడా నీటి ఎద్దడి ఎదురుకాలేదంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సంబంధిత విభాగం లెక్కలు పంపుతున్నా.. వాటికి, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతనే లేదు. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే ఎండలు దంచికొట్టే ఏప్రిల్, మే నెలల్లో నీటి సమస్య ఏ స్థాయిలో ఉండనుందో అన్న ఆలోచనే తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

కామారెడ్డి పట్టణ ప్రజల నీటి కష్టాలు అన్నీఇన్నీ కావు. గట్టిగా నాలుగు బిందెలు దొరికితే అదే భాగ్యం అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఈ పట్టణ ప్రజలకు శివారులోని పెద్ద చెరువు నుంచి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి, బోరుబావుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. అయితే పెద్ద చెరువు దాదాపు ఎండిపోయింది. ఎస్సారెస్పీ పైపులైన్ నుంచి మునుపు వారానికి రెండురోజులు నీళ్లు వదిలితే ఇప్పుడు వారానికి ఒక రోజే వదులుతున్నారు. భూగర్భజలాలు పడిపోవడంతో బోరుబావుల్లోంచి నీరు రావడం లేదు. ఫలితంగా కామారెడ్డి ప్రజల అవసరాల కోసం 18 ఎంఎల్డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటిని సరఫరా



నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో అమృత్- 2 పథకం పనులు ప్రారంభం కాకపోవడంతో వృథాగా పడి ఉన్న పైపులు

చేయాల్సి ఉండగా కేవలం 10 ఎంఎల్డీ నీటినే అందిస్తున్నారు. ఆదిలాబాద్‌లోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. ఈ మునిసిపాలిటీలో 30 ఎంఎల్డీ నీటిని సరఫరా చేయాల్సి ఉండగా ప్రస్తుతం 18 ఎంఎల్డీ నీటినే సరఫరా చేస్తున్నారు. నిర్మల్ పట్టణ శివార్లలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు పూర్తికాకపోవడంతో అక్కడ తాగునీటికి తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ఖానాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సుభాష్‌నగర్, రాజీవ్‌నగర్, శాంతినగర్, శ్రీరామ్‌నగర్, గాంధీనగర్, ఇందిరానగర్, కరీం కాలనీ, టవర్ కాలనీల్లో తాగునీటి సమస్య నెలకొంది. సంగారెడ్డి జిల్లా తూప్రాన్ పట్టణంలో నెలరోజులుగా తాగునీటి సరఫరా తగ్గిపోయింది. ఉమ్మడి తూప్రాన్ మండలానికి సరఫరా అయ్యే నీటిని 30-40 మేర తగ్గించారు. కొన్ని వాటర్ ట్యాంకులు ఖాళీగా ఉంటున్నాయని నీటి సరఫరా విభాగం అధికారులే చెబుతున్నారు. గోదావరిలో సరిపడా నీళ్లు లేకపోవడంతో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నీటి సమస్య నెలకొంది. ఈ సమునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 70 ఎంఎల్డీల నీరు అవసరం ఉండగా 40 ఎంఎల్డీలు మాత్రమే సరఫరా చేస్తున్నారు. సల్తానాబాద్ మునిసిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు కాకుండా పాత పైప్‌లైన్లే ఉపయోగించడం.. లీకేజీ సమస్య కారణంగా నీరు వృథాగా పోతుండటంతో మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. ధర్మపురి పట్టణంలో లీకేజీ సమస్య కారణంగా మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా సరఫరా నిలిపివేశారు. నారాయణపేట జిల్లా కోస్గి మునిసిపాలిటీలో 3.68 ఎంఎల్డీ నీరు అవసరపడుతుండగా 1.09 ఎంఎల్డీ నీటినే సరఫరా చేస్తున్నారు. గద్వాల మునిసిపాలిటీలో 15 ఎంఎల్డీ నీరు అవసరపడుతుండగా 12.6 ఎంఎల్డీ నీరు, అయిజ మునిసిపాలిటీలో 7.5 ఎంఎల్డీకి 5.4 ఎంఎల్డీ నీరే ఇస్తున్నారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు, అమరచింత, పెబ్బేరులో జనం తాగునీటి అవసరాలకు బోరుబావుల మీదే ఆధారపడుతుండటం, అక్కడ భూగర్భ జలాలు పడిపోవడంతో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. యాదాద్రి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో రెండ్రోజులకోసారి నీటి సరఫరా అవుతోంది. కొత్తగూడెం జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో మంచినీటి తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. నీటి లభ్యత ఉన్నప్పటికీ యంత్రాంగం పనితీరులో లోపాల కారణంగా రెండు, మూడు రోజులకోసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పాతలైన్లే ఉండటంతో లీకేజీల కారణంగా మరుగునీరు కలుస్తుండటంతో నీళ్లు కలుషితమవుతున్నాయి. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రజల అవసరాల మేరకు నీరు సరఫరా కావడం లేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు 3.61 ఎంఎల్డీ నీరు అవసరం కాగా మిషన్‌భగీరథ ద్వారా 1.67 ఎంఎల్డీ మాత్రమే సరఫరా అవుతోంది. పరిగిలోని భవానీనగర్, తిరుమల రెసిడెన్సీ, మైత్రి నగర్, శ్రీనివాస హిల్స్ తుంకులగడ్డ, వెంకటేశ్వర కాలనీల్లో తీవ్ర సాగునీటి సమస్య నెలకొంది.

18 జిల్లాల్లో పడిపోయిన భూగర్భ జలాలు

గత నెల జనవరిలో రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ జలాల సగటు నీటి మట్టం 7.46 మీటర్లుగా ఉంది. గత ఏడాది జనవరి (7.72 మీటర్లు)తో పోల్చితే 0.74 మీటర్ల మేర భూగర్భజలాలు పడిపోయాయి. నిరుటితో పోల్చితే 18 జిల్లాలో భూగర్భజలాలు పడిపోయాయి. సాధారణ వర్షపాతం కన్నా తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల్లో నీటి మట్టం పడిపోయింది. ఈ ప్రాంతాల్లో నీటి సంరక్షణ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనూ భూగర్భజలాలు పడిపోయి.. బోరుబావులు పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర సగటు భూగర్భజలాల మట్టం కన్నా ఎక్కువగా యాదాద్రి జిల్లాలో 2.71 మీటర్లు, మేడ్చల్‌లో 1.83 మీటర్లు, సిద్దిపేటలో 1.64 మీటర్లు, సంగారెడ్డిలో 1.29 మీటర్లు, ములుగులో 1.6 మీటర్లు, రంగారెడ్డిలో 1.05 మీటర్లు, నల్లగొండలో 0.62 మీటర్లు, కరీంనగర్‌లో 0.34 మీటర్లు, నిజామాబాద్‌లో 0.03 మీటర్ల మేర నీటిమట్టాలు పడిపోయాయి.

ఇన్ఫార్మర్ల నెపంతో.. ఇద్దరిని హతమార్చిన నక్సల్స్

చర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇన్ఫార్మర్ల నెపంతో ఇద్దరు పౌరులను నక్సల్స్ కాల్చి చంపిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా తుష్మ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. తెల్లవారుజామున గ్రామానికి వచ్చిన మావోయిస్టులు.. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కశ్యప్(36), అనీశ్ రాము(40) అనే వ్యక్తిని కిడ్నాప్ చేశారు. వారిని గ్రామశివార్లలో కత్తితలతో పొడిచి, చంపారు. పోలీసులకు ఇన్ఫార్మర్లుగా పనిచేస్తున్నందునే వీరిని హతమార్చామని పేర్కొంటూ నక్సల్స్ అక్కడ ఓ లేఖను వదిలివెళ్లారు. గురువారం పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో.. ఈ ఘటన కలకలం సృష్టించింది.

యువ వైద్యురాలి ప్రాణం తీసిన ఈత సరదా

- 20 అడుగుల రాయిపై నుంచి తుంగభద్ర నదిలో దూకిన యువతి
- గల్లంతు.. మర్నాడు మృతదేహం లభ్యం
- మృతురాలు మైనంపల్లి సోదరుడి కుమార్తె



అనన్యరావు(ఫైల్)

అల్వాల్, పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సరదా కోసం చేసిన సాహసం.. ఓ యువ వైద్యురాలి ప్రాణాన్ని బలి తీసుకుంది. స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ఓ యువతి 20 అడుగుల ఎత్తైన రాయి మీద నుంచి తుంగభద్ర నదిలో దూకి గల్లంతై ప్రాణాలు కోల్పోయింది. కర్ణాటకలోని గంగావతి తాలుకా సణాపుర గ్రామం వద్ద తుంగభద్ర నదిలో జరిగిన ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన యువ వైద్యురాలు మైనంపల్లి అనన్యరావు(26) మరణించింది. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సోదరుడు (బాబాయి కుమారుడు) మైనంపల్లి మన్మోహన్‌రావు కుమార్తె అనన్యరావు. వీరి కుటుంబం కొంపల్లిలో నివాసముంటుంది. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యురాలిగా పని చేస్తున్న అనన్య తన స్నేహితులు అఖిత, సాత్విక్‌తో కలిసి సోమవారం కర్ణాటకలోని హంపి విహారయాత్రకు వెళ్లారు. వీరు బుధవారం మధ్యాహ్నం తుంగభద్ర నది దగ్గరకు వెళ్లారు. అక్కడ 20 అడుగులకు పైగా ఎత్తు ఉన్న ఓ బండరాయి మీద నుంచి అనన్య తుంగభద్ర నదిలో ఈత కొట్టేందుకు దూకింది. దూకిన కాసేపటికే అనన్య గల్లంతైంది. ఆమె స్నేహితులు పోలీసులకు సమాచారం ఇవ్వగా బుధవారం చీకటి పడేదాకా గాలించినా.. ఆచూకీ లభించలేదు. గురువారం సాయంత్రం అనన్య మృతదేహం లభించింది. అనన్య తండ్రి మన్మోహన్‌రావు వ్యాపారవేత్త కాగా, తల్లి రజిత యోగా, ఫిట్‌నెస్ కోచ్‌గా పని చేస్తుంటారు. అనన్య సోదరి విదేశాల్లో ఉంటారు.

2028లో సీఎం పీఠం బీసీలదే

- ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీ అభ్యర్థులను గెలిపించుకుందాం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

పంజాగుట్ట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణలో బీసీ శకం ప్రారంభమైంది. బీసీ ముఖ్యమంత్రి వాదంతోనే మేము ముందుకు వెళ్తాం. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకోబోతున్నాం" అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీసీ ఉపాధ్యాయ సంఘం (బీసీటీయూ)ఆధ్వర్యంలో గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో.. సంఘం డైరీని ఆయన బీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, బీసీ ఉద్యోగ, కులసంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. త్వరలో ఉప ఎన్నికలు వస్తాయి, పది సీట్లూ గెలుస్తామంటున్న కేసీఆర్ ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థుల్ని ఎందుకు నిలపట్లేదని నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికలకు సెమీ ఫైనల్స్ లాంటి ఈ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పూల రవీందర్ గెలుపు రేపటి భవిష్యత్ రాజకీయాలకు మలుపు అని పేర్కొన్నారు. పీఆర్టీయూ పక్కా రెడ్డి టీచర్స్ యూనియన్‌గా మారిందని.. రెండు స్థానాలలో అవకాశం వస్తే రెండూ రెడ్లకు ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ రావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్తుండగా వైకుంఠ రథం బోల్తా

- 13 మందికి గాయాలు.. మహబూబ్‌నగర్‌లో ఘటన

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన వ్యక్తిని అంత్యక్రియల కోసం వైకుంఠ రథం వాహనంలో తరలిస్తుండగా.. అది బోల్తా పడి 13 మందికి గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. నగరంలోని న్యూగంజ్‌కి చెందిన శివరాజు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో గురువారం వైకుంఠరథంలో ఎర్రమన్నుగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించేందుకు బయలుదేరారు. అయితే శ్మశానవాటిక సమీపానికి చేరుకోగా అక్కడ రోడ్డు బాగా లేకపోవడం, ఎక్కువ మంది వైకుంఠ రథంలో కూర్చొని ఉండటంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. లోపల కూర్చుకున్న వారంతా ఒకరిపై ఒకరు పడిపోవడం, మృతదేహం కూడా వారిపై పడిపోవడంతో మొత్తం 13 మంది గాయపడ్డారు. వారిలో మృతుడి తల్లి ఈశ్వరమ్మ కాలు విరిగింది. మిగతా బంధువులు వారిని అంబులెన్స్‌లలో జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఇటు మృతదేహాన్ని మోసుకుని వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఎవరికీ ప్రాణాపాయ పరిస్థితి లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

'ఉదండాపూర్' పనులు ఆపొద్దని సీఎంను కోరా

- లేదంటే సేకరించిన భూములు తిరిగి ఇచ్చేద్దామన్నా
- పదవి కంటే ప్రజలే ముఖ్యం: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు ఆలస్యం చేయొద్దని సీఎం రేవంత్‌ను కోరినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన సమీక్షలో కర్వెన రిజర్వాయర్ వరకు పూర్తి చేద్దామని, ఉదండాపూర్ పనులు నాలుగేళ్ల తర్వాత చేపడదామని సీఎం రేవంత్ అభిప్రాయపడగా.. 70 శాతం మేర పూర్తయిన పనులను ఆపొద్దని కోరినట్లు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చెప్పారు. ఉదండాపూర్ రిజర్వాయర్ పూర్తయితే 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించినట్లు చెప్పారు. అలా కుదరనిపక్షంలో సేకరించిన భూములను తిరిగి ఇచ్చేద్దామని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. దీంతో ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం అంశాన్ని ఫాస్ట్‌ట్రాక్‌లో చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఉదండాపూర్‌లో గ్రామస్తులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. లోకిరేవులో చేపట్టాల్సిన ప్రాజెక్టును ఉదండాపూర్‌కు తీసుకొచ్చినప్పుడు ఎవరూ మాట్లాడలేదని, ఇప్పుడు నిర్వాసితుల కోసం కొట్లాడుతున్న తనను తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదండాపూర్ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు రీ సర్వేను శుక్రవారం నుంచి ప్రారంభిస్తారని ప్రకటించారు. పరిహారం పెంపు అంశంలో అదనంగా రూ. 170 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారని, ఆ అంశం ప్రస్తుతం పరిశీలనలో ఉందన్నారు. తనకు ఎమ్మెల్యే పదవి కంటే ప్రజలే ముఖ్యమని, నిర్వాసితులకు అన్యాయం జరిగితే మీతో పాటు ధర్నాలో కూర్చుంటానని హామీ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం – లాభం

అదే యుద్ధం గురించి అమెరికా నోట మొన్నటివరకూ విన్న భాష ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. బైడెన్ పోయి ట్రంప్ రాగానే యుద్ధంలో హీరోలు, విలన్లు ఒక్కసారిగా తారుమారైనారు. మూడేళ్ళ రష్యా–ఉక్రెయిన్ ఘర్షణలో దురాక్రమణదారుడని బైడెన్‌తో అనిపించుకున్న పుతిన్‌ను ట్రంప్ సమర్థించుకొస్తున్నారు. అయ్యో పాపం అని బైడెన్ జాలిపడిన జెలెన్‌స్కీని యుద్ధపిపాసివి నీవేనంటూ తిట్టిపోస్తున్నారు. తాను శ్వేతసౌధంలో ఉండివుంటే అసలు యుద్ధమే వచ్చేది కాదని, తాను అధ్యక్షుడు కాగానే యుద్ధం ఆగిపోతుందని ట్రంప్ ఎన్నికల కాలంనుంచీ చెబుతున్నారు. సంధిలో కాస్తంత ఎక్కువ న్యాయం పుతిన్‌కు దక్కుతుందని విశ్లేషకులు సైతం ఎప్పటినుంచో అంటున్నదే. కానీ, జెలెన్‌స్కీని ట్రంప్ మరీ ఇంత నాటుగా విమర్శిస్తారని, ఆ మాటలన్నీ పూర్తిగా రష్యా పక్షాన, ఏకంగా పుతిన్ నోటనుంచి ఊడిపడినట్టుగా ఉంటాయని ఎవరూ ఊహించలేదు.

నియంత, హాస్యగాడు, ముందుచూపులేనివాడు, దుందుడుకు మనిషి ఇత్యాది మాటలతో, తక్షణమే దారికిరాకపోతే దేశాన్నే కోల్పోతావన్న హెచ్చరికలతో జెలెన్‌స్కీని ట్రంప్ ఘాటుగా బెదిరించారు. యుద్ధం ఆరంభించింది ఉక్రెయిన్ అని పుతిన్ మాటనే అమెరికా అధ్యక్షుడు వల్లెవేశారు. ఆదిలోనే రష్యాతో రాజీపడాల్సిన, యుద్ధాన్ని ముందుగానే నిలువరించాల్సిన బాధ్యత పూర్తిగా ఉక్రెయిన్ అధ్యక్షుడిదేనని ట్రంప్ తేల్చేశారు. రష్యా శక్తిముందు నువ్వెంత, నీ బలమెంత? అని శల్యసారథ్యం చేశారు. యుద్ధం చేసే బలం లేదని తెలిసీ తొడగొట్టిన ఈ దూకుడుమనిషి కారణంగానే వేలాదిమంది సైనికులు, ప్రజలూ ప్రాణాలు కోల్పోయారట. కాస్త భూమితో పోయేదాన్ని జెలెన్‌స్కీ యుద్ధం వరకూ తెచ్చాడని, ఇప్పుడు ఉన్నది కాస్తా ఊడిందంటూ ఈ యుద్ధంలో అంతిమవిజయం పుతిన్‌దేనని ట్రంప్ తేల్చేశారు. అపారమైన నష్టం, తప్పుడు నిర్ణయాలు, తెలివితక్కువతనం ఇత్యాది ట్రంప్ మాటలన్నీ పూర్తిగా జెలెన్‌స్కీని ఉద్దేశించినవే తప్ప, రష్యాను కానీ, పుతిన్‌ను కానీ ఆయన గట్టిగా తప్పుబట్టిందీ, ఘాటుగా అన్నదీ ఏమీ లేదు.

సౌదీ శాంతిచర్చలకు తనను ఆహ్వానించనందుకు జెలెన్‌స్కీ ఆగ్రహించడం, ఉక్రెయిన్ ప్రమేయం లేకుండా యుద్ధాన్ని ఎలా ముగిస్తారని ప్రశ్నించడం అసమంజసమేమీ కాదు. అందుకు ప్రతిగా ట్రంప్ ఈ స్థాయిలో విరుచుకుపడటం, జెలెన్‌స్కీ వెంటనే దిగివస్తే కోల్పోయిన భూమిని ఇప్పిస్తానని, లేదంటే ఏలుకోవడానికి దేశమే ఉండదని హెచ్చరించడం విచిత్రం. ఉక్రెయిన్‌కు స్థానం లేకుండా చర్చలు ఆరంభించాలని వారం క్రితం అమెరికా–రష్యా అధ్యక్షులు నిర్ణయించినప్పటినుంచీ జెలెన్‌స్కీ తెగబాధపడుతున్నారు. నాటో ఇప్పటికైనా నిజాన్ని గ్రహించాలని, సొంత సైన్యాన్ని నిర్మించుకోవాలని ఏవేవో సలహాలు ఇస్తున్నారు. యుద్ధాన్ని ముగించే విషయంలో ఎవరికీ ఏ అభ్యంతరాలు ఉండవుగానీ, ఆ పని ఎలా జరగాలన్న విషయంలో ఉక్రెయిన్, యూరప్ అనుకున్నదానికి పూర్తిభిన్నంగా ట్రంప్ ఆలోచనలు ఉంటాయన్నది నిజం. ఆయన విమర్శలన్నీ ఉపరితలంలో పుతిన్ పక్షాన ఉన్నట్టు కనిపిస్తున్నప్పటికీ, పూర్తిగా అమెరికా ప్రయోజనాలు, వ్యక్తిగత లాభాల దృష్టితోనే ఆయన వ్యవహరిస్తారన్నది సుస్పష్టం. తనకు నచ్చినరీతిలో గుదిగుచ్చిన శాంతి ఒప్పందానికి, భూ పంపకాలకు జెలెన్‌స్కీని లొంగదీయడం లక్ష్యంగా ఆయన ఈ మాటలన్నీ అంటున్నారనీ, ఉక్రెయిన్ ప్రజల దృష్టిలో అమెరికాకు నచ్చని జెలెన్‌స్కీ పరువు మరింత దిగజార్చి, ఒప్పందానికి అడ్డుపడుతున్న ఆయనను ఇంతలోగానే దింపివేయాలన్నది లక్ష్యం కావచ్చు. దాదాపు రెండువందల బిలియన్ డాలర్ల ఆర్థిక, ఆయుధసాయంతో ఈ మూడేళ్ళ యుద్ధకాలంలో ఉక్రెయిన్‌ను ఆదుకున్న అమెరికా, అనంతరకాలంలో అనేక రెట్లు దోచుకుంటుందని ఎప్పటినుంచో అనుకుంటున్నదే. గాజాను రియల్‌ఎస్టేట్ కళ్ళతో చూసినట్టుగా, ఇప్పుడు ఉక్రెయిన్‌ను ఆయన ఖనిజాల గనిగా చూస్తున్నారు. అత్యంత విలువైన, అరుదైన ఖనిజాల్లో సగం తవ్వుకోనిస్తే అమెరికా మద్దతు కొనసాగుతుందని ఆయన ఈ మధ్యనే ఓ హెచ్చరికలాంటి ప్రతిపాదన చేశారు. ఇది ఐదువందల బిలియన్ డాలర్ల శాంతి ఒప్పందం అంటూ అమెరికా పత్రికలే వ్యాఖ్యానిస్తున్నాయి. కడవరకూ అండగా ఉంటానని హామీ ఇచ్చి ఇలా మిత్రుడిని నడిమధ్యలో వదిలేయడం అగ్రరాజ్యానికి పరువుతక్కువన్న హెచ్చరికలు, హితవులు ఈ తెలివైన వ్యాపారికి ఏమాత్రం పట్టవు.

రిజర్వేషన్లే సామాజిక న్యాయ మార్గమా?



> కేవలం ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ఆలంబనతో ముస్లింల సమస్యల పరిష్కారం, సంక్షేమ సాధన సాధ్యం కాదని గుర్తించాలి. స్థానిక ముస్లిం జనసముదాయాల పేదరికాన్ని రూపుమాపేందుకు ఎన్‌జీఓలు, స్వయం సహాయక బృందాలు, వితరణశీలురను ప్రోత్సహించేందుకు కొత్త రీతుల్లో ఆలోచించాల్సిన అవసరమున్నది.



■ యోగేంద్ర యాదవ్

ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలన్నది ఒక తప్పుడు ఆలోచన; ముస్లింల శ్రేయస్సుకు సానుకూల చర్య (అఫర్మేటివ్ యాక్షన్) తక్షణమే తప్పనిసరిగా చేపట్టవలసి ఉన్నది... ఈ రెండు అంశాలనూ నేను అంగీకరిస్తున్నాను. ఇవి సమంజసమైనవని మీరూ భావిస్తే– ఆ రెండు అంశాలనూ నేను అంగీకరిస్తున్నాను– స్వీయ వైరుధ్యం కానప్పటికీ అసంగతంగా ఆలోచిస్తున్నవారుగా కనిపించవచ్చు. అయితే అది మీ తప్పు కాదు. వర్తమాన భారతదేశంలో సామాజిక న్యాయం గురించిన సంకుచితమైన భావనలే ఆ తప్పుడు ధోరణికి ఆస్కారమిస్తున్నాయి. తత్ఫలితంగా సానుకూల చర్య అనేది రిజర్వేషన్లకు– అందునా ప్రభుత్వ విద్యా, ఉద్యోగ రంగాలలో– సమానపదమై పోయింది. సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటాలు అన్నీ కోటా లేదా ఉప కోటాకు వ్యతిరేకంగా పరిణమిస్తున్నాయి. ప్రతికూలతలు లేదా వివక్ష లేదా తీరని అవసరాలతో సతమతమవుతున్న సామాజిక సమూహాలన్నీ రిజర్వేషన్లను గట్టిగా కోరుతున్నాయి. మాజీ సైనికులు, లైంగిక మైనారిటీలు, నిర్వాసితులు మొదలైన బాధిత వర్గాలు రిజర్వేషన్లను డిమాండ్ చేస్తున్నాయి. రోగికి శస్త్రచికిత్స చేసేందుకు ఒక పెద్ద కత్తితో ఆపరేషన్ టేబుల్ వద్ద నిలబడిన సర్జన్‌లా భారత రాజ్య వ్యవస్థ ఉంది.

మరి ముస్లిం మతస్థులు అందరికీ విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ సదుపాయం కల్పించాలన్న డిమాండ్ ఒకటి ఉండడంలో ఆశ్చర్యమేముంది? ముస్లింలను ఒక 'సామాజిక మత సమూహం'గా సచార్ కమిటీ నివేదిక (ఎస్‌సిఆర్) గుర్తించినప్పటి నుంచీ ఈ డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసు చేయనప్పటికీ వారు విద్యా రంగంలో బాగా వెనుకబడి ఉన్నారని, పైగా అపరిమితమైన ఆర్థిక ప్రతికూలతలనెదుర్కొంటున్నారని ఎస్‌సిఆర్ గుర్తించింది. ముస్లిం సమాజపు ఈ కఠోర వాస్తవాలను సమగ్రంగా గుర్తించిన మొట్టమొదటి అధికారిక నివేదిక అది.

ఇటీవల విడుదలైన ఒక నివేదిక సంప్రదాయ ఆలోచనా రీతులను దాటి భిన్నమైన కొత్త ఆలోచనలకు మనలను పురిగొల్పింది. 'Rethinking Affirmative Action For Muslims in Contemporary India' అన్న ఆ నివేదికను హిలాల్ అహ్మద్, మొహద్ సన్జీర్ ఆలం, నజిమా పర్వీన్‌లు రూపొందించారు. ముస్లింలకు రిజర్వేషన్ల విషయమై చర్చను ఈ నివేదిక మూడు విధాలుగా ముందుకు తీసుకు వెళ్లింది. తొలుత ముస్లింల శ్రేయస్సుకు సానుకూల చర్య తీసుకోవల్సిన అవసరం ఎందుకు ఉన్నదో విపులంగా, సహేతుకంగా వాదించింది; (2) ముస్లిం మతస్థులు అందరికీ రిజర్వేషన్ల సదుపాయం కల్పించడం మంచి ఆలోచన కాదని అంగీకరించింది; (3) వివిధ ముస్లిం సామాజిక సమూహాలు ఎదుర్కొంటున్న వివిధ ప్రతికూలతలను తొలగించేందుకు పలు విధానాలను సూచించింది. ముస్లింల వెనుకబాటుతనం సమస్య పరిష్కారానికి ఒక సరైన ఆలోచనా చట్రాన్ని ఈ నివేదిక సమకూర్చిందనడంలో సందేహం లేదు. అది ప్రస్తావించిన అంశాలపై మరింత పరిశోధన అవశ్యం జరగవలసి ఉన్నది.

భారతీయ సమాజం గురించి ప్రాథమిక అవగాహన ఉన్న వారందరికీ ఆ నివేదిక ప్రస్తావించిన మొదటి అంశం స్పష్టమే. ప్రస్తుత దేశ పాలకుల నుంచి ముప్పు ఎదుర్కొంటున్న మైనారిటీ మత వర్గం వారు మాత్రమే కాకుండా విద్య, ఆర్థిక రంగాలలో తీవ్ర ప్రతికూలతలతో సతమతమవుతున్న సామాజిక సమూహం కూడా ముస్లింలే. సచార్ కమిటీ నివేదిక నమోదు చేసిన వాస్తవాలను ఈ నివేదిక తాజాపరిచింది. సరికొత్త అధికారిక సమాచారం ఆధారంగా విద్యారంగంలో ముస్లింల పరిస్థితి దళితుల, గిరిజనుల స్థాయితో పోల్చదగినదిగా ఉన్నదని, ఆదాయం, సంపద విషయంలో ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ)తో తుల్యంగా ఉందని ఈ కొత్త నివేదిక వెల్లడించింది. విద్యా రంగంలో యువ ముస్లింలు ఎదుర్కొంటున్న ప్రతికూలతలు వారి ఆర్థిక స్థితిగతుల లేదా తల్లిదండ్రుల విద్యా స్థాయితో సంబంధం లేనివి. కుటుంబ ఆదాయం, తల్లిదండ్రుల విద్యాస్థాయికి సంబంధించి సమస్థాయిలో ఉన్న ముస్లింలతో పోల్చినప్పుడు 'అగ్రకుల' హిందువులు రెట్టింపు సంఖ్యలో ఉన్నత విద్యను పొందుతున్నారని, ప్రైవేట్ విద్యా సంస్థలలో విద్యాభ్యాసం చేస్తున్నారని, ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సులలో చేరుతున్నారని ఈ కొత్త నివేదిక వెల్లడించింది. కుటుంబ ఆదాయం, తల్లిదండ్రుల విద్యార్హతలు సమంగా ఉన్నప్పటికీ అగ్రకుల హిందువులు, ముస్లింలకు లభిస్తున్న అవకాశాలలో అసమానతలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. దక్షిణాది, పశ్చిమ భారత రాష్ట్రాలలో పరిస్థితులు ఇటీవల మెరుగు పడినప్పటికీ ముస్లింల అభ్యున్నతికి సానుకూల చర్యలు తక్షణమే చేపట్టవలసి ఉందనేది స్పష్టం.

ఇటువంటి ప్రతికూలతలు నెదుర్కొంటున్న ముస్లింలకు సామాజిక న్యాయం సమకూర్చేందుకు రిజర్వేషన్ల సదుపాయం కల్పించడమే సరైన సానుకూల చర్య కాదు, కాబోదు. ఇందుకు మూడు కారణాలు ఉన్నాయి. మొదటిది– ఈ విషయంలో రాజ్యాంగ పరమైన సమస్య ఒకటి ఉన్నది. ఒక మతానికి చెందిన వారని 'సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారు'గా గుర్తించేందుకు రాజ్యాంగం అనుమతించదు. అటువంటి అనుమతికి ఆస్కారం లేదని న్యాయ వ్యవస్థ స్పష్టం చేసింది. రెండోది సామాజిక పరమైనది. ముస్లిం మతస్థులు అందరూ ఒక సజాతీయ సమూహానికి చెందినవారు కాదు. హిందూ కులాలలో మాదిరిగానే ముస్లింలలో కూడా సామాజిక హోదా, విద్యాస్థాయి, ఆర్థిక అంతస్తుల విషయంలో చాలా అంతరాలు ఉన్నాయి. మూడోది రాజకీయ పరమైనది ఇప్పుడుగానీ, సమీప భవిష్యత్తులో గానీ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం జరిగితే అందుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జనసమీకరణకు రాజకీయ శక్తులు తప్పక ప్రయత్నిస్తాయి. నేటి భారతదేశంలో ముస్లింల శ్రేయస్సుకు ఇటువంటి పరిస్థితి దాపురించకుండా ఉండడడం చాలా అవసరం.

మరి ముస్లింలు ఎదుర్కొంటున్న సామాజిక ఆర్థిక ప్రతికూలతలు, వివక్షలను రూపుమాపేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటి? ముస్లింలు ఎదుర్కొంటున్న భద్రత, అస్తిత్వ పరమైన సవాళ్లను పరిగణనలోకి తీసుకుని హిలాల్ అహ్మద్ ప్రభృతుల నివేదిక ఒక ప్రత్యామ్నాయ 'కోటా పద్ధతి'ని సూచించింది. సమస్త ముస్లింలకూ రిజర్వేషన్లు కల్పించడం లేదా ముస్లింలు అందరినీ ఓబీసీలుగా పరిగణించడం కాకుండా వెనుకబడిన ముస్లిం సామాజిక సమూహాలు అన్నిటినీ ఓబీసీ జాబితాలలో చేర్చాలి. ప్రస్తుతం ముస్లింలలో సగం మంది ఓబీసీ ప్రయోజనాలు పొందడానికి అర్హులుగా ఉన్నారు. ముస్లింలలో నాలుగింట మూడు వంతుల మంది విద్యా స్థాయి, ఆర్థిక పరిస్థితులు వారిని ఓబీసీలుగా పరిగణించేందుకు అర్హులను చేస్తున్నాయి.

రెండోది ముస్లింలు అందరినీ ఒకే ఓబీసీ జాబితాలో చేర్చడం కాకుండా ఆ జాబితాను కనీసం 'బాగా వెనుకబడిన', 'వెనుకబడిన' అనే రెండు జాబితాలుగా విభజించాలి. కేరళ, కర్ణాటకలో మాదిరిగా ముస్లిం ఓబీసీలను ఒక ప్రత్యేక ఉప కోటా వర్గంగా పరిగణించడాన్ని ఈ నివేదిక వ్యతిరేకించింది. భిన్న ముస్లిం సామాజిక సమూహాలను వాటి వాటి వెనుకబడినతనం ప్రాతిపదికన వేర్వేరు ఓబీసీ జాబితాలలో చేర్చాలి. మూడోది– 'అస్పృశ్య' ముస్లిం సామాజిక సమూహాలను ఎస్సీలుగా వర్గీకరించడంపై ప్రస్తుతమున్న నిషేధాన్ని ఎత్తివేయాలి.

ముస్లింల అభ్యున్నతి విషయమై హిలాల్ అహ్మద్ ప్రభృతుల నివేదిక 'ప్రాదేశిక దృక్కోణాన్ని' కూడా సమర్థించింది. ముస్లిం జనాభా కేంద్రీకృతమై ఉన్న ప్రాంతాలలో ప్రాథమిక పౌర సదుపాయాలను మెరుగుపరచాలని సూచించింది. సచార్ కమిటీ నివేదిక అనంతరం ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్న జిల్లాలు, మండలాలు, గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి ఆయా చోట్ల ప్రాథమిక పౌర సదుపాయాలను మెరుగుపరిచే ప్రయత్నాలు జరిగాయి. ఇటువంటి ప్రయత్నాలు సంబంధిత ప్రాంతాలలో ముస్లిమేతర జనాభా మాత్రమే లబ్ధి పొందేలా ఉండకూడదని హిలాల్ అహ్మద్ ప్రభృతుల నివేదిక స్పష్టం చేసింది. వివిధ వృత్తులకు ప్రభుత్వం ఆర్థిక మద్దతునిచ్చే 'రంగాలవారీ దృక్కోణాన్ని' కూడా ఈ నివేదిక ఆమోదించింది. నేత, తాళాల తయారీ, తివాచీ, అత్తర్ల తయారీ మొదలైన రంగాలలో ముస్లింల ప్రాబల్యమున్నది. ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుని ఆయా వృత్తులకు, తయారీ రంగాలకు ఇతోధిక సహాయాన్ని, ప్రోత్సాహాన్ని అందించవలసి ఉన్నది. మూడోది ప్రైవేట్ రంగ సంస్థలు కూడా ముస్లింల శ్రేయస్సుకు తోడ్పాటునిచ్చే విధంగా చూడాలి. దీనిపై ఈ నివేదిక ప్రతిపాదనలు స్పష్టంగా లేవు. ప్రైవేట్ రంగంలో మైనారిటీ మతస్థులకు కోటా సదుపాయ కల్పన వ్యతిరేక ఫలితాలు, ప్రతికూల పర్యవసానాలకు దారి తీసే అవకాశమున్నది. అయితే సబ్సిడీలు, కాంట్రాక్టులు పొందాలంటే ప్రైవేట్ సంస్థలు తమ ఉద్యోగులలో సామాజిక వైవిధ్యముండేందుకు తప్పనిసరిగా శ్రద్ధ చూపేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. కేవలం ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ఆలంబనతో ముస్లింల సమస్యల పరిష్కారం, సంక్షేమ సాధన సాధ్యం కాదని గుర్తించాలి. స్థానిక ముస్లిం జనసముదాయాల పేదరికాన్ని రూపుమాపేందుకు ఎన్‌జీఓలు, స్వయం సహాయక బృందాలు, వితరణశీలురను ప్రోత్సహించేందుకు కొత్త రీతుల్లో ఆలోచించాల్సిన అవసరమున్నది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

మాతృభాష పునాదిగా ప్రపంచ పౌరులమవుదాం!

వ్యక్తుల అభివృద్ధిలోనూ, వ్యవస్థల పురోభివృద్ధిలోనూ భాషల పాత్ర చాలా కీలకం. భాషలు కేవలం మాట్లాడుకోడానికి మాత్రమే కాదు, విద్యను నేర్చుకోడానికి, దాని ద్వారా స్థిరమైన వృద్ధిని సాధించడానికి చాలా అవసరం. మాట్లాడే విధానాలు, నేర్చుకొనే పద్ధతులు, సమాజంతో మెరుగైన సంబంధాలను ఏర్పరుచుకోగలగడం వంటివి భాషా జ్ఞానం వల్లనే సాధ్యపడతాయి. భాషలు అంతరిస్తుంటే ప్రజలలో అవగాహన లోపం పెరుగుతుంది. సాంస్కృతిక వారసత్వం దెబ్బతింటుంది. వ్యక్తివ్యవస్థల వృద్ధి కుంటుపడుతుంది. ప్రపంచం అనేకమైన భాషలు మాట్లాడే ప్రజలతో నిండిన బహుభాషా వ్యవహార ప్రాంతం. దేశాలుగా పిలుచుకునే భౌగోళికమైన హద్దులకన్న, ఈ బహుభాషా వ్యవహార ప్రాంతాలు భిన్నం. భౌతికంగా ఒక ప్రాంతానికి పరిమితమైనా, బౌద్ధికంగా ప్రపంచంతో చేసే అనుసంధానాన్ని సాధించగల తెలివిడి మనకు ఉంటుంది. అనేక భాషలలో మనకు ఉన్న వ్యవహార జ్ఞానం ఇందుకు సహకరిస్తుంది. కాబట్టి, భాషలను వేరుగా ఉంచి ఏ వృద్ధినీ కొలవలేం, ఏ అభివృద్ధినీ సాధించలేం.

యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఎనిమిదివేలకు పైగా భాషలున్నాయి. వీటిలో ఏడువేలకు పైగా భాషలు వాడుకలో ఉన్నాయి. మారుతున్న ప్రపంచం తీసుకొస్తున్న అనేక మార్పుల తాకిడి మాతృభాషలపై విపరీతమైన ప్రభావాన్ని చూపుతోంది. తక్కువ మంది మాట్లాడే భాషలు త్వరగా అంతరించిపోతున్నాయి. భారతదేశం వంటి బహుభాషా వ్యవహార దేశాలలో ఈ మార్పును స్పష్టంగా గుర్తించవచ్చు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన అండమాన్ నికోబార్ దీవుల్లోని భాషల్లో ఒకటైన 'బో' భాష మాట్లాడే చివరి వ్యవహర్త కొద్దికాలం క్రితం వచ్చిన సునామీలో చనిపోయింది. దీంతో ఆ భాషావ్యవహర్తల సమూహం అంతరించినట్టయింది. చివరి వ్యవహర్త జీవించి ఉన్నప్పుడు పరిశోధకులు గుర్తించి సేకరించిన వివరాలు రికార్డుల రూపంలో భద్రంగా ఉన్నాయి. కాని, ఆ సమూహపు వేల సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, సాహిత్యాలకు ఉనికి లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా అనేకానేక కారణాలవల్ల ఇలా తుడిచిపెట్టుకుపోతున్న మాతృభాషల సంఖ్య ప్రతి ఏటా మూడంకెల సంఖ్యలలో పెరిగిపోతుండడం మనల్ని కలవరపెట్టే అంశం.



> ఇప్పుడు ప్రపంచమంతా బహుభాషా వ్యవహార ప్రాంతమే. అవకాశాలను, సందర్భాలను అనుసరించి అనేక దేశాలలో బహుభాషా విద్యాప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. మాతృభాషను విడిచిపెట్టకుండా మరిన్ని భాషలలో విద్యను నేర్పడమన్నది ఇప్పుడు ప్రపంచానికి కలిసి వస్తున్న తారకమంత్రం.

అభిప్రాయాలను వెల్లడించడానికి మాత్రమే కాక, జ్ఞానాన్ని పంచుకోడానికి, పెంచుకోడానికి కూడ భాషే మనకి ఆధారం. ప్రపంచ జ్ఞానం మనకు ఇవాళ అనేకమైన భాషల్లో అందుతోంది. విద్యావ్యవస్థ ఈ జ్ఞానాన్ని మాతృభాషలలో ఆయా సమాజాలకు అందించాలి. జ్ఞాన శాఖలలోని వైవిధ్యాన్ని మాతృ భాషలలో గ్రహింపుకు తెచ్చుకున్న సమాజాలు సులభంగా, వేగంగా వృద్ధి చెందుతాయి. అందుకే భాషావేత్తలు విద్యను మాతృభాషల్లోనే నేర్పాలి అన్నదానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు.

ప్రపంచ దేశాలతో అనుసంధానం కావడం అన్నది ఇప్పుడు ప్రతిఒక్కరికి అవసరంగా మారిపోయింది. ఇటువంటి సందర్భాలలో భాషపరంగా మనకు భిన్నమైన అనుభవాలు ఎదురవుతాయి. ప్రపంచవ్యాప్తంగా 37 శాతం కన్నా ఎక్కువమంది తమ మాతృభాషలలో కాకుండా పర భాషలలో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. కొన్ని దేశాల్లో ఇది 90 శాతం దాకా ఉంది. విద్యావ్యవస్థలోని ఈ కల్లోలం ఆయా సమాజాలలోని ప్రజలలో భాషాపరమైన, భావ పరమైన సంఘర్షణలకు కారణమవుతుంది. సాంఘిక, రాజకీయ, వైజ్ఞానిక, కళాత్మక ఆలోచనలను ఇది నిరంతరం అస్థిరపరుస్తుంది. సమాజంలో పుట్టిన ప్రతి వ్యక్తికి తమ భాషలో చదువుకొనే హక్కు ఉంటుంది. సమాజాలను పాలించే వ్యవస్థలు ఈ హక్కును గుర్తించటం, పాటించటానికి అనువైన విధానాలను రూపొందించటం విధిగా భావించి, కార్యాచరణను కట్టుదిట్టం చేయాలి.

ఇప్పుడు ప్రపంచమంతా బహుభాషా వ్యవహార ప్రాంతమే. అవకాశాలను, సందర్భాలను అనుసరించి అనేక దేశాలలో బహుభాషా విద్యాప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. మాతృభాషను విడిచిపెట్టకుండా మరిన్ని భాషలలో విద్యను నేర్పడమన్నది ఇప్పుడు ప్రపంచానికి కలిసి వస్తున్న తారకమంత్రం. దీనివల్ల విద్యార్థులలో విద్యార్జన శక్తిని, విద్యాసక్తిని పెంపొందింపజేయవచ్చు. తల్లిదండ్రులలో పిల్లల భవిష్యత్తు పట్ల ఆందోళనలను తగ్గించవచ్చు. అనేక సమాజాలతో కలసి జీవించగలిగే నైపుణ్యాన్ని పిల్లలలో వృద్ధి చేయవచ్చు. నేటి బాలలు రేపటి పౌరులు అన్నది పాతబడిన మాట. నేటి బాలలు రేపటి ప్రపంచ పౌరులు అన్నది కళ్ళకు కడుతున్న సత్యం. మనభాషతో పాటు మరిన్ని భాషలను నేర్చుకోవడం, భిన్నమైన సంస్కృతులను తెలుసుకోవడం అనేవి ఈ కాలపు పిల్లలకు మనం అందించదగిన సంపద. ఇది వారిలో వ్యక్తిగతమైన వృద్ధిని కలిగిస్తూ, సామూహిక చైతన్యానికి బాటలు వేస్తుంది. వృత్తి ఉద్యోగాలలో ఉన్నతిని కల్పించటంతో పాటు, ప్రపంచంతో అర్థవంతమైన భాగస్వామ్యం సాధించేందుకు సహకరిస్తుంది.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఒకటిగా భాషల ప్రాధాన్యాన్ని యునైటెడ్ నేషన్స్ ఏనాడో గుర్తించింది. ప్రపంచం సాధించదగిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలుగా యునైటెడ్ నేషన్స్ పేర్కొన్న పదిహేడింటిలో నాలుగవ లక్ష్యం 'అందరికీ నాణ్యమైన విద్య'. అలాగే 'లింగ సమానత్వం, అసమానతల తగ్గింపు', 'స్థిర అభివృద్ధిని సాధించే సమాజాలు నగరాలు'... మొదలైన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలన్నిటికీ భాషలతో నేరుగా సంబంధం ఉంది. యునైటెడ్ నేషన్స్ అన్ని దేశాలకు నిర్దేశించిన ఈ లక్ష్యాల సాధనలో మాతృభాషల ద్వారా విద్యాబోధన ప్రాధాన్యాన్ని మన రాష్ట్రాలు, దేశాలు ప్రథమ ప్రాధాన్యాంశంగా గుర్తించాలి. 2015లో ఇందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలను అన్ని దేశాలకు యునైటెడ్ నేషన్స్ సంస్థ పంపించింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆయా దేశాలు సాధించిన ప్రగతిని నివేదికల రూపంలో 2016 నుంచి మనకు అందిస్తోంది. గడచిన తొమ్మిదేళ్ళ నివేదికల సారం ఏమిటంటే, 'సమాజాల మధ్య సంభాషణకు, విద్యకు, సమ్మిళిత వృద్ధి సాధనకు, సాధికారతకు మాతృభాషలు చాలా కీలకం' అని. 2022–2032 దశాబ్దాన్ని యునెస్కో దేశీయభాషల దశాబ్దంగా ప్రకటించి ప్రపంచదేశాలలో మాతృభాషల ద్వారా సమ్మిళిత, సుస్థిర వృద్ధిని సాధించేందుకు కృషి చేస్తోంది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంలో మనమూ, మన వ్యవస్థలూ ఈ విషయంపై దృష్టినిలపవలసిన అవసరం ఉంది.

■ ఆచార్య పమ్మి పవన్ కుమార్
తెలుగు ప్రొఫెసర్, హైదరాబాద్ యూనివర్సిటీ
(నేడు అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం)

నూరు వసంతాల 'మధిర' మహాసభ!

తెలుగు భాషాభివృద్ధికి, అక్షరాస్యత పెంపుదల కోసం అలనాటి హైదరాబాద్ సంస్థానంలో గ్రంథాలయోద్యమం ప్రారంభమయింది. 1925 నాటికి తెలంగాణ ప్రాంతమంతటా దాదాపు 100 గ్రంథాలయాలు ఆరంభమయ్యాయి. ఇవన్నీ ప్రభుత్వ సహాయాన్ని ఆశించకుండా మాతృభాషా ప్రేమికులు అయిన విద్యావంతులు, సమాజంలో ఆధునిక చైతన్యాన్ని రగుల్కొల్పేందుకు నిర్వహించిన జ్ఞాన మందిరాలు. ఇటువంటి గ్రంథాలయాలను ఏర్పాటు చేసిన చిన్న పట్టణాలలో



మధిర 1925 ఫిబ్రవరి 21, 22 తేదీలలో నిజాం రాష్ట్ర గ్రంథాలయోద్యమ మహాసభను నిర్వహించి ఆ ఉద్యమ చరిత్రలో విశిష్టతను సంతరించుకున్నది. మధిరలోనే జరిగిన నిజాం రాష్ట్ర ఆంధ్ర జన సంఘం తృతీయ సమావేశం సందర్భంగా ఈ గ్రంథాలయోద్యమ సభను కూడా నిర్వహించారు. ఈ గ్రంథాలయ సభకు అధ్యక్షత వహించిన పింగళి వెంకట రామిరెడ్డి తమ అధ్యక్షోపన్యాసంలో ఇలా అన్నారు: 'కొట్టు తిట్టుట లేకుండా, కోపతాపాలు లేకుండా, డబ్బు దసకము గైకొనక బోధించు మహా ఉపాధ్యాయులు పుస్తకములే. వారి సన్నిధికి పోయినచో అవి నిద్రించుచుండును. గ్రహణ విషయమును ప్రశ్నించినచో ఏమియూ దాచవు. వాటిని గురించి దురభిప్రాయపడినచో ఎప్పుడూ సణుగుకొనవు, అవివేకులను చూసి అవి పరిహసించవు. సుఖియై, వివేకియై శాస్త్రజ్ఞుడై, భక్తిపరుడు అయిన ప్రతి వ్యక్తి తప్పక పుస్తక పఠన అభిలాషియై ఉండవలెను'.

ఆనాటి ఈ సార్వజనీన గ్రంథాలయాలు అన్నీ సాహిత్య కృతులనే కాకుండా సమస్త విషయాలకు సంబంధించిన పుస్తకాలను సేకరించి పాఠకులను ఆకట్టుకుని నవీన విద్యా చైతన్యాన్ని పెంపొందించేందుకు శతథా ప్రయత్నించేవి. ఆంధ్ర జనసంఘం ఏర్పడిన తరువాత ఈ గ్రంథాలయోద్యమం మహా వేగంగా విస్తరించింది. గ్రంథాలయాలకు అనుబంధంగా నాటక సంఘాలు, రాత్రి పాఠశాలలు, ఆటపాటల క్లబ్బులు ఉండేవి. ఈ గ్రంథాలయోద్యమ సభలలో మాడపాటి తిరుమల రావు, వేముగంటి రామకృష్ణారావు, మాదిరాజు రామ కోటేశ్వరరావు, మౌలానా రఫీ దిన్ సాహెబ్, మల్లాది లక్ష్మీ నరసింహారావు, మిర్యాల నారాయణ గుప్త తదితర ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ సభలలో భాగంగా జరిగిన మధిర గ్రంథాలయ వార్షికోత్సవ సభలో దూపాటి వేంకట రమణాచార్యులు (శేషాద్రి రమణ కవులలో ఒకరు) తెలంగాణ ప్రాంతంలో తమ పరిశోధనానుభవాల గురించి విపులంగా ఉపన్యసించారు.

– రవికుమార్ చేగొని
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రంథాలయ సంఘం

కాబోయే ఎమ్మెల్సీలు, ఎదురుచూస్తున్న సమస్యలు!

తెలంగాణలో అధికశాతం జిల్లాల్లో వ్యాపించి ఉన్న రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాల శాసనమండలి సభ్యుల ఎన్నిక ఈ నెల 27వ తేదీన జరుగుతోంది. కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్–మెదక్, నల్లగొండ–వరంగల్–ఖమ్మం నియోజకవర్గాల శాసనమండలి సభ్యులు దృష్టి సారించేందుకు అనేక విద్యారంగ, ఉపాధ్యాయవర్గ సమస్యలు వేచిచూస్తున్నాయి. విద్యారంగంలో నెలకొన్న సందిగ్ధ పరిస్థితులకు పరిష్కారాన్ని కాబోయే శాసనమండలి సభ్యులు చూపగలరన్న విశ్వాసంతో ఉపాధ్యాయ లోకం ఎన్నికల వైపు చూస్తోంది.

విద్య, ఉపాధ్యాయ రంగాలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు మూడు కేటగిరీలు: వ్యవస్థాపరమైన సమస్యలు, విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు. వ్యవస్థాపరమైన సమస్యల్లో ప్రధానమైనది కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం. ఈ విధానం పోవాలని ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు కూడా కోరుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం వేతన సవరణ నివేదికను తెప్పించుకుని అమలు చేయాలని కూడా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

ఇక విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైనది మానిటరింగ్ అధికారులు లేకపోవడం. మానిటరింగ్ వ్యవస్థలో అత్యంత కీలకంగా వ్యవహరించేది మండల విద్యాధికారులు. రాష్ట్రం మొత్తమ్మీద రెగ్యులర్‌గా మండల విద్యాధికారులుగా పనిచేస్తున్నవారి సంఖ్యను వేళ్లమీద లెక్కించవచ్చు. మిగతా స్థానాలన్నీ ఖాళీగా ఉన్నాయి. గతంలో మండల నోడల్ అధికారులుగా పని చేసిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ స్థానాల్లో మండల విద్యాధికారులుగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు మానిటరింగ్ బాధ్యతలు ఉన్నప్పటికీ తమ పాఠశాల వ్యవహారాలను పర్యవేక్షిస్తూ పూర్తికాలం మానిటరింగ్‌పై దృష్టి పెట్టడం కష్ట సాధ్యం. విద్యా డివిజన్ స్థాయిలో గతంలో ఉప విద్యాధికారుల వ్యవస్థ ఉండేది. కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల జిల్లాల పరిధి తగ్గడంతో ఈ పోస్టులను రద్దు చేశారు. ఈ బాధ్యతలను కూడా జిల్లా విద్యాధికారులకి అప్పజెప్పారు. మండల విద్యాధికారులు అదనపు బాధ్యతలపై ఉండడం, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మానిటరింగ్‌పై పూర్తికాలం దృష్టి పెట్టలేకపోవడం, ఉప విద్యాధికారుల పోస్టుల రద్దు, జిల్లా విద్యాధికారులకు పని ఒత్తిడి వల్ల సమయం చిక్కకపోవడం, ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించకపోవడం మొదలైన కారణాల వల్ల క్షేత్ర స్థాయిలో ఉపాధ్యాయులకు ఏదైనా విషయంలో సందేహాలు ఏర్పడితే వాటిని నివృత్తి చేసే వారే కరువయ్యారు. కాబట్టి సర్వీస్ రూల్స్‌ని ఒక కొలిక్కి తెచ్చి, మండల విద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలి. ఉప విద్యాధికారుల వ్యవస్థను పునరుద్ధరించాలి.

తెలంగాణ రాష్ట్రంలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థలు ఒక్కోదానిలో పాతిక దాకా అధ్యాపకులు ఉండాల్సి ఉండగా కేవలం ఒకరిద్దరితోనే నిర్వహించడం జరుగుతోంది. దాని వల్ల ఉపాధ్యాయులు కాగోరేవారికి పూర్తి స్థాయిలో వృత్తి పూర్వ శిక్షణ అందడం లేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈ సమస్యలను నివారించాలంటే ఏకీకృత సర్వీసుల సాధన తప్పనిసరి. ఇదిగో అదిగో అంటూ ఏళ్లకేళ్లు గడుస్తున్నాయే తప్ప ఈ దిశగా పురోగతి లేదు. యాజమాన్యాల వారీగా పదోన్నతులు, బదిలీలు చేయడం గుడ్డిలో మెల్ల. కానీ ఇవే శాశ్వత పరిష్కారాలు కావు. అనేక పీటముడుల కారణంగా మండల విద్యాధికారుల పోస్టులు, డైట్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఉపాధ్యాయులకు అవకాశం లేకపోయినా క్లర్కులుగా పనిచేసేవారు ఆ పోస్టుల్లోకి పదోన్నతి పొందుతున్నారు. ఉన్నత విద్యార్హతలు, సుదీర్ఘ అనుభవం కలిగిన ఎందరో ఉపాధ్యాయులు ఆ పోస్టుల్లోకి పదోన్నతి లేకుండానే పదవీవిరమణ చెందుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఏకీకృత సర్వీసు నిబంధనలకు మోక్షం కలిగిస్తుందనే ఆశలో ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ నిబంధనలకు మోక్షం లభిస్తే ఉపాధ్యాయులకు మాత్రమే గాక విద్యార్థులకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. విశ్వవిద్యాలయ స్థాయిలోనూ మానవ వనరుల లేమి విశ్వవిద్యాలయాల పరిస్థితిని దిగజారుస్తోంది.


> విద్యారంగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ఈ తరుణంలో జరుగుతున్న ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత కీలకమైనవి. ఆయా సమస్యలను పరిష్కరించవలసిన బాధ్యత ఇప్పుడు ఎన్నికయ్యే మండలి సభ్యులపై ఉంటుంది. విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి పెద్దల సభ సభ్యులు కృషి చేస్తారన్న ఆశావహదృక్పథంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు.



సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు అనేక సమస్యలున్నాయి. 'ఎంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చింద'న్నట్టు ముందే సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న ఉపాధ్యాయ లోకాన్ని కొత్త జిల్లాలు, మల్టీ జోన్ల ఏర్పాటు మరిన్ని సమస్యల్లో ముంచెత్తింది. స్థానికతే ప్రధాన మంత్రంగా ఏర్పాటైన తెలంగాణలో స్థానికతకు చెక్ పెట్టింది 317 జీవో. పర్యవసానంగా వందలాదిమంది తమ స్థానిక ప్రాంతానికి దూరంగా బదిలీపై వెళ్ళవలసి వచ్చింది. 317 జీవో వల్ల జరిగిన నష్టాన్ని సరిదిద్దేందుకు ప్రస్తుత ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవడం హర్షణీయం. అయితే ఇంకా బాధితులెందరో న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. రెండేళ్ల కిందట 2023 జనవరి 23న వెలువడ్డ మూడో నెంబరు జీవో ప్రకారం అప్పటి ప్రభుత్వం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ పోస్టులను మల్టీ జోనల్ పరిధిలోకి తెచ్చింది. ఈ జీవో ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని రెండు మల్టీ జోన్లుగా విభజించారు. మల్టీ జోన్–1 కిందికి కాళేశ్వరం, బాసర, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జోన్లను; మల్టీజోన్– 2 కిందికి యాదాద్రి, చార్మినార్, జోగులాంబ జోన్లను తెచ్చారు. హైదరాబాదు నగరం పక్కనే ఉండే మెదక్, సిద్దిపేట జిల్లాలను చార్మినార్ కింద ఉంచకుండా రాజన్నసిరిసిల్ల జోన్ కిందికి తీసుకురావడం, జిల్లా స్థాయిలో ఉండే ప్రధానోపాధ్యాయులను మల్టీ జోన్ స్థాయికి తీసుకురావడం కొత్త జోనల్ వ్యవస్థలో విశేషాలు. మల్టీ జోన్ స్థాయికి వచ్చేసరికి మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు ఆదిలాబాద్, ఖమ్మం మొదలైన సుదూర ప్రాంతాలకు కూడా వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది. మల్టీ జోన్ పరిధిలో పదోన్నతుల కారణంగా అధిక శాతం జిల్లాల ఉపాధ్యాయులు నష్టపోయారు. ఇతర జిల్లాల వారు హైదరాబాదు పరిసర జిల్లాలకు రావడం వల్ల ఆయా జిల్లాల్లో పదోన్నతి పొందవలసినవారు తీవ్రంగా నష్టపోయి, నిరాశలో కూరుకుపోయారు. మరి కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో కుటుంబాలకు దూరంగా దూర ప్రాంతాలకు కూడా వెళ్ళవలసివచ్చింది. ఉమ్మడి జిల్లా పరిధిని జోనల్ స్థాయిగా భావించి, ఆ స్థాయిలోనే ప్రధానోపాధ్యాయ పోస్టుకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుకుంటున్నారు. మూడో నెంబరు జీవో వల్ల నష్టపోయిన జిల్లాలకు న్యాయం చేయాలని సూచిస్తున్నారు.

విద్యారంగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ఈ తరుణంలో జరుగుతున్న ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత కీలకమైనవి. ఆయా సమస్యలను పరిష్కరించవలసిన బాధ్యత ఇప్పుడు ఎన్నికయ్యే మండలి సభ్యులపై ఉంటుంది. విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి పెద్దల సభ సభ్యులు కృషి చేస్తారన్న ఆశావహదృక్పథంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చూడాల్సిన బాధ్యత కాబోయే ఎమ్మెల్సీల భుజస్కంధాలపై ఉంది.

● డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు



కత్తుల స్వైరవిహారం!

నగరంలో మూడు చోట్ల దాడులు

- పోచమ్మమైదాన్‌లో భార్య, అత్తామామలపై..
- మడిపల్లి గ్రామంలో నలుగురిపై..
- భట్టుపల్లిలో కారును అడ్డగించి వైద్యుడిపై..
- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు



రాయితీతోనైనా.. మోక్షం లభించేనా?



హనుమకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్) మళ్లీ తెరపైకి వచ్చింది. ఐదేళ్లుగా నానుతున్న ఈ పథకం.. కనీసం ఈ సారైనా పూర్తిస్థాయిలో అమలవుతుందా? రెగ్యులరైజేషన్ కోసం దాఖలైన దరఖాస్తులకు ఫీజు చెల్లింపులో ప్రభుత్వం 25శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం చేసిన ప్రకటనతోనైనా మోక్షం లభిస్తుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తొలి నుంచి ఎల్‌ఆర్‌ఎస్ అమలు ప్రక్రియ అనేక ఒడుదుడుకుల మధ్య నత్తనడకన సాగుతోంది. ఈ పథకం అమలు విషయంలో ప్రభుత్వాలకు స్పష్టత లేకపోవడం, నిబంధనలను ఎప్పటికప్పుడు మార్చుతుండడం, శాఖల మధ్య సమన్వయ లోపం, దరఖాస్తుదారుల్లో ఉదాసీనత వెరసి.. ఎల్‌ఆర్‌ఎస్ అమలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక ప్రహసంగా మారిపోయింది. గత బీఆర్‌ఎస్ సర్కార్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగైదుసార్లు ప్రకటనలు చేసినా అనుమతి లేని ప్లాట్లు, లే అవుట్‌ల క్రమబద్ధీకరణ ఆశించిన స్థాయిలో జరగలేదు.

బృందాలు ఏమైనట్టు?

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రతీ జిల్లాకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమించనున్నట్లు కిందటేడు జూలై నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటిపారుదలశాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులతో ఈ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. బృందాలు క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించింది. దీంతో దరఖాస్తు దారుల్లో ఆశలు చిగురించాయి. కానీ ఇది ఆచరణకు నోచుకోలేదు. తాజాగా ప్రభుత్వం మార్చి 31లోపు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేస్తే 25 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. అనధికారిక లే అవుట్‌లో కేవలం పది శాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉండి.. మిగిలినవి రిజిస్టర్ కాకపోతే 90శాతం ప్లాట్ల క్రమబద్ధీకరణకు అనుమతించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఇందులో కొత్తదనమేమీ లేదు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రవేశపెట్టినప్పుడే ఈఅవకాశం కల్పించారు. దీంతో చాలామంది రియల్టర్లు, అనుమతి లే అవుట్ల ప్లాట్లు కొన్నవారు మొదట్లో రూ.10వేల చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకున్నారు. ఆ తర్వాత రూ.1000 చొప్పున వసూలు చేశారు. అయినా క్రమబద్ధీకరణ జరగలేదు. ప్లాట్ కొనుగోలుకు సంబంధించిన సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ ఉన్నవారికి కూడా 25 శాతం రాయితీ ఇస్తున్నట్టు తాజాగా చేసిన ప్రకటన కొంత ఊరటకలిగిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ఈ రాయితీతోనైనా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో కదలికవస్తుందా? అన్నది సందేహమే. గతంలో ఎదురైన చేదు అనుభవాల దృష్ట్యా దరఖాస్తుదారుల్లో పెద్దగా ఉత్సాహం కనిపించడం లేదు.

ఆశపడి కొంటే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు


మిగతా 7వ పేజీలో...

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పచ్చజెండా

- 25 శాతం రాయితీ నిర్ణయంతో దరఖాస్తుదారులకు ఊరట
- అధిక సంఖ్యలో ముందుకు వచ్చే అవకాశం
- మున్సిపాలిటీలకు భారీగా సమకూరనున్న ఆదాయం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1.41లక్షల అప్లికేషన్లు
- ఐదేళ్లుగా పెండింగ్‌లో.. మళ్లీ కదలికతో చిగురిస్తున్న ఆశలు

1.41లక్షల దరఖాస్తులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,41,810 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఐదేళ్లగా పెండింగ్‌లో ఉన్నాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీలో 99,221, వర్ధన్నపేట మున్సిపాలిటీలో 460, పరకాల మున్సిపాలిటీలో 3,194, నర్సంపేట పురపాలక సంఘంలో 5,421 దరఖాస్తులు, జనగామ మున్సిపాలిటీలో 6300, మహబూబాబాద్ మున్సిపాలిటీలో 7546, తొర్రూరు పురపాలికలో 3,200, డోర్నకల్ మున్సిపాలిటిలో 3,600, మరిపెడ మున్సిపాలిటీలో 4,234, భూపాలపల్లి పురపాలక సంఘంలో 7,234, దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో మరో 1,400 దరఖాస్తులు అందాయి. ప్రతీ దరఖాస్తు రుసుము కింద రూ.వెయ్యి చొప్పన మొత్తం రూ.1,48,10,000 ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో దాఖలైన 99,221 దరఖాస్తుల్లో 10,871 పరిశీలించారు. 1,084 దరఖాస్తులకు సంబంధించి సరైన పత్రాలు లేవంటూ షార్ట్‌ఫాల్ చూపించారు. 80 దరఖాస్తులను తిరస్కరించారు. కేవలం 40 దరఖాస్తులను మాత్రమే ఆమోదించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీలో 460 దరఖాస్తుల్లో 230, పరకాల మున్సిపాలిటీలో 3,194 దరఖాస్తుల్లో కేవలం అయిదింటిని, నర్సంపేట మున్సిపాలిటీల 5,421 దరఖాస్తుల్లో 1,849 పరిశీలించారు. మిగతా మున్సిపాలిటీల్లో దరఖాస్తుల పరిశీలన అంతగా జరగలేదు.



వరంగల్ డీఎంహెచ్‌వోలో.. ఇష్టారాజ్యం!

- నిబంధనలకు విరుద్ధంగా బీడీఎస్ వైద్యులకు మెడికల్ ఆఫీసర్లుగా పోస్టింగులు
- ఆ పోస్టులకు ఎంబీబీఎస్, బీఏఎంఎస్‌లే అర్హులు
- వైద్యాధికారి కార్యాలయంలో 'డిప్యూటీ'దే హవా
- ఆరేళ్ల సర్వీసే.. అయినా ఆరు విభాగాలకు ఆయనే బాస్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ప్రజారోగ్యం అనగానే గుర్తుకొచ్చేది వైద్య, ఆరోగ్యశాఖనే. అలాంటి కీలకమైన శాఖకే అవినీతి జబ్బు పట్టింది. నియామకాల నుంచి బదిలీల వరకు అన్నీ అక్రమాలే. 'ఏం కావాలి.. ఎంత ఇవ్వగలవు.. ఏ పోస్టింగ్ కావాలి..' నిత్యం ఇదే తంతు. వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో అంతా వారి ఇష్టారాజ్యం అన్నట్టుగా జరుగుతోంది. అర్హత లేని వారికి కీలక బాధ్యతలు అప్పగిస్తూ అక్కడి అధికారులు అందిన కాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఎంబీబీఎస్, బీఏఎంఎస్ వైద్యులనే మెడికల్ ఆఫీసర్లుగా నియామించాల్సి ఉంది. అయితే డీఎంహెచ్‌వో కార్యాలయంలో పని చేసే ఓ డిప్యూటి ఒత్తిడితో నిబంధనలకు నీళ్లొదిలి.. దంత వైద్యులకు మెడికల్ ఆఫీసర్ పోస్టింగులు ఇవ్వటం విమర్శలకు తావిస్తోంది. అంతేకాకుండా ఆరేళ్ల సర్వీసు కూడా లేని ఓ వైద్యుడు ఏకంగా ఆరు విభాగాలకు బాస్‌గా చెలామణి అవుతుండటంపై ఆరోగ్యశాఖలోని వారే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బదిలీ జీవోలకు వ్యతిరేకంగా కొందరు స్థానికంగా తిష్టవేస్తున్నారు. వరంగల్ వైద్యఆరోగ్యశాఖలోని అవినీతి, అక్రమాల జబ్బును బాగు చేసేదెవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అర్హతలేకున్నా మెడికల్ ఆఫీసర్లుగా నియామకం

ఏ జబ్బు వచ్చినా తమను ఆదుకునేది వైద్యారోగ్యశాఖేనని ప్రజల నమ్మకం. అలాంటి కీలకశాఖలో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాము ఆడిందే ఆట.. పాడిందే పాట అనే చందంగా వ్యవహరిస్తున్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న పథకాలను దారిమళ్లిస్తున్నారు. నిపుణులైన వైద్యులను నియమించి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే.. అర్హతలేని వారిని అందలం ఎక్కిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను కొందరు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, అర్హత లేని వైద్యులను నియమించి కొందరు వైద్యులు సర్కారు సంకల్పాన్ని నీరుగారుస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా పేద ప్రజలకు ప్రభుత్వం ఉచిత వైద్యాన్ని అందిస్తుంది. ఈ కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లుగా ఎంబీబీఎస్ వైద్యులనే నియవిస్తుంది. ఎంబీబీఎస్ వైద్యులు ఎవరు ఉద్యోగం చేసేందుకు ముందుకు రాకపోవతే సెకండ్ ఛాన్స్‌గా బీఏఎంఎస్ వైద్యులకు ప్రాధాన్యమిస్తుంది. అయితే వరంగల్ వైద్య, ఆరోగ్యశాఖలో గత డీఎంహెచ్‌వో నిర్లక్ష్యం.. కార్యాలయంలో పని చేసే ఓ డిప్యూటీ ఒత్తిళ్లతో మెడికల్ ఆఫీసర్ పోస్టుకు అర్హతలేని దంత వైద్యులకు (బీడీఎస్‌లు) పోస్టింగ్‌లు ఇచ్చారు. వరంగల్ ఎస్‌ఆర్ తోట హెల్త్ సెంటర్‌తో పాటు వరంగల్, హనుమకొండ జిల్లాలో పది మందికి పైగా బీడీఎస్‌లకు మెడికల్ ఆఫీసర్లుగా కొలువులు కొట్టేసి.. కొన్నేళ్లుగా వేతనాలు పొందుతున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఎంతో మంది అర్హులైన ఎంబీబీఎస్‌లు, బీఏఎంఎస్ వైద్యులున్నా డెంటిస్టులకు మెడికల్ ఆఫీసర్స్‌గా పోస్టింగులు ఇవ్వడం వెనుక సదరు డిప్యూటీ హస్తం ఉందనే ప్రచారం జరుగుతోంది. మెడికల్ ఆఫీసర్స్ పోస్టులు కొట్టేసిన వారిలో సదరు డిప్యూటీ సతీమణి కూడా ఉండటం వైద్యవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బీడీఎస్‌లకు మెడికల్ ఆఫీసర్లుగా అవకాశం ఇవ్వటం వల్ల ప్రజలకు ఉపయోగం ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి. కేవలం డెంటల్ విభాగం తప్ప వారికి ఇతర సాధారణ వ్యాధులకు ఎలాంటి చికిత్స, పరీక్షలు చేసే అవకాశం ఉండదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎంబీబీఎస్‌లకు అవకాశమిచ్చింది. అయితే కొన్నేళ్లుగా వివిధ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, హెల్త్ సెంటర్లలో మెడికల్ ఆఫీసర్లుగా బీడీఎస్‌లు కొనసాగటంపై వైద్య, ఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది. వీరిపై వైద్యఆరోగ్యశాఖ ఎందుకు చర్యలు తీసుకోవటం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఆ పోస్టులు నిబంధనలకు విరుద్ధమే..

సాంబశివరావు, డీఎంహెచ్‌వో, వరంగల్

బీడీఎస్‌లను మెడికల్ ఆఫీసర్లుగా నియమించటం నిబంధనలకు విరుద్ధమే. నేను ఇక్కడికి రాకముందు నుంచి వారు ఆ కొలువుల్లో కొనసాగుతున్నారు. గతంలో కాంట్రాక్టు పద్ధతిలో బీడీఎస్ వైద్యులను తీసుకున్నట్టుగా తెలిసింది. ప్రస్తుతం రెగ్యులర్ పోస్టింగులకు బీడీఎస్ వైద్యులు అర్హులు కాదు. నిబంధనలకు విరుద్ధంగా నియామకం జరిగిన విషయంపై పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారిచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

వైద్య, ఆరోగ్యశాఖలో డిప్యూటీదే హవా..

వరంగల్ వైద్య, ఆరోగ్యశాఖలో ఓ డిప్యూటీదే హవా కొనసాగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2024 జూలైలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ కోసం జీవో నెం.80ని తీసుకవచ్చింది. ఈ జీవో ప్రకారం ఫోకల్ నుంచి నాన్ ఫోకల్, నాన్ ఫోకల్ నుంచి ఫోకల్‌కు బదిలీలు జరగాలనేది లక్ష్యం. కాగా, సదరు డిప్యూటీ వైద్య, ఆరోగ్యశాఖలో పెద్దఎత్తున పైరవీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఫోకల్ టు ఫోకల్ బదిలీ చేయించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌సీ నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయంలో తిష్టవేశారని వైద్య ఉద్యోగులు భగ్గుమంటున్నారు. అలాగే కనీసం ఆరేళ్ల సర్వీసు కూడా లేకున్న నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటీ సీట్లో కూర్చున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ డిప్యూటీ

మిగతా 8వ పేజీలో...



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఉపాధిహామీ పథకంలో నిర్దేశిత పనులు పూర్తి చేయాలి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో ఉపాధిహామీ పథకానికి సంబంధించి నిర్దేశించిన పనులను ప్రణాళికా ప్రకారం గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఈఈ, డీఈ, ఏఈలతో గురు వారం కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధిహామీ పథకానికి సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన పనులు, వాటి పురోగతి, రానున్న మార్చి నాటికి సంబంధించి ఉపాధి పనుల గురించి వివరాలు కలెక్టర్ ప్రావీణ్య అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. అవెన్యూ ప్లాంటేషన్ కోసం అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. మొక్కల పెంపకానికి సంబంధించి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీలో వ్యవసాయ అనుబంధ పనులకు సంబంధించినవి పూర్తి చేయాలన్నారు. ఉపాధిహామీ పనులు, ఉపాధి కూలీలకు పని దినాల సంఖ్యను పూర్తి స్థాయిలో కల్పించాలన్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. వ్యవసాయ అనుబంధ పనులు పూర్తి చేయడపై దృష్టి సారించాలన్నారు. ఈ సవవేశంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, అడిషినల్ డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, డీఈ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.



హాస్యనటుడు బ్రహ్మానందాన్ని స్ప్రింగ్ స్ప్రీ వేడుకలకు ఆహ్వానిస్తున్న స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య

వచ్చె.. వచ్చె.. వసంతోత్సవం

- వరంగల్ నిట్‌లో 28 నుంచి స్ప్రింగ్ స్ప్రీ
- ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందం
- మూడు రోజుల సంబరానికి ముస్తాబవుతున్న నిట్

7

మత్తు పదార్థాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

అధికారులను ఆదేశించిన వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సత్యశారద సూచించారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో గురువారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్‌లతో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించి అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యల గురించి, ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదయ్యాయనే వివరాలను పోలీసు, ఎక్సైజ్, టీఎస్ న్యాబ్, అటవీ, జీఆర్‌పీ, పోలీసులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెంట్రల్ జోన్ డీసీపీ రవీందర్ మాట్లాడుతూ.. ప్రతీ నెల నార్కోటిక్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100, సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ విజయలక్ష్మీ, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చందర్, ఎఫ్ఆర్వో సందీప్, నార్కోటిక్స్ డీఎస్పీ సైదులు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అరవింద్ కుమార్, టీఎస్ న్యాబ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ధాన్యం సేకరణ ప్రణాళికబద్ధంగా చేపట్టాలి

ధాన్యాన్ని సేకరించేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రబీ 2024-25 ధాన్యం సేకరణ, 2023-24 సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియపై గురువారం పౌరసరఫరాల శాఖ అధికారులు, సంస్థ మేనేజర్, మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2024-25 రబీ సీజన్‌లో 2 లక్షల 10వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం వస్తుందని అంచనా ఉందని, ధాన్యాన్ని ప్రణాళికబద్ధంగా సేకరించాలన్నారు. ఎప్పటికప్పుడు గోదాములో ధాన్యం నిల్వలను పరిశీలించాలని, రైస్‌మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ పత్రాలను తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ నుంచి సరఫరా అవుతున్న బియ్యం దుర్వినియోగం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీఎంఆర్ బియ్యం డెలివరీ సమయంలో బఫర్ గోడౌన్‌ల వద్ద టెక్నికల్ అసిస్టెంట్ల కొరత వల్ల లారీలు ఆగుతున్నాయని, టెక్నికల్ అసిస్టెంట్లను కేటాయించాలని మిల్లర్లు కలెక్టర్‌ను కోరగా, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మీ, డీఏవో అనురాధ, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, మేనేజర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, కో ఆపరేటివ్ అధికారి నీరజ, ఆర్డీవో ఉమారాణి, మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మిల్లర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు 1912 టోల్‌ఫ్రీ

- వేసవి డిమాండ్‌కు అనుగుణంగా కరెంటు సరఫరా
- ఎస్‌ఈలు వెంకటరమణ, మధుసూదన్‌రావు

రాంనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వినియోగదారులు 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవచ్చని హనుమకొండ, వరంగల్ ఎస్‌ఈలు వెంకటరమణ, మధుసూదన్‌రావు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు వచ్చినా, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, లోవోల్టేజ్, బ్రేక్‌డౌన్స్, ప్రమాద భరితంగా ఉన్న స్తంభాలు, వైర్లు, విద్యుత్ బిల్లులో తేడాలు, పేరు మార్పు, ఆగిపోయిన మీటరు సమస్యలు, నూతన సర్వీసు మంజూరు, సర్వీసు రద్దు వంటి విద్యుత్ సమస్యలపై 1912 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు. కార్పొరేట్ కార్యాలయంలో 1912కు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని, ప్రతీ ఫిర్యాదుపై సమీక్ష చేసి సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా..

విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఎస్‌ఈ మధుసూదన్‌రావు తెలిపారు. వరంగల్ సర్కిల్‌లో ఈ నెల 17న గరిష్ఠంగా 4. 43 మిలియన్ యూనిట్లు నమోదయ్యాయని, రాబోయే మూడు నెలల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తుగా లోడ్ పెరిగే ప్రాంతాల్లో 184 కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు 40 ట్రాన్స్‌ఫార్మర్లకు సామర్థ్యం పెంచామన్నారు. 33/11 కేవీ సబ్ స్టేషన్లలో కొత్తగా 5 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యామ్నాయ పద్ధతిలో విద్యుత్ సరఫరా చేసేందుకు 16 ఇంటర్ లింకింగ్ లైన్లను ఏర్పాటు చేశామన్నారు. హనుమకొండ సర్కిల్‌లో ఈ నెల 5న గరిష్ఠంగా 5.41 మిలియన్ల యూనిట్ నమోదైందని ఎస్‌ఈ వెంకటరమణ తెలిపారు. లోడ్ పెరిగే ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి కొత్తగా 48 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి, 31 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామన్నారు. కొత్తగా 2 పవర్ ట్రాన్స్ ఫార్మ ర్లు ఏర్పాటు చేసి 5 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామన్నారు. అలాగే 8 ఇంటర్ లింక్ లైన్లను ఏర్పాటు చేసినట్లు వెంకటరమణ వివరించారు.

పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేయూలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేయూ పార్ట్‌టై మ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంతో సమస్యలపై చర్చించారు. అలాగే వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వై.రాంబాబు మాట్లాడుతూ.. అర్హత కలిగిన పార్టుటైమ్ అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలని, పీరియడ్‌కు రూ.వెయ్యి రెమ్యూనరేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. తమకు పరిపాలన పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. వీటిపై వీసీ, రిజిస్ట్రార్‌లు సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్‌పై పాలక మండలి సమావేశంలో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రెమ్యూనరేషన్ పెంపుపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారుల దృష్టికి తీసుకుపోతామని చెప్పారు. పరిపాలన పదవుల్లోనూ అవకాశం కల్పిస్తామని చెప్పినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కుప్టా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేంద్రనాయక్, డాక్టర్ తిరుణహరి శేషు, బక్కి శ్రీనివాస్, కోమటి లక్ష్మీనారాయణ, కొర్ర రాజన్న, నవీన్, ప్రశాంత్, సరిత, రాజేందర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పార్ట్‌టైం అధ్యాపకుల సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

- ఓ కుటుంబంలోని నలుగురిపై దాడి
- ముగ్గురికి కత్తి పోట్లు.. ఒకరి పరిస్థితి విషమం
- హసన్‌పర్తి మండలం మడిపల్లిలో ఘటన

హసన్‌పర్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన అంతర్గత కలహాలు.. ఘర్షణకు దారి తీశాయి. ఈ క్రమంలో ఓ కుటుంబంలోని నలుగురు కత్తిపోట్లకు గురైన సంఘటన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని మడిపల్లిలో గురువారం రాత్రి జరిగింది. మడిపల్లికి చెందిన వల్లెపు కనకయ్యకు ఇద్దరు కూతుళ్లు. మగ సంతానం లేకపోవడంతో కనకయ్య ఆస్తిపై అతడి తమ్ముడి కుమారులు కన్నేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో కొంతకాలంగా వారి మధ్య విబేధాలు తలెత్తినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఉం టున్న కనకయ్య కూతురు పిల్లలు పల్లపు అన్వేష్, పల్లపు రమేష్‌తో పాటు మరో మిత్రుడు రేణికుంట్ల అజయ్ గురువారం మడిపల్లిలోని ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. ఆ ముగ్గురు మద్యం తాగేందుకు ఊరు శివారు లోని కల్లు మండువకు వెళ్లారు. అనంతరం అన్వేష్ తన తాత కనకయ్య అన్న కుమారుడైన మడిపల్లికి చెందిన నరేష్‌కు ఫోన్ చేసి కల్లు తాగుదా మని పిలిచాడు. అక్కడికి వచ్చిన తర్వాత వారిద్దరి మధ్య మాటామాటా పెరిగి పెద్ద గొడవకు దారి తీసింది. ఆ తర్వాత గ్రామంలోకి రాగా.. కనక య్యతో పాటు అతడి కూతురు కుమారులు అన్వేష్, రమేష్, రేణికుంట్ల అజ య్‌పై మడిపల్లికి చెందిన జలంధర్, క్రాంతి, నరేష్ అనే వ్యక్తులు కత్తులతో దాడి చేసినట్టు గ్రామస్థులు తెలిపారు. దీంతో అన్వేష్, రమేష్, అజయ్‌లకు కత్తిపోట్లు కాగా కనకయ్యను రోకలిబండతో కొట్టడంతో తొంటి విరిగిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. గాయపడిన వీరిని అంబులెన్స్‌లో ఎం జీఎంకు తరలించగా వారిలో పల్లపు రమేష్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయంపై స్థానిక ఎస్సై రవీందర్‌ను సంప్రదిం చగా.. ఘటన జరిగింది వాస్తవమేనని, కానీ తమకు ఫిర్యాదు అందలేదని, వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని.. భర్త ఆత్మహత్య

మహబూబాబాద్ జిల్లాలో ఘటన

కురవి (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా కురవిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. కురవికి చెందిన తరాల యాదగిరి (42)కి 20 ఏళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు పిల్లలు జన్మించిన తర్వాత మొదటి భార్య చనిపోయింది. కొద్దిరోజుల తరువాత యాదగిరి మరో మహిళను వివాహం చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు జన్మించాక యాదగిరి మద్యం సేవిస్తుండడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న యాదగిరి గురువారం ఉదయం పెట్రోల్ కొని తెచ్చుకుని, ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో యాదగిరి మృతదేహం 60 శాతం మంటల్లో కాలిబూడిదైంది. ఎస్సై సతీష్ ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు జరిపి, ఆత్మహత్యగా నిర్ధారించారు. మృతుడి కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

భార్య, అత్తమామలపై కత్తితో దాడి

- దాడిలో తీవ్రంగా గాయపడిన భార్య పల్లవి
- అత్తామామలకు గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స
- వరంగల్ పోచమ్మమైదాన్‌లో ఘటన


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న పల్లవి

మట్టెవాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, కుటుంబ గొడ వల కారణంగా భార్య, అత్త, మామలపై వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వరం గల్ పోచమ్మమైదాన్ ఎస్సీ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. మట్టెవాడ పోలీసులు, స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ పోచమ్మమైదాన్ ఎస్సీ కాలనీకి చెందిన జన్ను వీరస్వామి అలియాస్ బాబు - అనిత దంప తుల కుమార్తె జన్ను పల్లవి కేఎంసీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఈమెకు సుమారు రెండున్నరేళ్ల కిందట వరంగల్ ఉర్సు ప్రాంతానికి చెందిన కోట చంద్రశేఖర్‌తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర వయస్సు ఉన్న కుమారుడు ఉన్నాడు. చంద్రశేఖర్ పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో కొంత కాలంగా చంద్రశేఖర్ - పల్లవిల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పల్లవి తన తల్లిగారింటి వద్ద ఉంటూ ఉద్యోగం చేస్తోంది. కాగా, గురువారం అకస్మాత్తుగా ఎస్సీ కాలనీకి చంద్రశేఖర్ వచ్చి ఇంట్లో ఉన్న పల్లవిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో పల్లవి తల, ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. దాడి జరుగుతున్న క్రమంలో అడ్డువెళ్లిన అత్తమామలైన వీరస్వామి, అనితలపై సైతం దాడి చేయడంతో వారికి గాయాలయ్యాయి. ఒక్కసారిగా జరిగిన ఘటనతో ఇల్లు రక్తపు మడుగుగా మారింది. హుటాహుటిన స్థానికులు చేరుకొని గాయాలపాలైన ముగ్గురిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. దాడిలో తీవ్రగాయాలపాలైన పల్లవి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు.

పథకం ప్రకారమే..

భార్యాభర్తల మధ్య కుటుంబ గొడవలు, చంద్రశేఖర్ ఎలాంటి పని చేయకపోవడంతో అటు భార్య, అత్తమామలతో తరుచూ గొడవలు జరిగేవి. ఎవరూ లేని సమయంలో చంద్రశేఖర్ అదను చూసి దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. నిందితుడి కోసం మట్టెవాడ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడికి సంబంధించిన మిత్రులు, కుటుంబ సభ్యులను విచారిస్తున్నట్లు తెలిసింది. ఘటన జరిగిన వీరస్వామి ఇంటిని గురువారం మట్టెవాడ సీఐ టి.గోపి, ఎస్ఐ సాంబయ్య పరిశీలించి వివరాలు సేకరించారు. దాడి జరిగిన తీరును పరిశీలించారు.

ఆర్టీసీ కార్మికులకు పునర్నియామక పత్రాలు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ రీజియన్ పరిధిలోని 9 డిపోల లో వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించిన ఆర్టీసీ కార్మికులకు గురువారం పునర్నియామక పత్రాలు అందించినట్లు వరంగల్ ఆర్‌ఎం డి. విజయభాను తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌కు వివిధ కారణాలతో తొలగించిన ఆర్టీసీ కార్మికులు అర్జీలు పెట్టుకోవడంతో వారిని విధుల్లోకి తీసుకున్నారు. ఈ మేరకు వరంగల్ రీజినల్ పరిధిలో మొత్తం నలుగురు డ్రైవర్లు, నలుగురు కండక్టర్లకు పునర్నియామక పత్రాలు అందించినట్లు ఆర్‌ఎం డి. విజయభాను తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


సారంగం (ఫైల్)

ఖానాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధుడు మేడారం జాతరకు వెళ్లి అదృశ్యమైనట్లు ఆయన భార్య సుగుణమ్మ గురువారం తెలిపారు. వృద్ధుడు జబ్బ సారంగం(60) ఈ నెల 13న తమ బంధువులతో కలిసి మేడారం జాతరకు వెళ్లి జాతరలో తప్పి పోయాడు. మేడారంతో పాటు సమీప గ్రామాల్లో వెతికినా సారంగం ఆచూకీ లభించలేదని ఆమె తెలిపారు. ఈ విషయమై తాడ్వాయి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సారంగం ఆచూకీ లభిస్తే 9959692278, 9390787847 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

పట్టపగలే హత్యలు జరుగుతుంటే సీఎం ఏం చేస్తున్నారు?

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేఏ పాల్

బాలసముద్రం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్ట పగలే హత్యలు జరుగుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఏంచేస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రశ్నించారు. గురువారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లిలో బుధవారం సాయంత్రం హత్య జరిగి సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ నిందితులను ఇంత వరకు పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రాజ లింగమూర్తి కుటుంబానికి న్యాయం చేయకపోతే సంబంధిత ప్రజాప్రతినిధులు, పోలీసుల కుటుంబాలను దేవుడు నాశనం చేస్తాడని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డి హోంమినిస్టర్‌గా రాజీనామా చేసేంత వరకు తమ పోరాటం ఆగదని కేఏ పాల్ ప్రతిజ్ఞ చేశారు. రెడ్డి, వెలమ దొరల రాజ్యం వద్దని, బీసీ అయిన తనను ఒక్కసారి సీఎంగా గెలిపిస్తే అద్భుతాలు జరుగుతాయన్నారు. ప్రస్తుతం బీసీలు వివిధ పార్టీల్లో బానిసలుగా పనిచేస్తున్నారని, బ్రాహ్మణ పార్టీలో ఉన్న బండి సంజయ్, ఈటల రాజేందర్‌లు ఆ పార్టీ నుంచి బయటకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీలకు రాజ్యాధికారం కోసం తాను ఒక్కడినే ఎంతకాలం పోరాటం చేస్తానని, అన్ని పార్టీలో ఉన్న బీసీలు బయటకు వచ్చి రాజ్యాధికారం పొందేందుకు పాటుపడాలని అన్నారు.

అందరి మద్దతుతో ఎమ్మెల్సీగా విజయం సాధిస్తా..

టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సుందర్‌రాజ్ యాదవ్


సుందర్‌రాజ్ యాదవ్‌కు మద్దతు తెలుపుతున్న టిగారియా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులు గౌడ్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా అందరి మద్దతు తనకే ఉందని, ఎమ్మెల్సీగా గెలిచేది తానేనని సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం హనుమకొండలోని ఎస్‌బీహెచ్ కాలనీలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని ప్రభు త్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉపాధ్యాయులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తనకు ఉపాధ్యాయులు, గురుకులాల సమస్యలు తెలుసునని, తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే గురుకుల పాఠశాలల్లో పర్మినెంట్ డిప్యూటీ వార్డెన్ నియామకం, గురుకుల ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయుగా గుర్తించడానికి 010 కింద జీతాలు ఇవ్వడం కోసం, నైట్ స్టేలను ఎత్తివేయడం, ప్రమోషన్లలో 70.30 శాతం రెగ్యులర్ వారికి ఇచ్చేలా, ప్రధాన ఆచార్యుల పోస్టులు సీనియారిటీ ప్రకారం కృషి చేస్తానని తెలిపారు. అలాగే సీపీఎస్ రద్దు కోసం పోరాడుతానన్నారు. అందరికీ అందుబాటులో ఉండి ఉపాధ్యాయులు, ఆచార్యులు, ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని సుందర్‌రాజ్ పేర్కొన్నారు. కాగా, ఈ సందర్భంగా సుందర్‌రాజ్ యాదవ్‌కు తెలంగాణ గవర్నమెంట్ ఆల్ గురుకులాల ఎంప్లాయీస్ అసోసియేషన్ (టిగారియా) సంపూర్ణ మద్దతు తెలిపింది. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ మాట్లాడుతూ.. సుందర్‌రాజ్ యాదవ్ గురుకులాల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారని నమ్మకంతో పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. సుందర్‌రాజ్ యాదవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

కారును అడ్డగించి వైద్యుడిపై దాడి

- ఇనుపరాడ్డుతో కొట్టిన గుర్తుతెలియని దుండగులు
- పరిస్థితి విషమం.. ప్రైవేటు ఆస్పత్రికి తరలింపు
- భట్టుపల్లి ప్రధాన రహదారిపై ఘటన


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కరీమాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని భట్టుపల్లి ప్రధాన రోడ్డులో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఓ వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట ప్రాంతంలో ఓ ప్రైవేటు క్లినిక్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న గాదె సుమంత్ రెడ్డి గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తన కారులో భట్టుపల్లి రోడ్డు గుండా ఉర్సు వైపు వస్తున్నాడు. అమ్మవారి పేట క్రాస్ రోడ్డుకు దగ్గరికి రాగానే గుర్తు తెలియని దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి డాక్టర్ ప్రయాణిస్తున్న కారును అడ్డగించి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో డాక్టర్ తలపై ఇనుప రాడ్డుతో బలంగా కొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడే కుప్పకూలిపోయాడు. దాడి చేస్తున్న విషయం తెలుసుకున్న స్థానికులు విషయాన్ని మడికొండ పోలీసులతో పాటు, మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఇరు పోలీస్ స్టేషన్‌ల అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని రక్తపు మడుగులో పడి ఉన్న క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించి దర్యాప్తు ప్రారంభించారు. కాగా, దాడిలో గాయపడిన సుమంత్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. బాధితుడు నగరంలోని హంటర్‌రోడ్డు వాసిగా పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్, కాజీపేట ఏసీపీ తిరుమల్ మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం, మడికొండ సీఐ కిషన్ సందర్శించి దాడికి గల కారణాలను పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.


రక్తపు మడుగులో పడి ఉన్న వైద్యుడు సుమంత్‌రెడ్డి

పోలీసుల మధ్య గందరగోళం

దాడి జరిగిన ప్రదేశం తమ పరిధి కాదంటే తమ పరిధి కాదని అటు మడికొండ పోలీసులు, ఇటు మిల్స్‌కాలనీ పోలీసులు కాసేపు వాదించుకున్నారు. రెండు పోలీస్‌స్టేషన్‌ల సీఐల మధ్య సమన్వయ లోపం కారణంగా విచారణ ఆలస్యంగా కొనసాగింది. పోలీస్‌స్టేషన్‌ల పరిధిని తెలిపే సూచిక బోర్డులు లేకపోవడంతో కాసేపు పోలీసుల మధ్య గందరగోళ పరిస్థితి నెలకొంది. దాడి జరిగిన తీరు పట్ల విచారణ చేపట్టాల్సిన పోలీసులు.. సంఘటనా స్థలంలో వాదనలకు దిగడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

చేపల వేటకు వెళ్లి..

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నెల్లికుదురు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని మేచరాజుపెల్లి శివారు కట్టుకాలువ తండాలో బుధవారం రాత్రి జరిగింది. గురువారం ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం. కట్టుకాలువ తండాకు చెందిన జాటోత్‌రెడ్డి (28)తో పాటు అదేతండాకు చెందిన ధరంసోత్‌రెడ్డి, బీకు, గుగులోత్‌రాజు, సోమ్లా, మోహన్, బాదావత్ తిరమలేష్, జాటోత్ నర్సింహ, నామాలు కలిసి బుధవారం ఆకేరు వాగులో చేపలు పట్టడానికి వెళ్లారు. విద్యుత్ తీగలతో చేపలు పట్టుతున్న క్రమంలో జాటోత్‌రెడ్డి నీటిలోకి దిగాడు. వెంటనే విద్యుత్ ఘాతంతో నీటిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య మమత ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు జాటోత్‌రెడ్డి మృతికి కారణమైన 8 మందిపై కేసు నమోదు చేసి, పోస్టు మార్టంకు తరలించినట్లు ఎస్సై రమేష్ వివరించారు

బావిలో క్రేన్ పడి ఒకరి మృతి

నలుగురికి గాయాలు


ఎల్లయ్య మృతదేహం

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బావిలో పూడిక తీస్తుండగా క్రేన్ పడిపోవడంతో ఒకరు మృతి చెందగా, నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో గురువారం జరిగింది. ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు కథనం ప్రకారం.. గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఏడు మేకల సంపత్ అనే రైతు వ్యవసాయ బావిలో పూడిక పేరుకుపోయింది. దీంతో పూడిక తీసేందుకు గన్నుకోట ఎల్లయ్య అనే వ్యక్తికి బావిని పూడిక తీసేందుకు కౌలుకు ఇచ్చాడు. గురువారం సాయంత్రం పూడిక తీస్తుండగా, ఒక సారి బావిలో క్రేన్ కుప్పకూలింది. దీంతో క్రేన్ నడు పుతున్న గండికోట ఎల్లయ్య (70) అక్కడికక్కడే బావిలో పడి మృతి చెందాడు. బావిలో ఉన్న వేల్పుల వెంకటయ్య క్రేన్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు కూలీలైన మల్లయ్య, ఎల్లయ్య, సంపత్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వెంకటయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో 108 ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్టు

- బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

మడికొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మడికొండలోని అయోధ్యపురం రైల్వేగేటు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులకు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ తారసపడ్డారు. వారిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద బంగారు నగలు, నగదు లభించాయి. పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారిద్దరూ కాజీ పేట మండలం కడిపికొండకు చెందిన బానోత్ ఉదయ్, బిర్రు ప్రణీత్ అని తెలి పారు. పోలీసులు వారిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించగా ఇద్దరు ఈ నెల 12న కాజీపేట మండలం కడిపికొండ శివారులోని రాజీవ్ గృహ కల్ప (ఇందిరమ్మ కాలనీ)కి చెందిన కోట శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి ఉండడం గమనించి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి 240 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.8700నగదు చోరీ చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన కాజీపేట ఏసీపీ తిరుమల్, మడికొండ, కాజీపేట,, దర్మసాగర్, కమలాపూర్ ఇన్‌స్పెక్టర్లు పుల్యాల కిషన్, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్, హరికృష్ణతో పాటు మడికొండ, వంగర ఎస్సై లు రాజ్‌కుమార్, దివ్య, హెడ్ కానిస్టేబుల్ రామ నాథం, కానిస్టేబుళ్ల రాకేష్, నాగరాజులను సెం ట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ కిషన్

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2306	2100
పల్లికాయ (సూక)	6110	4600
పల్లికాయ (పచ్చిది)	5600	3100
కందులు	7227	5540
పెసళ్లు	7029	4645
పత్తి	6810	5800
కొత్త పత్తి	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13600	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	16300	11500
యూఎస్ 341	13300	11500
దేశీ	22000	20500
ఎల్లో మిర్చి	17000	17000
దీపిక	16100	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



చాక్‌పీస్‌లపై పర్యావరణ నినాదాలు


పెన్సిల్ లెడ్‌పై న్యూ ఇయర్ విషెస్


నరేష్ సాధించిన పతకాలు

సూక్ష్మ కళ.. నైపుణ్యం భళా

రాణిస్తున్న అనుముల నరేష్

మరిపెడ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : 'కుక్క, పిల్ల.. సబ్బు బిళ్ల.. అగ్గిపుల్ల.. కాదేదీ కవితకనర్హం' అన్నట్టుగా సృజనాత్మకత ఉండాలే కాని, సృష్టిలో పనికిరాని వస్తువంటూ ఉండదని నిరూపిస్తున్నాడు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెంకు చెందిన అనుముల నరేష్. హరినాథ్‌బాబు-ఉమ దంపతుల కుమారుడైన నరేష్ బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి ఓ ప్రైవేట్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆయన చేతిలో ఏది పడినా అందమైన రూపంగా మారుతుంది. పెసర దినుసు, పెన్సిల్ లిడ్, పోస్టుకార్డు, బియ్యపు గింజ, చాక్‌పీస్‌లపై పాతికకు పైగా సూక్ష్మ చిత్రాలను తీర్చిదిద్దడం ఆయనకు 'పెన్ను'తో పెట్టిన విద్య అని నిరూపిస్తున్నాడు. పదో తరగతిలో ఉండగా వినాయకుడి చిత్రం గీయడం ద్వారా మొదలైన ప్రస్థానం ఇప్పటి వరకు 25 చిత్రాలతో పాటు, పలు కళాఖండాలతో కొనసాగుతోంది.


పూర్వ కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న అనుముల నరేష్ (ఫైల్)


నరేష్

నరేష్ రూపొందించిన కళా రూపాల్లో కొన్ని..

పోస్టుకార్డుపై 105 సార్లు జాతీయ గీతం. 144 ఇంటూ 144 సుడోకు బోర్డు, అందులో 20,736 స్వేర్ బాక్స్‌లుంటాయి. చాక్‌పీస్‌పై స్వామి వివేకానందుడు, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, అంబేద్కర్, ప్రధాని మోదీ బొమ్మలు, పర్యావరణం గురించి నినాదాలు లిఖించాడు. ఓటర్లను చైతన్యం పరచడం కోసం జాతీయ ఓటర్స్ డే సందర్భంగా బియ్యపు గింజపై వంద శాతం ఓటింగ్ కోసం నినాదాలు రాశాడు.

సందర్భోచితం.. ఆకృతి ప్రత్యేకం

తన కంటూ ప్రత్యేకత చాటాలనుకుని నరేష్ జాతీయ, ప్రాంతీయ పండుగల సమయాల్లో ప్రజలను చైతన్యపరచడం కోసం సుద్దముక్కలపై బొమ్మలు, నినాదాలను రూపొందిస్తున్నాడు. బతుకమ్మ పండుగకు పెన్సిల్ లెడ్‌పై బతుకమ్మను అందంగా చిత్రించి అందరినీ ఆకట్టుకున్నాడు.

రికార్డులు.. ప్రశంసలు.. సత్కారాలు

జాతీయ స్థాయిలో పలు రికార్డుల్లో చోటు దక్కించుకున్న నరేష్ ఎవరెస్ట్ బుక్ ఆఫ్ రికార్డు, అసిస్టు వరల్డ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, సూపర్‌బీ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నాడు. అలాగే మహబూబాబాద్ జిల్లా పూర్వ కలెక్టర్ ప్రీతిమీనా చేతుల మీదుగా ఉత్తమ కళాకారుడి పురస్కారం అందుకున్నాడు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ నుంచి బెస్ట్ అవార్డు, అప్పటి ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి నుంచి ఆర్టిస్టు వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. ఎస్పీ రంగారావు ఎక్స్‌లెన్సీ అవార్డును మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తీసుకున్నారు.

వీరభద్రుడి లగ్గానికి రారండోయ్

కురవి జాతరకు ఏర్పాట్లు
ప్రచార రథం ప్రారంభం..
ఉత్సవాల షెడ్యూల్ విడుదల
ఈనెల 25 నుంచి వచ్చే నెల 12 వరకు వేడుకలు

కురవి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కురవిలో జరిగే వీరభద్రస్వామి, భద్రకాళిమాత కల్యాణానికి ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. స్వామివారి లగ్గానికి రావాలంటూ ఆలయ అధికారులు ఆహ్వాన పత్రికలు, పోస్టర్‌లు, కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. కరపత్రాలు ఇంటింటికీ పంపుతూ, బస్సులు, గ్రామాల్లో గోడలకు పోస్టర్లు అతికిస్తూ, అతిథులకు ఆహ్వానపత్రికలు పంపుతూ భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారి కల్యాణానికి హాజరయ్యేలా అధికారులు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. జాతర వివరాలు ప్రజలకు తెలిసేలా ఈసారి ప్రచార రథాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ రథాన్ని ఆలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ఈవో సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

25న అంకురార్పణతో జాతర ప్రారంభం

కురవి శ్రీవీరభద్రస్వామి జాతర ఈనెల 25న మంగళవారం సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో ప్రారంభం కానుంది. 26న బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకుని 11 గంటల వరకు పూర్ణాభిషేకం, రాత్రి 7 గంటలకు గ్రామసేవ, ఎదురుకోలు, తెల్లవారుజామున (గురువారం) 12:30 గంటలకు శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. మార్చి 1వ తేదీ శనివారం కురవి పెద్దచెరువులో తెప్పోత్సవం కార్యక్రమాన్ని సాయంత్రం 6:30 గంటలకు నిర్వహిస్తారు. 3వ తేదీ సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, 4న ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు బండ్లు తిరిగే కార్యక్రమం, పారువేట నిర్వహిస్తారు. 5న ఉదయం దోపోత్సవం, వసంతోత్సవం, త్రిశూలస్నానం, సాయంత్రం ఏకాంత సేవ, నాగవెల్లి పూజాకార్యక్రమాలను నిర్వహిస్తారు. 6న సాయంత్రం స్వామివారి పవళింపుసేవ, 10న శ్రీపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం, 12న పదహారు రోజుల పండుగ పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.


జాతర ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ఈవో సత్యనారాయణ


వీరభద్రస్వామి కల్యాణ ఆహ్వానపత్రిక

మహారాజ శ్రీ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు తుంగతుర్తి
ఓ. ఎస్. నెం. 34/2010
ఇన్
ఐ.ఏ.నెం.62/2023
ఇన్
ఐ.ఏ.నెం.61/2024

మధ్య:

వాది

1. జొన్న రాజి రెడ్డి లేట్ (వారసులు)
2. కొప్పుల రామ
3. జొన్న మంగమ్మ

మరియు

మహ్మద్ ఇబ్రహీం మరియు 64 ఇతరులు (ప్రతి వాదులు)

ప్రతివాది నెం. 1) మొహ్మద్ ఇబ్రహీం తండ్రి జాసిం, వయస్సు 77 సంవత్సరాలు, గ్రామం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 8) జొన్న రజిని తండ్రి లేట్ వీర రెడ్డి, వయస్సు 29 సంవత్సరాలు, గ్రామం మాలిపురం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 9) జొన్న రమ్య తండ్రి లేట్ వీర రెడ్డి, వయస్సు 27 సంవత్సరాలు, గ్రామం మాలిపురం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 11) పినింటి మంగ, భర్త వెంకట్ రెడ్డి, వయస్సు 45 సంవత్సరాలు, R/o.మాలిపురం క్రాస్ రోడ్స్, గ్రామం& మండలం మాలిపురం, జిల్లా నల్లగొండ.
ప్రతివాది నెం.13) బదారు స్రవంతి భర్త రవీందర్ రెడ్డి, వయస్సు 32 సంవత్సరాలు, గ్రామం మాలిపురం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 14) బదారు శ్రావణ్ కుమార్ తండ్రి రవీందర్ రెడ్డి, వయస్సు 65 సంవత్సరాలు, గ్రామం మాలిపురం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 21) ఎడవెల్లి మధుసూదన్ రెడ్డి తండ్రి సోమి రెడ్డి, వయస్సు 47 సంవత్సరాలు, గ్రామం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 22) తోట సురేష్ తండ్రి రామస్వామి, వయస్సు 41 సంవత్సరాలు, R/o. ఇంటి నెం.16-04-01 శివ నగర్, వరంగల్, జిల్లా వరంగల్.
ప్రతివాది నెం. 31) నాగరాజి దివ్య శ్రీ : శ్రీ భర్త గాజుల విజ్ఞాన్, వయస్సు 25 సంవత్సరాలు, R/o. ఇంటి నెం.3-15, గ్రామం ఐటుకల పహాడ్, మండలం కాలిగొరారం, జిల్లా నల్లగొండ.
ప్రతివాది నెం. 34) గుండా వితులి తండ్రి గుండా రమేష్, వయస్సు 25 సంవత్సరాలు, గ్రామం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 35) గందం స్వేత, భర్త అజయ్ కుమార్, వయస్సు 31 సంవత్సరాలు, వృత్తి : గృహిణి, ఇ.నెం. 2-1-115/3, మామిళ్లగడ్డ, సూర్యాపేట గ్రామం & మండలం, సూర్యాపేట జిల్లా.
ప్రతివాది నెం. 36) గొడిశాల శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య, వయస్సు 35 సంవత్సరాలు, గ్రామం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం.40) ఆక్కినపల్లి నాగరాజు, తండ్రి లక్ష్మయ్య, వయస్సు 38 సంవత్సరాలు, R/o. కుసాలి బజార్, న్యూ బోయిన్‌పల్లి, తిరుమలగిరి, హైదరాబాద్
ప్రతివాది నెం. 41) ఆలకుంట్ల బాలకృష్ణ తండ్రి రాములు, వయస్సు 38 సంవత్సరాలు, గ్రామం పణిగిరి, మండలం నాగారం, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 43) వసుపులేటి రాధ భర్త కృష్ణ, వయస్సు 50 సంవత్సరాలు, గ్రామం మొండ్రాయి, మండలం కొడకండ్ల, జిల్లా జనగాం.
ప్రతివాది నెం.45) సురినేని సంపత్ తండ్రి తిరుపతయ్య, వయస్సు 40 సంవత్సరాలు, గ్రామం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 48) బుక్కపల్లి నాగేశ్వర్ రావు తండ్రి కొండయ్య, వయస్సు 40 సంవత్సరాలు, వృతి వ్యవసాయం, R/o. ఇంటి నెం.4-10-739/1, వెంకటేశ్వర టెంపుల్ రోడ్, సిద్ధార్థ కాలనీ, మండలం నల్లగొండ, జిల్లా నల్లగొండ.
ప్రతివాది నెం. 49) సురినేని శంకర్ తండ్రి తిరుపతయ్య, వయస్సు 50 సంవత్సరాలు, గ్రామం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 50) పసుపులేటి జంగ రెడ్డి తండ్రి తెలియదు, వయస్సు 55 సంవత్సరాలు, గ్రామం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 57) రంజాన్ బీ భర్త ఎం.డి. ఐమురుద్దీన్, వయస్సు 55 సంవత్సరాలు, R/o.ఇంటి నెం.3-5-206/6/బి, వి.వి.గిరి నగర్, గ్రామం, మండలం, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 58) ఎం.డి. లియాస్ తండ్రి ఎం.డి. ఐమురుద్దీన్, వయస్సు 40 సంవత్సరాలు, R/o. ఇంటి నెం.3-5-206/6/బి, వివి గిరి నగర్, గ్రామం, మండలం, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 59) ఎం.డి. జాని తండ్రి ఎం.డి. ఐమురుద్దీన్, వయస్సు 38 సంవత్సరాలు, R/o. ఇంటి నెం.3-5-206/6/బి, వివి గిరి నగర్, గ్రామం, మండలం, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 60) ఎం.డి. రియాజ్ తండ్రి ఎం.డి. ఐమురుద్దీన్, వయస్సు 37సంవత్సరాలు, R/o. ఇంటి నెం.3-5-206/6/బి, వివి గిరి నగర్, గ్రామం, మండలం, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం.61) సయ్యద్ ఐబీజా భర్త సయ్యద్ ఖలీల్, వయస్సు 50 సంవత్సరాలు, R/o.వివి గిరి నగర్, శాంతి నగర్, గ్రామం, మండలం, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 62) సయ్యద్ జహంగీర్ తండ్రి సయ్యద్ ఖలీల్, వయస్సు 48 సంవత్సరాలు, R/o. వివిగిరి నగర్, శాంతి నగర్, గ్రామం, మండలం, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం.63) సయ్యద్ యూనుస్ తండ్రి సయ్యద్ ఖలీల్, వయస్సు 48 సంవత్సరాలు, R/o. వివి గిరి నగర్, శాంతి నగర్, గ్రామం, మండలం, జిల్లా సూర్యాపేట.
ప్రతివాది నెం. 64) పల్లెపాటి నిర్మల భర్త పల్లెపాటి రవీందర్ రెడ్డి, వయస్సు 60 సంవత్సరాలు, గ్రామం, మండలం తిరుమలగిరి, జిల్లా సూర్యాపేట.

పై దావాలో పైన పేర్కొనబడిన వాది ఓ.ఎస్.నెం. 34/2010, ఐ.ఏ.నెం.62/2023 & ఐ.ఏ.నెం.61/2024 లో కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం దావా సామాన్లు సదరు దావాలో నెం. 1, 8, 9, 11, 13, 14, 21, 22, 31, 34, 36, 40, 41, 43, 45, 48, 49, 50, 57, 58, 59, 60, 61, 62, 63, 64 ప్రతి వాదులైన మీకు పలుమార్లు సమన్సు పంపగా అవి మీకు ముట్టకుండా తిరిగి వస్తున్నవి. కావున కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం మీపేరు దావా సమన్లను దినపత్రిక ద్వారా తెలియపర్చవలసిందిగా కోర్టు వారు ఉత్తర్వులు జారీచేసినారు. కావున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా గౌరవ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తుంగతుర్తిలో సదరు దావా వాయిదా తేది. 11.04.2025గా నిర్ణయించనైనది. కావున మీరు సదరు తేదీన కోర్టులో ఉదయం గం.10.30నిలకు హాజరు కావలయును మీరు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని అభ్యంతరాలను, జవాబును దాఖలు చేసుకోవలెను. లేని యెడల కోర్టు వారు మీకు మీ పరోక్షములో కేసు నిర్ణయం జరుగును. కావున మీకు తెలియజేయనైనది.

//కోర్టు వారి అనుమతితో//

ఇట్లు : **ఎస్ విప్లవ్ సింహా రెడ్డి**, అడ్వకేటు
ప్లాట్ నెం.6 & 7 శ్రీ రమణ విల్లాస్, గ్రీన్ హిల్స్ కాలనీ, కోర్టపేట్, హైదరాబాద్, సెల్: 8341716777

(5వ పేజీ తరువాయి)

రాయితీతోనైనా.. మోక్షం లభించేనా ?

ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విచ్చలవిడిగా అక్రమ లే అవుట్లు చేసి ప్రభుత్వాదాయానికి గండికొడుతున్నారు. తక్కువ ధరకు ప్లాట్లు వస్తున్నాయనే ఆశతో వేలాది మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇలాంటి ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతివ్వకపోవడంతో ప్లాట్ల యజమానులు దయనీయస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ దుస్థితిని తొలగించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2015లో అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని తెచ్చింది. లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో రూ.10వేల చొప్పున చెల్లించి ప్లాట్ల యజమానులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ విషయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ నిలిచిపోయింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్నవారికి భవన నిర్మాణ అనుమతుల్లో కొంత వెసులుబాటు కల్పించినా ఆశించిన మేరకు క్రమబద్ధీకరణ జరగలేదు.

తర్వాత 2020 ఆగస్టులో ప్రభుత్వం మరో జీవో తీసుకువచ్చింది. ఇందులో ప్లాట్లకు సంబంధించి రూ.వెయ్యి చొప్పున చెల్లించేందుకు అవకాశం కల్పించారు. క్రమబద్ధీకరణకు స్థలం విలువ లెక్కింపునకు ప్రభుత్వం శ్లాబులవారీగా కూడా ధరలు నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు తగ్గిస్తూ 2020లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. చదరపు గజం ధర ఆధారంగా క్రమబద్ధీకరణ కోసం చార్జీల స్లాబుల సంఖ్యను పెంచింది. నిర్దేశించిన ఖాళీ స్థలాలు వదలని చోట్ల చెల్లించాల్సిన రుసుము రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్ నిర్ణయించే ధరను ప్రాతిపదికగా చేసింది. ప్రత్యేకంగా నాలా చార్జీ లు తెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించింది. ఈ క్రమబద్ధీకరణ పథకం జీవో 131 ప్రకారం స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ అప్పట్లోనే ప్రారంభమైంది. ఈ మేరకు అనుమతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే పలు కారణాల వల్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ ముందుకు సాగలేదు.

ఇన్నాళ్లు మార్గదర్శకాలు లేక..

సెల్‌ఫోన్ యాప్, పురపాలక శాఖ వెబ్ సైట్ (ఎల్‌ఆర్‌ఎస్-2020) ద్వారా వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. భారీగా వచ్చిన దరఖాస్తులను ఎలా పరిశీలించాలి? ఎన్ని విడతల్లో ప్రక్రియ చేపట్టాలనే అంశంపై యంత్రాంగంలో స్పష్టత లేక ఇంతకాలం ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. అడపాతడపా ఈ అంశమై ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో దరఖాస్తుల పరిశీలన చేపట్టిన అధికారులు.. చర్యలు తీసుకున్నా అందుకు సంబంధించిన మార్గదర్శకాలు సరిగాలేకపోవడంతో మున్సిపాలిటీలు ఇంత కాలం ముందుకు సాగలేదు. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన కసరత్తు ముమ్మరం కానున్నది.

సిబ్బంది కొరతతో అవస్థలు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు సిబ్బంది కొరత అడ్డంకిగా మారింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలంటే నిపుణులైన ప్లానింగ్ సిబ్బంది కీలకం. మున్సిపాలిటీల్లో అవసరమైన మేరకు సిబ్బంది లేరు. క్షేత్ర స్థాయిలో దరఖాస్తులు పరిశీలించేందుకు బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, సర్వేయర్లు చైన్‌మెన్లు ముఖ్యం. వరంగల్ మహానగర పాలక సంస్థ, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట మున్సిపాలిటీల్లో మాత్రమే కొంత మేరకు ఉన్నారు. వీరికి ఇతర మున్సిపాలిటీల బాధ్యతలను అప్పగించారు. సిబ్బంది సరిపడా లేకపోవడంతో దరఖాస్తుల పరిశీలన వేగవంతంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేలల్లో అందిన దరఖాస్తులను లోతుగా పరిశీలించి క్షేత్రస్థాయిలో తనఖీలు చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ క్రమబద్ధీకరణ పథకం అమలు కదలిక వచ్చినా సిబ్బంది కొరత వల్ల ముందుకు సాగే పరిస్థితులు కనిపించడం లేదు.

భారీగా సమకూరనున్న ఆదాయం

ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 25 శాతం రాయితీతో దరఖాస్తుదారులు క్రమబద్ధీకరణకు ఉత్సాహంగా ముందుకు వస్తే ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరే అవకాశం ఉంది. దరఖాస్తుదారు వంద గజాల లోపు స్థలం రెగ్యులరైజ్ చేసుకుంటే పురపాలికకు ఆయా ప్రాంతాలను బట్టి ఒక్కో దరఖాస్తు ద్వారా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. బహిరంగ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ఈ విలువ మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్లాటు మార్కెట్ విలువలో 14 శాతం వసూలు చేయనున్నది. ఇందులో ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇచ్చినా పట్టణాల్లోనే ప్లాట్లు అధికంగా ఉండడంతో ఆయా మున్సిపాలిటీలకు క్రమబద్ధీకరణతో రూ.వందల కోట్లలో ఆదాయం సమకూరనున్నది.

భద్రకాళి అమ్మవారి సన్నిధిలో సినీ హీరో గోపీచంద్

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు సినీ హీరో టి.గోపీచంద్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. చారిత్రక భద్రకాళి అమ్మవారిని గురువారం సినీ హీరో గోపీచంద్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం ఆలయ ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషు, నాగరాజుశర్మలు గోపీచంద్‌ను ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో సినీ నిర్మాత చిట్టూరి శ్రీనివాస్ ఆలయ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, ఫొటోగ్రాఫర్ శ్యామ్, హరినాథ్, నవీన్ పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందుతున్న సినీ హీరో గోపీచంద్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో లవ్లీత్‌కు స్వర్ణం


స్వర్ణం పతకం సాధించిన లవ్లీత్

వరంగల్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో వంగపహాడ్‌కు చెందిన కంచు లవ్లీత్ స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. రాష్ట్రస్థాయి అండర్-14 బాలుర ట్రైథ్లాన్ విభాగంలో లవ్లీత్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకంతో మెరిశాడు. ప్రస్తుతం లవ్లీత్ హనుమకొండలోని ఎంజేపీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు స్వర్ణ పతకం సాధించిన లవ్లీత్‌ను అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి సారంగపాణి, జిల్లా అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

వచ్చే నెలలో రాజనీతి శాస్త్ర విభాగంలో సదస్సు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేయూ రాజనీతిశాస్త్ర విభాగం నేతృత్వంలో మార్చి 21, 22 తేదీల్లో రెండు రోజుల జాతీయ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్టారెడ్డి, సామాజిక వేత్త, విశ్లేషకుడు ప్రొఫెసర్ బి. హరగోపాల్‌ను హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానించినట్లు విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. ఈ మేరకు గురువారం కేయూ రాజనీతిశాస్త్ర విభాగం అధ్యాపకులతో కలిసి హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బాలకృష్టారెడ్డిని, హరగోపాల్ నివాసంలో కలిసి ఆహ్వాన పత్రాలను అందించి సదస్సుకు రావాలని కోరినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సంకినేని వెంకట్ సదస్సు వివరాలను తెలిపారు. కోరిలేషన్స్ పాలిటిక్స్ అండ్ డెమోక్రసీ ఇన్ ఇండియన్ సొసైటీ అనే అంశంపై జరిగే సదస్సు జరుగుతోందని పేర్కొన్నారు. సంకీర్ణ ప్రభుత్వాలు, భారత సమాఖ్య స్ఫూర్తి, ప్రజాస్వామ్యం, జాతీయ ప్రభుత్వాలు, ప్రాంతీయ పార్టీలపై సదస్సులో కీలక ప్రతిపాదనలు చేస్తామని వెల్లడించారు. న్యూఢిల్లీలోని ఐసీఎస్ఎస్ఆర్, తెలంగాణ ఉన్నత విద్యామండలి, కేయూ యూజీసీ సహకారంతో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో మేధావులు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వేడపల్లి నాగరాజు, స్కాలర్స్ అంకిళ్ల శంకర్, కలిపికొండ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లైబ్రరీ సైన్స్ విభాగం జాతీయ సదస్సు

కాకతీయ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ, వర్సిటీ లైబ్రరీ సైన్స్ విభాగం సంయుక్తంగా శుక్రవారం 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయం మెంబర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ సీజే శ్రీలత, లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రాధికారాణిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ సెనెట్ హాల్‌లో ప్రారంభమయ్యే సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, ప్రముఖ లైబ్రరీ రంగనిపుణులు దేవిక పి.మదల్లి కీలక ప్రసంగం చేస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా సోషల్ సైన్స్, ఆర్ట్స్ ఇన్‌చార్జి డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి.హనుమంతు, కామర్స్ డీన్ ప్రొఫెసర్ అమరవేణి, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, లా డీన్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్‌లు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జరిగే ముగింపు సదస్సులో ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, యూజీసీ కేయూ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమత పాల్గొంటారని పేర్కొన్నారు. అందరూ హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.



పోస్టర్‌ను బాలకృష్ణారెడ్డికి అందజేస్తున్న హెడ్ వెంకట్, తదితరులు

నేటి నుంచి ఆల్ ఇండియా ఇంటర్ నిట్ టోర్నీ

క్రీడా పోటీలకు ప్రాంగణం ముస్తాబు
పాల్గొననున్న 750 మంది క్రీడాకారులు

హనుమకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 23వతేదీ వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ నిట్ టోర్నమెంట్‌కు వరంగల్ నిట్ ముస్తాబైంది. ఈ మేరకు క్యాంపస్‌లో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుంది. ఈ క్రీడా పోటీల్లో దేశంలోని 22 ఎన్ఐటీల నుంచి 750 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. వీరిలో 450 మంది పురుషులు కాగా, 350 మంది మహిళా క్రీడాకారిణులు. మూడు ఈవెంట్లు వాలీబాల్, హ్యాండ్ బాల్, యోగాలలో ఈ పోటీలు జరుగుతాయి. స్పోర్ట్స్ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ పి.రవికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. క్రీడాకారులు గురువారం సాయంత్రం నుంచి నిట్‌కు చేరుకోవడం ప్రారంభమైంది. వీరందరికీ నిట్ క్యాంపస్‌లో భోజన, వసతి ఏర్పాట్లు చేశారు. ఈ మూడు ఈవెంట్లు క్యాంపస్‌లోని ఇండోర్ స్టేడియంలలో నిర్వహిస్తారు. టోర్నమెంట్ నిర్వహణకు 60 మంది అధికారులతో పాటు మరో 30 మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి అధికారులను నియమించారు.

పోటీల నిర్వహణకు ప్రత్యేక పరిశీలకుడిగా పుదుచ్చేరి నిట్ సీనియర్ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (ఎస్ఎస్ఏ) ఆఫీసర్ డాక్టర్ బాబు వ్యవహరిస్తారు. కాగా, విద్యార్థుల పక్షాన స్పోర్ట్స్ సెక్రెటరీ అథర్వ పాండే, స్పోర్ట్స్ జాయింట్ సెక్రెటరీ శుభంగి ఠాకూర్, కోర్ టీమ్ సభ్యులు హర్షిత సజ్జన్, అక్షత్ గుప్తా, భవిక్ జైన్ క్రీడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. విద్యార్థుల్లోని క్రీడాప్రతిభను వెలుగులోకి తీసుకురావడంతోపాటు వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో ఈ టోర్నమెంట్ వేదికగా నిలవనున్నది. యేటా దేశంలోని వివిధ ఎన్ఐటీలలో 20 క్రీడల్లో ఈ పోటీలు జరుగుతాయి. ఈ సారి వాలీబాల్, హ్యాండ్‌బాల్, యోగాలలో పోటీలు నిర్వహించే అవకాశం వరంగల్ నిట్‌కు లభించింది.



నిట్ టోర్నమెంట్ బ్రోచర్


వచ్చె.. వచ్చె.. వసంతోత్సవం

వరంగల్ నిట్‌లో 28 నుంచి స్ప్రింగ్ స్ప్రీ

హనుమకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్‌లో ఈనెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు స్ప్రింగ్ స్ప్రీ (సాంస్కృతికోత్సవం) అంగరంగ వైభవంగా జరగనున్నది. ఈ మేరకు నిట్ క్యాంపస్ ముస్తాబవుతోంది. ఈనెల 28వ తేదీన జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ హాస్యనటుడు, పద్మశ్రీ డాక్టర్ బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

ఈమేరకు నిట్ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య గురువారం హైదరాబాద్‌లో బ్రహ్మానందం నివాస గృహంలో కలిసి ఈ మేరకు ఆహ్వానించారు. స్ప్రింగ్ స్ప్రీ వేడుకలకు హాజరయ్యేందుకు బ్రహ్మానందం అంగీకారం తెలిపారు. సంగీతం, నృత్యం, కళలు, వినోదం వంటి రంగాల్లో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి నిట్ కళాశాల యేటా ఈ స్ప్రింగ్ స్ప్రీని నిర్వహిస్తోంది. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోంది. దక్షిణ భారతదేశంలోని నిట్ కళాశాలల్లో ఒకటిగా వరంగల్ నిట్‌లో నిర్వహించే స్ప్రింగ్ స్ప్రీకి మంచి పేరుంది. దేశవ్యాప్తంగా వివిధ ఎన్ఐటీల నుంచి విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించేందుకు పెద్ద సంఖ్యలో హాజరవుతుంటారు.

స్ప్రింగ్ స్ప్రీ వేడుకల్లో భాగంగా సంగీత, సాహిత్య కళారంగాల్లో లబ్ధప్రతిష్ఠులైన, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరుగడించిన ప్రముఖ కళాకారులను ఆహ్వానించడం, వారి ప్రదర్శనలను ఏర్పాటు చేయడం ఆనవాయితీ. వేడుకల్లో భాగంగా నిర్వహించే పోటీలు, వర్క్‌షాపులు, ప్రోషోల వంటి విభిన్న కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. సాంస్కృతిక ప్రదర్శనలు, సాహిత్య కార్యక్రమాలు, సాహసక్రీడలు, సంగీత విభావరి వంటి అనేక కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వహించనున్నారు. స్ప్రింగ్ స్ప్రీ-2025 విద్యార్థుల ప్రతిభకు, సృజనాత్మకతకు పట్టంగలదని భావిస్తున్నారు. తన ఆమోఘమైన హాస్యంతో కోట్లాది మంది హృదయాలను గెలుచుకున్న బ్రహ్మానందం.. ఈ సారి స్ప్రింగ్ స్ప్రీ వేడుకలకు హాజరు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నది.



బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాడాలి

వడ్డేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాడాలని బహుజన్ రాజ్యాధికార పార్టీ (బీఆర్‌పీ) రాష్ట్ర కన్వీనర్ జన్ను సాంబయ్య పిలుపు నిచ్చారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మార్చి 2న జరిగే బీఆర్‌పీ సభ కరపత్రాలను ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా జన్ను సాంబయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో భూమిలేని ప్రతీ నిరుపేద కుంటుంబానికి ఎకరం భూమి, ఇల్లులేని ప్రతీ పేద కుటుంబానికి ఇంటి స్థలంతోపాటు ఇల్లు ఇప్పించడమే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని అన్నారు. సాగులో ఉన్న అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని, ఉచిత విద్య కేజీ టు పీజీ వరకు అందించాలని, పేదలందరికీ ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు రంగాలలో, సంస్థలలో రిజర్వేషన్లు కల్పించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉద్యోగాల భర్తీలో తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. మార్చి 12న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే బహుజన్ రాజ్యాధికార పార్టీ సభకు ప్రజా సంఘాల నాయకులు తరలి రావాలని పిలువు నిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మైదం జయపాల్, బుర్రి సాగర్, అంకేశ్వరపు రమేష్, శ్రీరాముల పైడి, నక్క భిక్షపతి, బుర్రి కుమారస్వామి, రజిత, సమ్మక్క పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

ఆటో కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

వడ్డేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి వారిని దగా చేసిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. గురువారం హనుమకొండ వడ్డేపల్లిలోని శ్రీమాత బాంకెట్ హాల్‌లో నిర్వహించిన శ్రీచైతన్య పొదుపు పరపతి పరస్పర సహాయక సహకార సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 30 ఏళ్లుగా ఆటో కార్మికులకు తాను అండగా నిలుస్తున్నానని పేర్కొన్నారు.

త్రిచక్ర పొదుపు, పరపతి సహాయ సహకార సంఘం ఏర్పాటుతో ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల నుంచి ఆటో డ్రైవర్లకు విముక్తి లభించిందని అన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న ఆటో కార్మికులు సంఘటిత శక్తిగా ఎదగాలని పిలుపు నిచ్చారు. సంఘాలు సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలను ఎదుర్కోగలరని సూచించారు. కార్యక్రమంలో త్రిచక్ర పొదుపు, పరపతి సహాయ సహకార సంఘం ప్రతినిధి రవీందర్‌రెడ్డి, శ్రీచైతన్య పొదుపు సంఘం అధ్యక్షుడు ఉప్పుల రాజేందర్, ఉపాధ్యక్షుడు బల్సుకూరి రవి, ప్రధాన కార్యదర్శి రాంచందర్, ప్రతినిధులు గన్నెబోయిన గణేష్, సూర రవి, సుదర్శన్, రోకుల రవి, బచ్చు అనిల్, సంతోష్, శరత్, నాగరాజు, అల్లం మహేందర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య పీజీ కోర్సుల సెమిస్టర్ పరీక్షలు షురూ..

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య కేంద్రం అందిస్తున్న పీజీ కోర్సుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారం భమయ్యాయి. పరీక్షల నిర్వహణ తీరును కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమే శ్ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పరీక్షల నిర్వాహకులకు అధికారులు తెలిపారు. మొదటి రోజు గురువారం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ వెల్లడించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
వరంగల్ నగరంలో స్మార్ట్‌సిటీ పనుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గురువారం వరంగల్, హనుమకొండ ప్రాంతాలలో కొనసాగుతున్న స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించి తగు సూచనలు చేశారు. వరంగల్ పరిధిలోని సుదరయ్య నగర్ సీసీరోడ్డు, డ్రైనేజీ, 18వ డివిజన్ పరిధిలోని క్రిస్టియన్‌కాలనీలోగల కమ్యూనిటీహాల్, చింతల్‌లో సీసీ రోడ్డు డ్రైనేజీ, 33వ డివిజన్ శాంతినగర్‌లో కొనసాగుతున్న స్మశానవాటిక అభివృద్ధిపనులతో పాటు హనుమకొండ పరిధిలోని హసన్‌పర్తి, బీమారం ప్రాంతాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను కమిషనర్ కొలతల ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, ఈఈలు శ్రీనివాస్, సంతోష్‌బాబు, డీఈలు రవికిరణ్, రాజ్‌కుమార్, ఏఈలు ముజామిల్, సతీష్‌తో పాటు స్మార్ట్‌సిటీ ప్రతినిధులు బాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

తడి పొడి చెత్తపై అవగాహన కల్పించండి

తడి, పొడి చెత్తపై ప్రజలకు అవ గాహన కల్పించాలని బల్దియా కమి షనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ - 2024 అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం 56వ డివిజన్ గోపాల పురంలో తడి, పొడ్డి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై శానిటరీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సమగ్ర శాని టేషన్ నిర్వహణలో భాగంగా తడి, పొడి చెత్తను అందజేయడం, సేకరించడంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ప్రతీ కాలనీలో చెత్త నిర్వహణపై ప్రజలకు చైతన్యం కల్పించాలన్నారు. తడి, పొడి చెత్తను కలిసి అందించడం వల్ల కలిగే దుష్ఫలితా లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రిసోర్స్ పర్సన్లు వారి పరిధిలో గల నివాస గృహాల ప్రజలకు తడి చెత్త ద్వారా కంపోస్ట్ తయారు విధానాన్ని వివరించాలన్నారు. దీంతో పరోక్షంగా డంపింగ్ యార్డ్‌లకు చేరే చెత్త తగ్గుముఖం పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, టీఎంసీ కంజర్ల రమేష్, సూపర్‌వైజర్ నరేందర్, వావ్ ప్రతినిధి పవణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అర్పీలు, డీఆర్‌సీసీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



వరంగల్ చింతల్‌లో అభివృద్ధిపనులను పరిశీలిస్తున్న కమిషనర్



దొంగను పట్టుకున్న స్థానికులు

చర్చిలో చోరీకి యత్నం

పోలీసులకు అప్పగించిన స్థానికులు

కాజీపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చర్చిలో ఓ దండుగుడు చోరీకి యత్నించాడు. స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కాజీపేట కూరగాయల మార్కెట్ సమీపంలోని పెనుయేలు బాప్టిస్టు చర్చిలో గురువారం ఓ దొంగ చర్చి ప్రహరీ దూకి లోపలికి వెళ్లి చోరీ చేసేందుకు ప్రయత్నించగా చర్చిలోని కుక్క ఎగబడింది. వాచ్‌మెన్ కృష్ణ స్థానికుల సహాయంతో దొంగను పట్టుకుని తాళ్లతో కట్టి పోలీసులకు అప్పగించారు. పోలీసులు దొంగను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడు నేపాల్‌కు చెందిన గోపాల్ అని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంగపహాడ్‌లో పీడీఎస్ బియ్యం పట్టివేత

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్‌లో ఇళ్లలో నిల్వచేసిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రంజిత్ బృందం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. గోనెల వీరయ్య, తెట్టె నాగరాజు ఇంట్లో నుంచి రూ. 53,750 విలువ చేసే 21.05 క్వింటాళ్ల రైస్‌ను స్వాధీనం చేసుకున్నామని, అదే విధంగా ముల్కలపల్లి రాజు, తెట్టె రవి ఇంట్లో నుంచి రూ. 43,750 విలువ చేసే 17.5 క్వింటాళ్ల రైస్‌తో పాటు బజాజ్ ఆటో ను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించామని తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి

ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయ్‌కుమార్



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖతోపాటు వివిధ ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థల కృషితో హెచ్ఐవీపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయ్‌కుమార్ సూచించారు. ఐఎంఏ హాలులో గురువారం పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తుండటంతో పాజిటివ్ కేసులు తగ్గుతున్నాయని, అయినప్పటికీ ఇంకా చాలామంది పరీక్షలకు ముందుకు రావడానికి వెనుకాడుతున్నట్లు చెప్పారు. వైద్యాధికారులు, సిబ్బంది హైరిస్క్ గ్రూపుల నమ్మకాన్ని చూరగొనాలని, గోప్యత పాటిస్తూ వారికి భరోసా ఇవ్వాలని సూచించారు. ఐసీటీసీ కౌన్సిలర్లు, టీబీ సూపర్‌వైజర్లు సమన్వయంతో పని చేస్తూ టీబీ, హెచ్ఐవీ నిర్ధారణ, గర్భిణులకు హెచ్ఐవీ స్క్రీనింగ్, ఏఆర్‌టీ చికిత్స సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, టీబీ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, పీఓడీటీటీ డాక్టర్ కె.లలితాదేవి, డీటీసీవో డాక్టర్ హిమబిందు, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఇప్తాదర్ అహ్మద్, డాక్టర్ మంజుల, డాప్కో జిల్లా మేనేజర్ స్వప్నమాధురి, సంపూర్ణ సురక్ష కేంద్ర మేనేజర్ ఇక్బాల్ పాషా, డెమో వి.అశోక్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్, రామకృష్ణ, సురేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అంగడి స్థలాన్ని పరిరక్షించాలి



అంగడి భూమిలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్ అంగడి భూమిలో గురువారం గ్రామస్థులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఎల్లాపూర్ రెవెన్యూ శివారు సర్వే నెం.316లో గల 4-15 ఎకరాలు అంగడి భూమితో పాటు చేపల ఉత్పత్తి కేంద్రం, చేపల బావి, సర్వే నెం.246లో గల 12.13 ఎకరాల ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ, ఐబీ, కుడా, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని గ్రామస్తులు ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరారు. ఈ సర్వే నెంబర్లలోని భూమిని వారి వారసులు గ్రామస్థులకు ఇనాంగా ఇచ్చారని, ఆయా శాఖల అధికారులు ఆ భూమిని మొటేషన్ చేయకపోవడం వల్లే వారి వారసులు ఆ భూమిని కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్నారని గ్రామస్థులు వాపోయారు.

ఇందుకు నిదర్శనంగా ఉన్న ఆనవాళ్లను కూల్చేసి ఇనాం భూమిలో ఉన్న చేపల బావితో పాటు చేపల ఉత్పత్తి భవనాలను రాత్రికి రాత్రే కూల్చి వేసి ప్రభుత్వ అధికారులకు ఎటువంటి ఆధారాలు లేకుండా చేశారని గ్రామస్థులు సంబంధిత అధికారులకు వివరించారు. గతంలో కూడా గ్రామంలోని అంగడి భూమితో పాటు చేపల ఉత్పత్తి కేంద్రం, చేపల బావిని కాపాడాలని రెవెన్యూ అధికారులతో పాటు కలెక్టర్‌కు కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

అయినప్పటికీ కొంత మంది తమ పలుకుబడిని ఉపయోగించి ధరణిలో పట్టాలో పేరు మార్చి నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేసి కోట్ల రూపాయల ప్రజా దనాన్ని కొల్లగొడుతున్నారని పలువురు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమిని కొల్లగొట్టేందుకు సహకరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులతోపాటు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ప్రజాప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను గ్రామస్థులు వేడుకుంటున్నారు. లేని పక్షంలో దశలవారీగా ధర్నాలు, రాస్తారోకోలు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రభుత్వ భూమిని కాపాడేందుకు ఐక్యంగా ఉద్యమ పోరాటాలకు సిద్ధపడతామని ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ సభ్యులు, గ్రామస్థులు హెచ్చరించారు.

నర్సిరెడ్డికి మద్దతుగా ప్రచారం



నర్సిరెడ్డికి ఓటేయాలని అభ్యర్థిస్తున్న తిరుపతి తదిరులు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరుతూ డీవైఎఫ్ఐ జిల్లా సెక్రటరీ దుగ్గెల తిరుపతి కోరారు. గురువారం కేయూ క్యాంపస్‌లో సోషియాలజీ, ఎంఎస్‌బ్ల్యూ విభాగాధిపతి డాక్టర్ స్వర్ణలత తదితర ప్రొఫెసర్లు, అధ్యాపకులను కలిసి నర్సిరెడ్డికి మద్దతుగా ఓటేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో డీవైఎఫ్ఐ నాయకులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత పార్లమెంట్ పిత ఇంద్రజిత్ గుప్తా

న్యూశాయంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): భారత పార్లమెంట్ పిత ఇంద్రజిత్ గుప్తా అని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. సీపీఐ జాతీయ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి కామ్రేడ్ ఇంద్రజిత్ గుప్తా వర్ధంతిని సందర్భంగా గురువారం హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సీపీఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొట్టెపాక రవి తదితర సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

శ్రీ ఉదయ్ హాస్పిటల్‌పై ఫిర్యాదు

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని శ్రీ ఉదయ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో తనకు జరిగిన అన్యాయంపై గురువారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ డాక్టర్ అజిత్‌కు బాధితుడు సదానందం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంతో జతచేసిన రిపోర్టులను చూసి సానుకూలంగా స్పందించిన డాక్టర్ అజిత్ ఐఎంఏ ఈసీలో చర్చించి పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు బాధితుడు సదానందం తెలిపారు.



బీజేపీలో చేరిన మహిళలతో రావు పద్మ, సంతోష్‌రెడ్డి

మహిళల ఆర్థికాభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ

వడ్డేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ, జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ వికాస్ నగర్‌లో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు హెచ్. తిరుపతిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మ్యాదరబోయిన మధుచంద్రయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం అమ్మ భద్రకాళి ఫౌండేషన్ అధ్యక్షురాలు బోగోజు స్వరూపరాణితో పాటు సుమారు వంద మంది మహిళలు బీజేపీలో చేరారు. వారికి రావు పద్మతో పాటు కొలను సంతోష్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు అల్లం మల్లికార్జునరావు, బొంగు కనకలక్ష్మి, మ్యాదరబోయిన కనకయ్య యాదవ్, అభిమిత్రా, కొత్తపల్లి వెంకటరమణ, కొడారి దినేష్ యాదవ్, నేరెళ్ల ప్రశాంత్, గోలి రాంచందర్, ఎల్లావుల రాజ్‌కుమార్, బండ భాగ్యలక్ష్మి, ఆరెల్లి అశోక్, పాల్గొన్నారు.

ఎస్సార్‌లో ఘనంగా యూత్ ఫెస్ట్



జ్యోతి ప్రజ్వళన చేస్తున్న ఎస్సార్‌యూ వీసీ డాక్టర్ దీపక్‌గార్గ్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ స్థాయి యూత్ ఫెస్టివెల్ ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ దీపక్ గార్గ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లా డారు. విద్యార్థుల సృజనాత్మకత, ప్రతిభ, సేవాభావాన్ని ప్రోత్సహించడానికి ఈ వేడుక గొప్ప వేదిక అవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంగీ తం, నృత్యం, నాటకం, సాహిత్య పోటీలు, డిబేట్, క్విజ్ వంటి పలు సాంస్కృ తిక కార్యక్రమాలలో పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. విద్యార్థులకు సర్టి ఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సార్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనరెడ్డి, వి.మహేష్, ఏవీవీ.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.రవీందర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వారాల కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలి

సంఘం రాష్ట్ర నాయకుడు పావుశెట్టి వెంకటేశం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, నాగరికంగా అత్యంత వెనకబడిన వారాల కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని వారాల సంఘం రాష్ట్ర నాయకుడు పావుశెట్టి వెంకటేశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి వారల కుల సంఘం కమ్యూనిటీ భవనంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం వారాల కులాన్ని ఆర్టికల్ 15(4), 16(4) కాన్సిట్యూట్యూషన్ ఆఫ్ ఇండియా ద్వారా వెనకబడిన తరగ తుల జాబితా గ్రూప్ నెం(డి), సీరియల్ నెం.(43)లో చేర్చి 16 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు పావుశెట్టి వెంకటేశం, వారాల కుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పావుశెట్టి నర్సింహరాములు, కందుకూరి సంజీవ్‌లు మాట్లాడారు. వారాల కుల సంఘానికి ఓబీసీ జాబితాలో చేర్చకపోవడం వల్ల అత్యంత పేదరికంలో మగ్గుతున్న నిరుపేద విద్యార్థులు అనేక విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోవడమే కాకుండా ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వారాల కుల సంఘం హసన్‌పర్తి అధ్యక్షుడు గౌరిశెట్టి సత్యం, ప్రధాన కార్యదర్శి గంట నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు పావుశెట్టి రాజు, కుల సంఘం పెద్దలు కందుకూరి సుధాకర్, పావుశెట్టి సాంబయ్య, గుండమీది రాజేందర్, పావుశెట్టి శ్రీధర్, నన్నెంశెట్టి స్వామి, కనపర్తి రమేష్, గౌరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహరాములు

వరంగల్ డీఎంహెచ్‌వోలో..

ఇష్టారాజ్యం!

(5వ పేజీ తరువాయి)

పోస్టును అడ్డుపెట్టుకుని వరంగల్ ప్రాంతంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో తనిఖీల పేరిట భారీగా వసూళ్లు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఎంఎల్‌హెచ్‌పీల నుంచి బలవంతంగా నెల నెల మాముళ్ల వసూళ్లు చేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. శానిటేషన్ నిధులు, ప్రభుత్వ నిధులను కూడా పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. ఇక ఆరేళ్ల అనుభవం కూడా లేకున్నా అదనంగా మరో ఆరు విభాగాలకు ఇంచార్జీగా బాధ్యతలు నిర్వహించటంపై సొంత శాఖలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిప్యూటీ పోస్టుతో పాటు మలేరియా, టీబీ, న్యూక్లియస్ ఆఫీసర్, జిల్లా ట్రైనింగ్, లెప్రసీ, ఎయిడ్స్ ప్రోగ్రాం, యన్‌వీబీడీసీపీ ప్రోగ్రాం ఆఫీసర్‌తో పాటు ఓ పీహెచ్‌సీకి డ్రాయింగ్ ఆఫీసర్‌గా ఇలా అనేక విభాగాలకు ఒకే ఒక్కడు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండటం వైద్య, ఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇన్నీ బాధ్యతలతో పాటు ఓ ప్రవేటు అస్పత్రిని కూడా డిప్యూటీ నిర్వహించటంపై చర్చనీయాంశంగా మారింది. అలాగే వరంగల్ వైద్య, ఆరోగ్యశాఖలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న వైద్యులు కొందరు విధులకు హజరుకాకున్న పట్టించుకునే వారే లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ దృష్టి పెట్టి నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ ఆఫీసర్స్‌గా ఉన్న వారిపై చర్యలు తీసుకోవటంతో పాటు వరంగల్ వైద్య, ఆరోగ్యశాఖను ప్రక్షాళన చేసేవిధంగా కసరత్తు చేయాలని రొందరు వైద్యులు, ప్రజలు కోరుతున్నారు.

అక్షర చిట్‌ఫండ్ బాధితుల ఆందోళన

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలస ముద్రంలోని అక్షర చిట్ ఫండ్ వద్ద బాధితులు ఆందోళన చేశారు. తమకు రావాల్సిన చిట్టీ, డిపాజిట్ డబ్బులు ఇవ్వకపోవడంతో గురువారం అక్షర చిట్ ఫండ్ ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి బాధితులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఫ్లెక్సీతో కొద్దిసేపు నినా దాలు చేస్తూ చిట్ ఫండ్ యజమానిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆం దోళన చేశారు. వెంటనే విషయం తెలుసుకున్న సుబేదారి పోలీసులు బాధితు లతో మాట్లాడి అక్కడి నుంచి ఏసీపీ దేవేందర్‌రెడ్డి వద్దకు బాధితులు ర్యాలీగా వెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిట్‌ఫండ్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ దేవేందర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో బాధితులు అక్కడి నుంచి వెళ్లి రాష్ట్రంలోని ఇతర జిల్లాల సమీపంలోని బాధితులు స్థానిక పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేసినట్లు పేర్కొన్నారు. హనుమకొండ సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం పది మందికిపైగా ఫిర్యాదులు చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.



చిట్‌ఫండ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి

హసన్‌పర్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధన దిశగా కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయం ప్రధానోపాధ్యాయులు కె.అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డు హసన్‌పర్తి తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయంలో పూర్వ విద్యార్థిని, రచయిత్రి గంకిడి అరుణ కీర్తి పతాకరెడ్డి తన తండ్రి కరాదుల వెంకటరెడ్డి స్మారకార్థం ఆర్ష్ ఫౌండేషన్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు కవిత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలను అందజేసి అభినందించారు.ఉపాధ్యాయులు విజలక్ష్మీ, రాజకుమారి, తులసితో పాటు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షకు సకాలంలో హాజరు కావాలి

ఎర్రగట్టు గుట్ట క్రాసురోడ్డు హసన్‌పర్తి బాలికల గురుకుల విద్యాలయం సెంటర్ కోడ్ 253403లో ఐదో తరగతి ప్రవేశ పరీక్షరాసే విద్యార్థులు ఈనెల 23న ఆదివారం ఉదయం 10 గంటలకు పరీక్షాకేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల హాల్ టికెట్‌లో సెంటర్ చిరునామాకు బదులు సెంటర్ కోడ్ మాత్రమే ప్రింట్ చేశారని 253403 సెంటర్ కోడ్ కలిగిన అభ్యర్థులు మాత్రమే ఎర్రగట్టుగుట్ట క్రాసురోడ్డులోని హసన్‌పర్తి తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయంలో జరిగే పరీక్షకు సకాలంలో హాజ రుకావాలని కోరారు. ఇతర వివరాలకు ప్రధానోపాధ్యాయులు అశోక్‌రెడ్డి సెల్ నెం.98665 59707లో సంప్రదించవ్చని తెలిపారు.

లింగయ్యకు అభినందనల వెల్లువ

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతిగా డాక్టర్ మామిడి లింగయ్య గురువారం క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ నుంచి బాధ్యతలను లింగయ్య చేపట్టారు. కాగా, డాక్టర్ మామిడి లింగయ్యను కేయూ చరిత్ర, టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు డాక్టర్ గజ్జెల మల్లేశం, ఎస్డీఎల్‌సీఈ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, మంద వీరాస్వామి, చంద్రశేఖర్, వంగాల సుధాకర్, దామెర భిక్షపతి, ధర్మారపు రవి, వర్సిటీలోని పలువురు ప్రొఫెసర్లు, కాంట్రాక్టు అధ్యాపకులు పరిశోధకులు అభినందనలు తెలిపారు.

వాహనాల వేలంతో ఆదాయం

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో గురువారం నిర్వహించిన వాహనాల వేలంలో రూ. 91,000 ఆదాయం లభించినట్లు ఇన్స్‌పెక్టర్ జి.దుర్గాభవాని తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ ట్రాలీఆటో, ప్యాసింజర్ ఆటో, రెండు ద్విచక్రవాహనాలకు ప్రభుత్వం రూ.63,000 ధర నిర్ణయించగా, వేలంలో పాల్గొని రూ.1,54,000 నాలుగు వాహనాలను దక్కించుకున్నారన్నారు. ఎక్సైజ్ సూపరిం టెండెంట్ కె.చంద్రశేఖర్ వేలంలో పాల్గొని పర్యవేక్షించారు.

విశేషం

శరణాగతితో అభయం

శివుడి గురించి మనకు ఎన్నో కథలు ఉన్నాయి. ఎన్నో విశ్వాసాలు ఉన్నాయి. ఆయన ఒక వ్యక్తి అనీ లేదా ఒక యోగి అనీ, ఈ భూమండలం మీద వేల ఏళ్ళ క్రితం ఆయన తిరిగాడనీ కొందరు నమ్ముతూ ఉంటారు. కానీ అది నిజం కాదు. శివుడికి కాల పరిమితులేవీ లేవు. ఆయనను 'మహాకాలుడు' అని పిలుస్తారు... అంటే ఆయనే కాల స్వరూపుడు, కాలాలకు అతీతుడు. ఇక కైలాసం అనేది ఆయన నివసించే పర్వతం కాదు. ఎక్కడైతే కేవలం ఉత్సవం మాత్రమే ఉంటుందో, ఎక్కడైతే ఆనందం మాత్రమే ఉంటుందో ఆ ప్రదేశమే కైలాసం. మీలో శివతత్త్వం నెలకొన్నప్పుడు.. మీ జీవితంలో కేవలం ఉత్సవం మాత్రమే ఉంటుంది. ఎక్కడైతే ఉత్సవం మాత్రమే ఉంటుందో... అక్కడ శివుడు కొలువుంటాడు.

అన్నీ ఆయనే...

శక్తిని మనం సృష్టించలేమనీ, నాశనం చేయలేమనీ, దాన్ని కేవలం ఒక రూపంలోంచి మరో రూపంలోకి మార్చగలమనీ శాస్త్రవేత్త అయిన అల్బర్ట్ ఐన్‌స్టీన్ సూత్రీకరించాడు. ఒక రూపం నుంచి మరో రూపానికి మారే ఆ శక్తే శివుడు. అది నిత్యం... అంటే ఎల్లప్పుడూ ఉంటుంది. ఈ సృష్టిలో శివుడు కానిది ఏదీ లేదు. ఆయన ఒక రూపంలో ఉండడు, ఏదో ఒక చోట కూర్చొని ఉండడు. ఆయన మొత్తం విశ్వమంతటా ఉన్నాడు. విశ్వంలోని ప్రతి అణువులోనూ ఆయన ఉన్నాడు. 'శివ' అనేది ఒక సూత్రం, ఒక తత్త్వం. ప్రతిదీ అక్కడినుంచే వస్తుంది, ప్రతిదీ అక్కడే స్థితిని పొందుతుంది, ప్రతిదీ అక్కడే నాశనం అవుతుంది. కాబట్టి మనం శివుడికి దూరం కావడం అనేది జరగని పని.



ఆ స్వరూపం పంచభూతాత్మకం

శివరాత్రి సాధకులకు నూతన సంవత్సరం లాంటిది. అధ్యాత్మికమైన ఎదుగుదలకు, లౌకికమైన సాఫల్యానికి శుభప్రదమైన రోజు. ఆనాటి రాత్రి నక్షత్ర మండలాలన్నీ ఒక నిర్దిష్టమైన స్థితిలో ఉంటాయి. కాబట్టి ఆ సమయంలో ధ్యానం చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు సిద్ధిస్తాయి. శివరాత్రి అంటే శివుడి రోజు. శివుడు ధ్యానానికి అధిపతి, జాగృతికి అధిపతి. శివుడు నిరాడంబరుడైన వేలుపు. ఆ నిరాడంబరతలోనే లోతైన సందేశం ఉంది. నటరాజ స్వరూపంలో ఉండే శివుడు ప్రకృతి, దైవత్వాల సంగమానికి చిహ్నం. నటరాజు చేతిలో అగ్ని ఉంటుంది. అది అగ్ని తత్త్వానికి ప్రతీక. ఆయన చేతులోని ఢమరుకం ఆకాశ తత్త్వానికి సంకేతం. ఆయన కేశాలు గాలిలో ఎగురుతూ ఉంటాయి. ఇది ఆకాశ తత్త్వాన్ని సూచిస్తుంది. నేల మీద ఉండే ఒక పాదం పృథ్వీ తత్త్వాన్ని, గాలిలో ఉండే మరో పాదం మళ్ళీ గాలినీ, జటాజూటం జలతత్త్వాన్ని సూచిస్తాయి. అదే పంచభూతాత్మకమైన శివ స్వరూపం. అభయ ముద్రలో ఉండే ఒక చెయ్యి రక్షణకు భరోసా ఇస్తుంది. నెలవైపు ఉండే మరో చెయ్యి శరణాగతి పొందాలని చెబుతుంది. మహా శివుడికి మనం శరణాగతులమైతే... మన రక్షణకు ఆయన అభయం ఇస్తాడు. పరమశివుడి నృత్యం లోకం మొత్తం కోరుకొనే ఆనందాన్ని సూచిస్తుంది. ఆయన ఉనికిని మనం అనుభూతి చెందితే పరమానందం మన సొంతం అవుతుంది. అందుకోసం మనల్ని మనం ఆయనకు సమర్పించుకోవాలి. అటువంటి సమర్పణకు, శరణాగతికి శివరాత్రి అత్యంత అనుకూలమైన రోజు.

• శ్రీశ్రీ రవిశంకర్

పర్వదినం



ప్రేమతత్త్వమే పరమేశ్వరుడు



శివుడు నిరాకారుడు, అలాగే సాకారుడు కూడా. నికారారుడని చెప్పడానికి లింగం ప్రతీక. అద్భుతమైన శివ తత్త్వాన్ని నిరాకారంగా ఉపాసన చేస్తే... అది లింగోపాసన. సాకారమైన దివ్యమంగళ విగ్రహోపాసనలో చంద్రశేఖరుడిగా, నాగాభరణ భూషితుడిగా, త్రినేత్రుడిగా, నీలకంఠునిగా... ఇలా అనేక రూపాలలో గోచరిస్తాడు. ఇవన్నీ శివచైతన్యాన్ని వ్యక్తం చేస్తాయి. జ్ఞానం, వైరాగ్యం, తపస్సు, అంతర్ముఖత్వం, కరుణ, త్యాగశీలత... ఇవన్నీ సగుణ రూపమైనా, నిర్గుణరూపమైన శివమూర్తిలో ఉండే లక్షణాలు. "ఆయన పరమ దయాళువు" అని సిస్టర్ నివేదిత వర్ణిస్తే... "శివుణ్ణి ఆరాధించడం అంటే శాంతాన్ని, సమత్వాన్ని, యోగాన్ని, నిరాడంబరతని ఆదర్శంగా భావించడమే. శాశ్వతమైన భారతీయ హృదయానికి సాకారమే శివుడు" అన్నారు స్వామి వివేకానంద. అటువంటి విశ్వగురువైన విశ్వనాథుణ్ణి ఆరాధించడానికి అనువైన రోజు... మహా శివరాత్రి. ఈ పర్వదినం గురించి ప్రసిద్ధమైన రెండు కథలు పురాణాల్లో ప్రాచుర్యం పొందాయి. ఒకప్పుడు ప్రళయకాలం ఆసన్నమవుతున్న తరుణంలో... పరాశక్తి అయిన సమస్త సృష్టి బీజాలను పోగు చేసింది, వాటిని తన ఒడిలో భద్రపరచి, పంచాక్షరీ జపం చేస్తూ... ధ్యాన నిమగ్నురాలయింది. పగలు, రాత్రీ అనేవి లేని ఆ స్థితిలో... ధ్యాన సమాధిలో ఉన్న పరమశివుడు కొంతకాలానికి కళ్ళు తెరిచాడు. ఎదురుగా ఉన్న కాత్యాయినిని చూసి విషయం తెలుసుకున్నాడు. ఆమెను సమాధి స్థితి నుంచి మేలుకొలిపి, ఆమె పోగు చేసిన బీజాల నుంచి తిరిగి సృష్టిని ప్రారంభించాడు. ఆ రోజు మాఘ బహుళ చతుర్దశి. ఆమె కోరిక ప్రకారం ఆ రోజు 'మహా శివరాత్రి'గా ముల్లోకాలలో ప్రాచుర్యం పొందుతుందని వరమిచ్చాడు. మరో కథ ప్రకారం... బ్రహ్మ, విష్ణువుల మధ్య ఆధిపత్యం కోసం వివాదం ఏర్పడి, కలహానికి దారి తీసింది. వారిని ఉపశమింపజేసేందుకు... ఇద్దరి మధ్య అగ్నిలింగంగా శివుడు ఆవిర్భవించాడు. "పరాశక్తి ఆజ్ఞను అనుసరించి... సృష్టి, స్థితి, లయాలను నిర్వహించడానికి ఆమె ప్రతినిధులుగా మనం ఉన్నాం. మనం కర్తవ్యనిష్ఠులం మాత్రమే" అని సమాధాన పరిచాడు. లింగోద్భవమైన ఆ రాత్రి 'మహా శివరాత్రి'గా ప్రస్తుతి పొందింది.

విశ్వమే ఆయన శరీరం...

శివ స్వరూపాన్ని దర్శిస్తే ఎన్నో అద్భుతాలు గోచరిస్తాయి. జడలో జల తరంగాలు, జ్యోతిర్మండలమైన జటాజూటంలో చంద్రరేఖ, కంఠంలో గరళం... వీటన్నిటినీ గమనిస్తే విశ్వమే శివుని శరీరం అనిపిస్తుంది. ఆయన పంచభూతాత్మకుడు. పైగా చిన్న కుటుంబం. శివపత్ని అన్నపూర్ణమ్మ కన్నతల్లిలా మమకారాన్ని అందిస్తుంది. పెద్ద కుమారుడు గణపతి విఘ్నాలను రూపుమాపడమే కాకుండా, సంపదలను అనుగ్రహిస్తాడు. చిన్న కుమారుడు కుమారస్వామి విజయ కారకుడు. దాంపత్య జీవనానికి శివపార్వతులే ఆదర్శం.. ప్రేమ ధర్మానికి ప్రతీకలైన వారు ఏక శరీరులు, ఆ ముగ్గురి వాహనాలకు పరస్పర వైరం ఉన్నా... వారి సమక్షంలో పరమ మిత్రులుగా మెలుగుతాయి. ఇలా శివతత్త్వాన్ని పరిశీలిస్తే.. ఎన్నో అద్భుతాలు కనిపిస్తాయి. 'ప్రేమయే శివుడు' అనేది శైవ సిద్ధాంతం. శివుడంటేనే ప్రేమ తత్త్వం. భక్తితో పిలిస్తే అక్కున చేర్చుకొనే ఆయన భోళా శంకరుడు. సమస్త సంపదలూ ఉన్నా, ఆయనలో నిరాడంబరత, వైరాగ్యం కనిపిస్తాయి. తనను నమ్మినవారికి అడిగినది ఇవ్వడమే తప్ప... ప్రతిఫలం ఆశించడు. క్షీరసాగర మధనంలో హాలాహలం బైటికి రాగానే దేవదానవులు 'శివా! శివా!' అని ప్రార్థిస్తూ అక్కడి నుంచి పారిపోయారు. పరమ దయాళువైన శివుడు వచ్చి, అభయం ఇచ్చి ఆదుకున్నాడు. ఆ తరువాత ఎన్నో సంపదలు ఆ మధనంలో నుంచి బయటకు వచ్చాయి. ఆయన ఆ సంపదల జోలికి పోలేదు.

లింగోద్భవ దర్శనం...

శ్రీరాముడి లాంటి పౌరాణిక దివ్య పురుషులే కాదు, సమస్త దేవతలు, ఋషులు... ఇలా అందరూ శివభక్తిపరాయణులే. ఆ స్వామి ఆరాధన అనాది సంప్రదాయంగా వస్తోంది. అందుకే మన దేశంలో మూలమూలలా శివాలయాలు కనిపిస్తాయి. సోమవారాలు, మాస శివరాత్రులు, మహాశివరాత్రి, కార్తికమాసంలో శివారాధనకు భక్తులు తండోపతండాలుగా ఆలయాలను సందర్శిస్తారు. అభిషేకాలు, బిల్వపత్ర పూజలు చేస్తారు. ఉపవాసాలు, జాగరణలు, వ్రతాలు చేస్తారు. శివరాత్రి నాటి లింగోద్భవ వేళకు ఎంతో ప్రత్యేకత ఉంది. పరిశీలించి చూస్తే విశ్వంలోని ప్రతి కదలిక శివచైతన్య విశేషమే. మనలోని సర్వ చైతన్యానికి మూలమైన పరంజ్యోతిని దర్శించే సందర్భం... లింగోద్భవ దర్శనం. దానితోపాటు అభిషేకం, ఉపవాసాలు, జాగరణలు, పంచాక్షరీ మంత్ర జపం.. ఇహ పర సౌఖ్యాలను అందిస్తాయనేది పెద్దల మాట

• ఆయపిళ్ళ రాజపాప


సదోధ

విలువ తేల్చేది కాలమే

చైనాలో క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో జీవించిన తత్త్వవేత్త చువాంగ్ ట్జూ. ఆయన గురించి ఆసక్తికరమైన కథలెన్నో ఉన్నాయి. ఆయన సామాన్యమైన జీవితం గడిపేవాడు. ప్రజలకు జ్ఞానాన్ని బోధిస్తూ, వారు ఇచ్చే భిక్ష మీద ఆధారపడి జీవించేవాడు. ఆనాటి చైనా చక్రవర్తి ఆయనకు మిత్రుడు, శిష్యుడు. తరచుగా చువాంగ్‌ను కలుసుకొనేవాడు. అప్పుడప్పుడు తన మందిరానికి ఆహ్వానించి, అనేక విషయాల గురించి చర్చిస్తూ ఉండేవాడు.

ఒకరోజు... చువాంగ్ భార్య మరణించినట్టు చక్రవర్తికి తెలిసింది. ఆయనను పరామర్శించడం కోసం ఆ సాయంత్రం బయలుదేరాడు. చువాంగ్‌ను ఓదార్చడానికి ఏ మాటలు చెప్పాలో, ఎలా చెప్పాలో ఆలోచిస్తూ... చువాంగ్ కుటీరానికి చేరుకున్నాడు. అక్కడ కనిపించిన దృశ్యం చక్రవర్తిని దిగ్భ్రాంతికి గురి చేసింది. చువాంగ్ ఒక చెట్టు కింద కూర్చొని, వాద్య పరికరం వాయిస్తూ, ఆనందంగా పాటపాడుతున్నాడు. చక్రవర్తి ఆయనను సమీపించి... "ఈ రోజు ఉదయమే మీ భార్య మరణించింది కదా? మీరేమో అప్పుడే ఆడుతూ, పాడుతూ ఆనందంగా ఉన్నారు. రోదించవలసిన సమయంలో మీరు ఇలా ఉంటే ఎలా?" అని అడిగాడు.

అప్పుడు చువాంగ్ "మహారాజా! నా భార్య



చనిపోవడం నిజమే. అయితే నేను ఎందుకు దుఃఖించాలి? ఎందుకు రోదించాలి? ఆమె శాశ్వతంగా బతికే ఉంటుందని నేను ఎప్పుడూ భావించలేదు. ఆమె ఎల్లప్పుడూ జీవించే ఉండాలని ఆశించనూ లేదు. ఏదో ఒక రోజు ఆమె మరణించవలసిందేగా? అది ఈ రోజే అయితేనేం? పైగా ఆమె నాతో పాటు ఎన్నో సంవత్సరాలు కలిసి జీవించింది. నాకు ఎన్నెన్నో సేవలు చేసింది. ఆమె మరణిస్తే నేను ఏడుస్తూ కూర్చోవాలా? లేదంటే ఆమె పట్ల నా కృతజ్ఞతా భావాన్ని తెలుపుతూ... పాటలు పాడుతూ ఆమెను ఆనందంగా సాగనంపాలా?" అని ప్రశ్నించాడు.


చువాంగ్ ట్జూకు ఒక వింత అలవాటు ఉండేది. ఎవరైనా, ఏదైనా చెప్పడానికి వస్తే... వారు ఆ విషయం పూర్తిగా చెప్పకముందే "మంచిది, చాలా మంచిది" అని అనేవాడు. ఆయన అలా అనడం కొన్ని సందర్భాల్లో ఎబ్బెట్టుగా అనిపించేది. ఒక రోజు ఒక వ్యక్తి ఆయన దగ్గరకు ఎంతో ఆత్రుతగా వచ్చి "మీ కుమారుడు చెట్టు మీద నుంచి పడి, రెండు కాళ్ళూ విరగ్గొట్టుకున్నాడు" అని చెప్పాడు. వెంటనే చువాంగ్ "మంచిది, చాలా మంచిది" అన్నాడు. "అది ఎలా?" అని అడిగాడు ఆ వ్యక్తి. "వేచి చూడండి" అన్నాడు చువాంగ్.

మరునాడు ఆ రాజ్యం పొరుగు రాజ్యంతో యుద్ధం చెయ్యాల్సిన పరిస్థితి తలెత్తింది. రాజ్యంలో యువకులందరూ సైన్యంలో చేరాలని ఆదేశాలు వచ్చాయి. చువాంగ్ కుమారుడికి కాళ్ళు విరిగిన కారణంగా యుద్ధం నుంచి మినహాయింపు లభించింది. ఎంతోమంది యుద్ధంలో మరణించినా... అతను బతికాడు. చువాంగ్ చెప్పినట్టు మంచే జరిగింది. ఓషో ఈ కథ చెబుతూ... "జ్ఞానుల మాటలు, చేతలు ఒక పట్టాన మనకు అర్థం కావు. కాలమే వాటి విలువను తేల్చి చెబుతుంది" అంటారు.

రాచమడుగు శ్రీనివాసులు

గీతాసారం

పాపం అంటే ఏమిటి?



అనాది కాలం నుంచి వేరువేరు నాగరికతలు, సంస్కృతులు విభిన్న కర్మలకు నిర్వచనాలు ఇచ్చాయి. కొన్నిటిని పాపాలుగా పేర్కొన్నాయి. ఈ జాబితా కాలక్రమేణా మారుతూ వచ్చింది. ఆధునిక యుగంలో దేశాలు తమవైన శిక్షాస్మృతిని కలిగి ఉంటాయి. ఇవి కొన్ని చర్యలను నేరాలుగా లేదా పాపాలుగా నిర్వచిస్తాయి. ఆ పనులకు పాల్పడినవారిని శిక్షిస్తాయి. అటువంటి నిషేధితమైన కర్మలను మనం చేసినప్పుడు అపరాధభావం, పశ్చాత్తాపం, అవమానభారంతో మనల్ని మనం శిక్షించుకుంటూ ఉంటాం. 'వికర్మ' లేదా 'నిషిద్ధ కర్మ', 'పాపం' అంటే ఏమిటి? అనే ప్రశ్న చాలా జటిలమైనది. అర్జునుడు కూడా ఈ సందిగ్ధంలో పడ్డాడు. యుద్ధంలో తన బంధువులను చంపడం ద్వారా 'పాపం% మాత్రమే కలుగుతుందని భావించాడు.

ఈ సందర్భంలో శ్రీకృష్ణుడు "అంతఃకరణను, శరీర ఇంద్రియాలను జయించినవాడు, సమస్త భోగ సామగ్రిని పరిత్యజించినవాడు, ఆశారహితుడు అయిన యోగి కేవలం శరీర కర్మలను మాత్రమే ఆచరిస్తూ ఉంటాడు. అతనికి పాపాలు అంటవు" అని చెప్పాడు. "జయాపజయాలను, లాభనష్టాలను, సుఖదుఖాలను సమానంగా భావించి, యుద్ధానికి సిద్ధపడు. అప్పుడు నీకు పాపాలు అంటనే అంటవు" అని అంతకు ముందు స్పష్టం చేశాడు. 'ఏది పాపం?' అనే ఆలోచన చేసేటప్పుడు అర్థం చేసుకోవలసిన సూక్ష్మమైన విషయం ఒకటి ఉంది. అది ఏమిటంటే... భౌతిక ప్రపంచంలో మనం చేసే కర్మల ఆధారంగా మనం దాన్ని అంచనా వేస్తాం. కానీ శ్రీకృష్ణుడి దృష్టిలో ఇది 'అంతర్గతమైన' విషయం. మనం ఏది చెబుతున్నాం, ఏది చేస్తున్నాం అనేది మన మానసిక స్థితి తాలూకు పరిణామం. అందుకనే మానసిక స్థాయిలో అవగాహన పొందడం అవసరమని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. ఇలాంటి ఆలోచనలు తాత్త్విక స్థాయిలో మనలో అనేక సందేహాలను లేవనెత్తుతుంది, కానీ అనుభవ స్థాయిలో మనకు స్పష్టత వస్తుంది. "ఏదైనా దొరికినప్పుడు... దాన్ని కోరుకోకపోయినా సరే, దానితో సంతుష్టి పడి, ద్వంద్వాతీతంగా ఉంటూ, అసూయ నుంచి విముక్తి పొంది, అన్నిటిపట్లా సమాన దృష్టి కలిగిన వ్యక్తి... కర్మలను చేసినా వాటి బంధాల్లో చిక్కుకోడు" అని శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు. వాస్తవానికి ఈ వివరణను వివిధ సందర్భాల్లో ఎన్నో బోధనలు కలిగి ఉన్న భగవద్గీతకు సూక్ష్మరూపం అని చెప్పవచ్చు. ద్వంద్వాతీత స్థితిని పొందాలని, ప్రతిదాన్నీ విభజించే తత్త్వం ఉన్న మనస్సును కేవలం శరీర పోషణకు అవసరమైన ఆలోచనా చర్యలకు మాత్రమే ఉపయోగించాలని శ్రీకృష్ణుడు చెప్పాడు.



కె. శివప్రసాద్
ఐఏఎస్

సహజయోగ

దేవుడు నీలోనే ఉన్నాడు

"కులాలు, మతాలు అనేవి కేవలం మానవుల సృష్టే. భగవంతుడికి వాటితో ఎలాంటి సంబంధం లేదు. ప్రతి ఒక్కరిలో ఈ అవగాహన కల్పించి, సరైన పరివర్తన తీసుకురాగలిగితే... నవ సమాజం, వసుధైక కుటుంబం, సర్వమానవ సౌభ్రాతృత్వం, ద్వేషరహితమైన, ప్రేమపూరితమైన ప్రపంచం ఏర్పడతాయి" అని ప్రకటించడమే కాదు, అది సాధ్యమేనని సహజయోగ ధ్యాన పద్ధతిద్వారా నిరూపించారు శ్రీమాతాజీ నిర్మలాదేవి. మిమ్మల్ని సృష్టించిన శక్తితో మీరు అనుసంధానం కానంతవరకూ.. మీ జీవిత పరమార్థం ఏమిటనేది తెలుసుకోలేరని ఆమె స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక గురువుగా... తను నమ్మిన సత్యాన్ని, ధర్మాన్ని ఆమె స్వయంగా ఆచరించి చూపారు.


అదే శివుడి ఇచ్ఛాశక్తి...

తన స్వీయ తపోశక్తితో 1970 మే 5న సహజ యోగను శ్రీమాతాజీ నిర్మలాదేవి ఆవిష్కరించారు. తనలో నిద్రాణమైన స్థితిలో ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేసి, బాహ్యపరంగా ఉన్న పరమాత్మ ప్రేమైక శక్తి అయిన పరమ చైతన్యంతో దాన్ని అనుసంధానం చేయడం ద్వారా.. ఆత్మ సాక్షాత్కార అనుభూతిని సాధించారు. దీనితో ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమయింది. 'సహ' అంటే 'మనతో', 'జ' అంటే 'జన్మించిన శక్తి'... 'యోగ' అంటే 'బాహ్యపరంగా ఉన్న శక్తితో కలవడం' అని అర్థం. ఈ విధంగా మనలోని కుండలినీ శక్తి విశ్వవ్యాపితమైన భగవత్ శక్తితో ఏకీకరణ పొందినప్పుడు... మనం కూడా ఆ దివ్య శక్తిలో ఒక కణంగా, భాగంగా మారిపోతాం. పరమ చైతన్యం లేదా బ్రహ్మ చైతన్యం అంటే విశ్వవ్యాపితమైన పరమాత్మ ప్రేమ శక్తి. విశ్వాన్ని, సకల చరాచర జీవులను నడిపించే ఆ భగవత్ శక్తి మానవుల మేధస్సుకు అతీతమైనది. సదాశివుని అర్ధాంగి అయిన ఆది శక్తి... ఆయన చుట్టూ ఒక చల్లని మేఘంలా ఆవరించి ఉంటుంది. అదే బ్రహ్మ చైతన్యం. పరమ చైతన్య శక్తిగా పిలిచే ఆ శక్తే... పరమాత్మ అయిన శివుడి ఇచ్ఛాశక్తి. ఆ శక్తే విశ్వాన్ని సృష్టించింది. భూమి మీద ఉన్న జీవజాలం మీద తన పరమ చైతన్య శక్తిని వెదజల్లుతోంది. మనల్ని అంతర్గతంగా బలోపేతం చేస్తోంది. మనలో ప్రేమ శక్తిగా అంకురిస్తోంది. అందుకే ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది, సహజయోగ సాధన చేస్తున్నవారందరూ ఆ భగవంతుడి ప్రేమ శక్తిని తమ చుట్టూ ఉన్నవారికి పంచడానికి కృషి చేస్తారు. ఈ సాధన చేస్తున్నవారిలో సహస్రార చక్రం పూర్తిగా వికసిస్తుంది. అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థలో ఉన్న ఏడు చక్రాలు తెరుచుకుంటాయి. బ్రహ్మచైతన్యంలో అంతర్భాగాలైన అధిష్ఠాన దేవతలు మేలుకొని, వారికి ఆశీస్సులు అందజేస్తారు. కుల, సహజయోగను మత, జాతి, ప్రాంత, వయసు, లింగ భేదాలకు అతీతంగా ఎవరైనా, ఎప్పుడైనా అతి సునాయాసంగా ఆచరించవచ్చు. ఇది దైనందిన జీవితంలో మానవులు ఎదుర్కొనే శారీరక, మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక సమస్యలన్నిటికీ చక్కటి పరిష్కారం.

అందరూ ఒక్కటే...

"నిన్ను నువ్వు తెలుసుకో.. అనేది అని మతాలలోని మూల సారాంశం. భగవంతుడు ఎక్కడో కాదు, నీలోనే ఆత్మగా ఉన్నాడు. ఇది సత్యం. ఈ సత్యాన్వేషణ... సహజయోగంలోని ఆత్మ సాక్షాత్కారంతో ముగుస్తుంది" అని ఆమె చెపారు. ప్రపంచవ్యాప్తంగా





ఉన్న సహజయోగులందరూ అందరూ అన్ని మతాల దైవాలను, ప్రవక్తలను... 'అందరూ ఒక్కటే' అనే భావనతో ఆరాధిస్తారు. కులమతాలకు అతీతంగా జరిపిన సహజయోగ వివాహాల ద్వారా వసుధైక కుటుంబానికి అసలైన నిర్వచనాన్ని శ్రీ మాతాజీ నిర్మలాదేవి ఆచరణాత్మకంగా చూపించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో, అమెరికా, ఇటలీ, కెనడాల్లో సహజయోగ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్స్ స్థాపించి... అన్ని వర్గాల విద్యార్థులకు క్రమ శిక్షణతో, పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో విద్యను అందేలా దోహదం చేశారు. మన దేశమంతటా పర్యటించి... విద్యార్థులకు, ఉద్యోగులకు, గృహిణులకు వారి సమస్యలకు పరిష్కారంగా సహజయోగను ఉచితంగా బోధించారు. ఈ కార్యక్రమం ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోంది. అలాగే సహజయోగ ద్వారా పొందే ప్రకంపనల సహాయంతో... సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడిని, ఆరోగ్యమైన పంటలను పండించే విధానాన్ని రైతులకు సహజయోగులు ఉచితంగా బోధిస్తున్నారు. భగవంతుని శక్తితో తమను అనుసంధానపరచుకొని.. ధ్యానం ద్వారా తమను సమతుల్యతతో ఎలా ఉంచుకోవాలో, సమస్యలను స్వయంగా ఎలా పరిష్కరించుకోవడం, మత్తు పదార్థాల వ్యసనాలను వదులుకోవడం లాంటివి సహజయోగులు తెలుసుకొంటున్నారు. తమ జీవితాలను ఆనందంగా మలచుకొంటున్నారు.

సత్యావిష్కరణ...

మానవులు ఎన్నో ఏళ్ళ నుంచి, ఎన్నో జన్మల నుంచి అన్వేషిస్తున్న సత్యాన్ని... సహజ యోగ ధ్యానం ద్వారా శ్రీమాతాజీ నిర్మలాదేవి ఆవిష్కరించారు. ఎలాంటి స్వార్థ చింతనా లేకుండా మానవాళికి అందించారు. ఎవరి దగ్గర నుంచి ఎలాంటి రుసుము తీసుకోకుండా, ప్రతిఫలాపేక్ష లేకుండా.. తన సొంత డబ్బుతో వివిధ దేశాలు పర్యటించారు. సహజయోగాన్ని ప్రపంచ వ్యాప్తం చేశారు. ఈ విధంగా తన జన్మను సార్థకం చేసుకున్న ఆమె.. 2011 ఫిబ్రవరి 23న తన సాకార రూపాన్ని చాలించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని... ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 23వ తేదీని 'బ్రహ్మ చైతన్య దినోత్సవం'గా... ప్రపంచంలోని అన్ని సహజయోగ కేంద్రాలలో నిర్వహిస్తారు.

(23న బ్రహ్మ చైతన్య దినోత్సవం)



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

సుభాషితం

వారికి మౌనమే అలంకారం

స్వవశము హితము మూఢతా చ్ఛాదనంబు
గాగ నీగతి నిర్మించె గమలభవుడు
సర్వ విదులగు సుజనుల సభలలోన
మౌనమె విభూషణము మూఢ మానవులకు..

భర్తృహరి 'నీతి శతకం'లోని 'స్వాయత్తమేకాంత హితం విధాత్ర...' అనే శ్లోకాన్ని అనుసరిస్తూ ఏనుగు లక్ష్మణకవి రచించిన పద్య రూపం ఇది.

భావం: ఆ బ్రహ్మదేవుడు 'మౌనం' అనే గొప్ప వరాన్ని మూర్ఖులకు అందజేశాడు.. అన్నీ తెలిసిన గొప్పవారు, పండితులు ఉన్న సభలలో... మూర్ఖులకు మౌనమే గొప్ప అలంకారం. వారు అనవసరమైన విషయాలను, తమకు ఏమాత్రం అవగాహనలేని విషయాలను మాట్లాడి నవ్వులపాలు కాకుండా, సభలను రసాభాస చేయకుండా ఆ మౌనమే వారిని రక్షిస్తుంది.





వ్యాసపీఠం

సాయి సచ్చరిత్ర

20వ శతాబ్దంలో మన దేశంలో అనేక మందిని ప్రభావితం చేసిన ఆధ్యాత్మిక గురువులలో షిరిడీ సాయిబాబా ఒకరు. హిందు, ముస్లిం అనే భేదం లేకుండా అందరినీ తన అక్కున చేర్చుకున్న అవధూత సాయిబాబా. మసీదులో తులసి మొక్కను నాటి.. 'అల్లాహ్ హో మాలిక్' అంటూ ప్రతి రోజూ వీధి వీధిలో తిరిగి.. హిందువుల గోపాలకోత్సవాన్ని, మహ్మదీయుల చందనోత్సవాలను ఒకే రీతిలో జరిపించిన సాయిబాబా అందరినీ సమానంగా చూసేవారు. అందుకే ఆయన జీవితంలో జరిగిన అనేక సంఘటనలను పారాయణంగా ప్రతి రోజూ కొన్ని లక్షల మంది చదువుతూ ఉంటారు. వీరి కోసం ప్రవచనకారుడు డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు రాసిన పుస్తకం 'సాయి సచ్చరిత్ర'. సాయిబాబా జీవితంలోని అనేక విశేషమైన సంఘటనలను అతి సులభమైన భాషలో అందించే పుస్తకమిది. కేవలం సంఘటనలు మాత్రమే కాకుండా- వాటి వెనక ఉన్న తత్త్వాన్ని కూడా రచయిత వివరిస్తారు. సాయిబాబా జీవితంపై ఆసక్తి ఉన్నవారందరూ చదవాల్సిన పుస్తకమిది.

రచయిత: డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
ప్రతులకు: 9866700425

'దృశ్యం-3' పక్కా..



మలయాళ హీరో మోహన్ లాల్ తన అభిమానులకు శుభవార్త చెప్పారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'దృశ్యం-3' చిత్రం త్వరలో పట్టాలెక్కనుందని అధికారిక ప్రకటన చేశారు. ఈమేరకు దర్శకుడు జీతూ జోసెఫ్, నిర్మాత ఆంటోనితో కలసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో మోహన్ లాల్ షేర్ చేశారు. 'గతం ఎప్పుడూ నిశబ్దంగా ఉండదు..'దృశ్యం-3' పక్కా..' అంటూ ఫొటో కింద కాప్షన్ పెట్టారు. చిత్ర తారాగణం, సాంకేతిక సిబ్బంది తదితర వివరాలను మాత్రం వెల్లడించలేదు. కాగా, 2013లో మలయాళంలో విడుదలైన 'దృశ్యం' ఘనవిజయం సాధించింది. ఇందులో మోహన్‌లాల్, మీనా జంటగా నటించారు.



షూటింగ్ షురూ!



జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించినప్పటి నుంచి ఈ సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్ మీదకు వెళుతుందా అని ఎన్టీఆర్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2024లో ఈ సినిమాను ప్రారంభించారు. గురువారం రెగ్యులర్ షూట్‌ను ప్రారంభించారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ సోషల్‌మీడియా ద్వారా తెలిపింది. భారతీయ సినీ చరిత్రలో ప్రత్యేకంగా మిగిలిపోయే సినిమా అని పేర్కొంది. కాగా, ఇది ఎన్టీఆర్ నటిస్తున్న 31వ చిత్రం. రుక్మిణీ వసంత్, టొవినో థామస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 9 విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

విమానంలో వివాహ వార్షికోత్సవం



మెగాస్టార్ చిరంజీవి, సురేఖ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని గురువారం ఓ విమానంలో జరుపుకొన్నారు. ఈ వేడుకలో చిరంజీవి దంపతులతో పాటు నాగార్జున, అమల, నమ్రత తదితరులు ఉన్నారు. ఫొటోలను ఎక్స్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు చిరు. "నా కలల భాగస్వామి సురేఖ నా జీవితంలో అడుగుపెట్టిన ఈ రోజు ఎంతో ప్రత్యేకం" అని పేర్కొన్నారు. పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు చెప్పారు. వేడుకల్లో భాగంగా దుబాయ్ వెళ్తున్నట్లు తెలిపారు.

పారితోషికం లేకుండా చేసిన సినిమా



-బ్రహ్మాజీ

నటుడు బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో నటించిన డార్క్ కామెడీ డ్రామా 'బాపు'. 'ఏ ఫాదర్స్ స్టోరి' అనేది ఉప శీర్షిక. అవసరాల శ్రీనివాస్, బలగం సుధాకర్, ఆమని, ధన్య బాలకృష్ణన్ కీలక పాత్రల్లో నటించారు. దయ దర్శకత్వంలో రాజు, సి.హెచ్.భానుప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మీడియాతో చిత్రవిశేషాలను పంచుకున్నారు బ్రహ్మాజీ. "దర్శకుడు దయ రెండేళ్ల క్రితం ఈ సినిమా కథ చెప్పారు. ఇందులో నా పాత్ర పేరు మల్లన్న. చాలా సహజంగా ఉండే సినిమా ఇది. ఈ కథ మీద ప్రేమ, నమ్మకంతో పారితోషికం తీసుకోలేదు. ఒకవేళ లాభాలు వస్తే కొంత డబ్బు ఇవ్వమని చెప్పా. ఇదో యూనిక్ కాన్సెప్ట్. రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుంది. అలా మల్లన్న పాత్ర ఆత్మహత్యకు ప్రయత్నించాక, ఏం జరుగుతుందనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమాకు పరిశ్రమ నుంచి మంచి ప్రోత్సాహం లభించింది" అని చెప్పారు.

దర్శకుడు శంకర్ ఆస్తుల జప్తు



తమిళ దర్శకుడు ఎస్. శంకర్‌కు చెందిన రూ.10.11 కోట్ల విలువైన స్థిరాస్తులను స్తంభింపజేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు ప్రకటించారు. శంకర్ చిత్రాల నిర్మాణ సంబంధిత వ్యవహారాలలో అక్రమ నగదు రవాణా పాల్పడ్డారనే ఆరోపణలపై 2022లో ఈడీ ఆయనపై కేసు నమోదు చేసి, సమన్లు కూడా జారీ చేసింది. ఆ సందర్భంగా శంకర్ తన న్యాయవాదులతో కలిసి చెన్నైలోని ఈడీ కార్యాలయంలో జరిగిన విచారణలో పాల్గొన్నారు. మూడు గంటలకు పైగా అధికారులు సంధించిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. విచారణ అనంతరం ఈ నెల 17న ఆస్తులను స్తంభింపజేస్తూ ఈడీ నిర్ణయం తీసుకుంది. -చెన్నై, ఆంధ్రజ్యోతి

ఆర్టిస్టులు లేకుండా సినిమా!



హీరో, హీరోయిన్లే కాదు ఆర్టిస్టులెవరినీ చూపించకుండా కేవలం కథ, కథనాల మీదే నడిపిస్తూ తీసిన చిత్రం 'రారాజు'. నిజంగా ఇది సాహసోపేతమైన ప్రయత్నమే. బి. శివప్రసాద్ దర్శకత్వంలో ఇటువంటి సాహసానికి పూనుకుంది పద్మినీ సినిమాస్ సంస్థ. వారి ప్రయత్నాన్ని అభినందించి, 'రారాజు' చిత్రం రిలీజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ. ఈ ప్రయోగం సక్సెస్ అయితే పరిశ్రమ స్వరూపమే మారిపోతుందని ఆయన అన్నారు. ట్రైలర్ కూడా ఆసక్తికరంగా ఉందన్నారు. చిత్ర దర్శకుడు శివప్రసాద్ మాట్లాడుతూ 'మా సినిమాలో ఆర్టిస్టుల మొహాలు కనిపించవు. కథ, కథనమే ముఖ్యం అని భావించి ఓ ప్రయోగం చేశాం. మార్చి 7న విడుదలయ్యే మా చిత్రాన్ని ఆదరించి, మా ప్రయోగాన్ని అందరూ అభినందిస్తారని భావిస్తున్నాం' అని చెప్పారు.

ఇక నుంచి నా సినిమాలో అసభ్యత ఉండదు

- విష్వక్సేన్



విష్వక్సేన్ హీరోగా రామ్‌నారాయణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లైలా'. ఇటీవలె విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. విడుదలకు ముందే వివాదాస్పదం కావడం కూడా ఈ సినిమా ఆడకపోవడానికి ఓ కారణమైంది. ఈ నేపథ్యంలో విష్వక్సేన్ ఓ లేఖ విడుదల చేశారు. 'ఇటీవల నా సినిమాలు అందరూ కోరుకున్న స్థాయికి చేరుకోలేకపోయాయి. నా చివరి సినిమాకు వచ్చిన నిర్మాణాత్మక విమర్శలను స్వీకరిస్తున్నా. నన్ను నమ్మి, నా ప్రయాణానికి మద్దతిచ్చిన నా అభిమానులకు హృదయపూర్వక క్షమాపణలు చెబుతున్నాను. నా ప్రాధాన్యం ఎప్పుడూ కొత్తదనం తీసుకురావడమే. ఇక నుంచి నేను చేసే ఏ సినిమాలోనూ అసభ్యత ఉండదు' అని విష్వక్సేన్ పేర్కొన్నారు.

శక్తిమంతమైన పాత్రలో...



ఆనంది, వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'శివంగి'. భరణి ధరణ్ దర్శకత్వంలో నరేశ్.పి.బాబు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో గళ్ల లుంగీ, నల్లచొక్కాలో శక్తిమంతమైన లుక్‌లో కనిపించారు ఆనంది. విభిన్నమైన కథ, సరికొత్త కథనంతో సినిమా క్షణక్షణం థ్రిల్‌ను పంచుతుందని మేకర్స్ తెలిపారు. మార్చి 7న సినిమా విడుదలవుతోంది. జాన్‌విజయ్, కోయ కిశోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ముంబై x బెంగళూరు
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

గిల్ శతక జిగేల్

షమికి ఐదు వికెట్లు ◻ పోరాడిన బంగ్లాదేశ్ ◻ తౌహీద్ శతకం వృథా

భారత్ బోణీ

దుబాయ్: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీని భారత్ విజయంతో ఆరంభించింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (129 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 101 నాటౌట్) అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ వరుసగా రెండో శతకంతో అజేయంగా నిలిచాడు. అయితే టోర్నీలో బలహీనంగా కనిపిస్తున్న బంగ్లాదేశ్ సైతం గట్టి పోటీనే ఇచ్చింది. బ్యాటింగ్‌లో అసమాన పోరాటంతో పాటు బౌలింగ్‌లోనూ ప్రభావం చూపి భారత మిడిలార్డర్‌ను కట్టడి చేసింది. కానీ గిల్‌కు జతగా కెప్టెన్ రోహిత్ (41), రాహుల్ (41 నాటౌట్) సహకారం అందించడంతో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో నెగ్గింది. గిల్ తన చివరి నాలుగు వన్డేల్లో రెండు ఫిఫ్టీలు, రెండు సెంచరీలు సాధించడం విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. తౌహీద్ హ్రిదయ్ (100) కీలక శతకంతో ఆదుకున్నాడు. అతడికి జాకెర్ అలీ (68) సహకరించాడు. షమికి ఐదు, హర్షిత్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 46.3 ఓవర్లలో 4 వికెట్లకు 231 పరుగులు చేసి గెలిచింది. రిషాద్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.



షమి (5/53)

1 ఐసీసీ టోర్నీ (చాంపియన్స్, వరల్డ్‌కప్)ల్లో భారత్ తరపున ఎక్కువ వికెట్లు (60) తీసిన బౌలర్‌గా షమి. జహీర్ (59)ను అధిగమించాడు. అలాగే వన్డేల్లో జట్టు తరపున వేగంగా (104 మ్యాచ్‌ల్లో) 200 వికెట్లు తీసిన బౌలర్‌గానూ నిలిచాడు. ఓవరాల్‌గా స్టార్క్ (102) తర్వాత రెండో బౌలర్.

తుదికంటా నిలిచి..: ఛేదనలో పిచ్ నెమ్మదించినా.. తొలి పవర్ ప్లేలో భారత్ ఇన్నింగ్స్ మాత్రం వేగంగానే సాగింది. కెప్టెన్ రోహిత్ శర్మ దూకుడు కొనసాగించగా, మరో ఓపెనర్ గిల్ అదిరే ఆటతో తుదికంటా నిలిచాడు. తొలి వికెట్‌కు 59 బంతుల్లోనే 69 పరుగులు జత చేరాక రోహిత్‌ను పేసర్ టస్కిన్ అవుట్ చేశాడు. తర్వాత గిల్, విరాట్ (22) ఇద్దరూ ఆచితూచి ఆడారు. విరాట్‌ను లెగ్ స్పిన్నర్ రిషాద్ అవుట్ చేశాడు. కాసేపటికే గిల్ వరుసగా నాలుగో అర్ధసెంచరీ పూర్తి చేయగా.. మరోవైపు శ్రేయాస్ (15), అక్షర్ (8) పెవిలియన్ చేరారు. 37వ ఓవర్‌లో రాహుల్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను జాకెర్ వదిలేశాడు. ఇక ఆ తర్వాత తను చక్కటి షాట్లతో గిల్‌కు అండగా నిలిచాడు. 45వ ఓవర్‌లో 6,4తో జోరు పెంచిన గిల్ వన్డేల్లో శతకం పూర్తి చేశాడు. అటు విజయానికి ఏడు పరుగులే ఉండడంతో రాహుల్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. ఈ ఇద్దరి మధ్య నాలుగో వికెట్‌కు అజేయంగా 87 పరుగులు జత చేరాయి.

35/5 స్కోరు నుంచి 200+: పది ఓవర్లు కూడా పూర్తికాకుండానే సగం జట్టు పెవిలియన్‌కు చేరిన వేళ బంగ్లా బ్యాటర్లు తౌహీద్, జాకెర్ మొక్కవోని పట్టుదలతో క్రీజులో అతుక్కుపోయారు. ఆరో వికెట్‌కు తమ వన్డే చరిత్రలోనే 154 పరుగుల అత్యధిక భాగస్వామ్యాన్ని సమకూర్చారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా తొలి ఓవర్‌లోనే ఓపెనర్ సౌమ్య వికెట్ కోల్పోయింది. అతడిని షమి అవుట్ చేయగా, ఆ వెంటనే కెప్టెన్ షంటో (0) హర్షిత్‌కు చిక్కాడు. అప్పటికి స్కోరు 2/2. మెహిదీ హసన్ (5) కూడా విఫలం కాగా.. తొమ్మిదో ఓవర్‌లో జట్టుకు భారీ ఝలక్ తగిలింది. మరో ఓపెనర్ తన్‌జీద్ (25), ముష్ఫికర్ (0)లను వరుస బంతుల్లో అక్షర్ దెబ్బతీశాడు. ఈ దశలో స్కోరు 35/5 మాత్రమే. కానీ తీవ్ర ఒత్తిడిలో బ్యాటింగ్‌కు దిగిన తౌహీద్, జాకెర్ నిలకడైన ఆటతో బంగ్లా కోలుకుంది. అటు భారత ఫీల్డింగ్ వైఫల్యం కూడా ఈ జోడీకి కలిసివచ్చింది. తౌహీద్ ఓ క్యాచ్, స్టంప్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. చివరకు 206 బంతులను ఎదుర్కొన్న ఈ జోడీని 43వ ఓవర్‌లో షమి విడదీశాడు. ఆ తర్వాత బంగ్లా వేగంగా వికెట్లు కోల్పోగా తౌహీద్ 114 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. రాణా చేతిలో ఆఖరి వికెట్‌గా తను వెనుదిరగడంతో బంగ్లా ఇన్నింగ్స్ ముగిసింది.



గిల్ 129 బంతుల్లో (101 నాటౌట్)

1 భారత్ తరపున తక్కువ ఇన్నింగ్స్ (51)లోనే 8 వన్డే సెంచరీలు పూర్తి చేసిన బ్యాటర్‌గా గిల్.

రోహిత్ క్యాచ్ డ్రాప్
అక్షర్ హ్యాట్రిక్ మిస్







బంగ్లాపై స్పిన్నర్ అక్షర్ పటేల్ అరుదైన హ్యాట్రిక్ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. అయితే దీనికి కారణం మాత్రం కెప్టెన్ రోహిత్ శర్మనే.. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో అక్షర్ రెండు, మూడో బంతులకు తన్‌జీద్, ముష్ఫికర్ వికెట్లను తీశాడు. ఈ రెండింటిని కీపర్ రాహుల్ మెరుపు వేగంతో పట్టేశాడు. తర్వాతి బంతికి జాకెర్ అలీ కూడా పెవిలియన్‌కు చేరాల్సింది. కానీ స్లిప్‌లో ఉన్న రోహిత్ ఈ సులువైన క్యాచ్‌ను చివరి క్షణంలో వదిలేశాడు. బంతిని వదిలేసిన రోహిత్ కూడా తనపై తనే అసహనం వ్యక్తం చేసుకుంటూ చేతితో గ్రౌండ్‌ను బాదుతూ కనిపించాడు. ఆ తర్వాత అక్షర్‌కు సారీ చెప్పడం కనిపించింది. ఇప్పటి దాకా సీటీలో విండీస్ పేసర్ జెరోమీ టేలర్ (2006లో) మాత్రమే హ్యాట్రిక్ సాధించాడు. మరోవైపు 20వ ఓవర్‌లో సెంచరీ హీరో తౌహీద్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను మిడాఫ్‌లో హార్దిక్ వదిలేశాడు. ఈ రెండు క్యాచ్‌లను పట్టి ఉంటే బంగ్లా స్కోరు 100కు కూడా చేరేది కాదేమో.. ఎందుకంటే ఆ తర్వాత ఈ జోడీ ఆరో వికెట్‌కు 154 పరుగుల భాగస్వామ్యంతో విసిగించింది.

నేటి మ్యాచ్
అఫ్ఘానిస్థాన్ X దక్షిణాఫ్రికా
మ.2.30 నుంచి - స్టార్‌స్పోర్ట్స్‌లో

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్: తన్‌జీద్ హసన్ (సి) రాహుల్ (బి) అక్షర్ 25; సౌమ్య (సి) రాహుల్ (బి) షమి 0; షంటో (సి) విరాట్ (బి) హర్షిత్ 0; మెహిదీ హసన్ (సి) గిల్ (బి) షమి 5; తౌహీద్ హ్రిదయ్ (సి) షమి (బి) హర్షిత్ 100; ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) అక్షర్ 0; జాకెర్ అలీ (సి) కోహ్లీ (బి) షమి 68; రిషాద్ (సి) హార్దిక్ (బి) హర్షిత్ 18; తన్‌జీమ్ హసన్ (బి) షమి 0; టస్కిన్ (సి) శ్రేయాస్ (బి) షమి 3; ముస్తాఫిజుర్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 49.4 ఓవర్లలో 228 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-1, 2-2, 3-26, 4-35, 5-35, 6-189, 7-214, 8-215, 9-228, 10-228; **బౌలింగ్:** షమి 10-0-53-5; హర్షిత్ 7.4-0-31-3; అక్షర్ 9-1-43-2; హార్దిక్ 4-0-20-0; జడేజా 9-0-37-0; కుల్దీప్ 10-0-43-0.

భారత్: రోహిత్ (సి) రిషాద్ (బి) టస్కిన్ 41; గిల్ (నాటౌట్) 101; విరాట్ (సి) సౌమ్య (బి) రిషాద్ 22; శ్రేయాస్ (సి) షంటో (బి) ముస్తాఫిజుర్ 15; అక్షర్ (సి అండ్ బి) రిషాద్ 8; రాహుల్ (నాటౌట్) 41; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 46.3 ఓవర్లలో 231/4. వికెట్ల పతనం:** 1-69, 2-112, 3-133, 4-144; **బౌలింగ్:** టస్కిన్ 9-0-36-1; ముస్తాఫిజుర్ 9-0-62-1; తన్‌జీమ్ 8.3-0-58-0; మెహిదీ హసన్ 10-0-37-0; రిషాద్ 10-0-38-2.



1 వన్డేల్లో భారత్ నుంచి ఎక్కువ క్యాచ్‌లు (156) అందుకుని అజరుద్దీన్‌తో కలిసి తొలి స్థానంలో నిలిచిన కోహ్లీ. ఓవరాల్‌గా జయవర్దనె (218) ముందున్నాడు.

2 వన్డేల్లో తక్కువ ఇన్నింగ్స్ (261)లోనే 11 వేల పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా రోహిత్. విరాట్ (222) టాప్‌లో ఉన్నాడు.

పంకజ్‌కు 14వ స్వర్ణం

మరోసారి ఆసియా స్నూకర్ టైటిల్ కైవసం



దోహా: అంతర్జాతీయ స్థాయిలో తనకు తిరుగులేదని భారత ఏస్ క్యూయిస్ట్ పంకజ్ అడ్వాణీ మరోసారి నిరూపించుకున్నాడు. 39 ఏళ్ల పంకజ్..ఆసియా స్నూకర్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాడు. ఫైనల్లో 4-1తో ఇరాన్‌కు చెందిన అమీర్ సర్ఖోష్‌ను అడ్వాణీ ఓడించాడు. ఈ చాంపియన్‌షిప్‌లో పంకజ్‌కిది 14వ పసిడి పతకం కావడం విశేషం.

సాత్విక్ తండ్రి హఠాన్మరణం

కుమారుడి 'ఖేల్ రత్న' అవార్డు కార్యక్రమానికి వెళ్తుండగా గుండెపోటు



సాత్విక్‌తో..

అమలాపురం (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ సాత్విక్ సాయిరాజ్ తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీ విశ్వనాథం (67) గురువారం ఉదయం గుండెపోటుతో మరణించారు. 2024 ఏడాదికిగాను ఖేల్‌రత్న అవార్డును సాత్విక్ న్యూఢిల్లీలో అందుకోవాల్సి వుంది. ఈ కార్యక్రమం కోసం భార్య రంగమణితో కలసి అమలాపురం నుంచి రాజమండ్రి ఎయిర్ పోర్టుకు వెళ్తుండగా మార్గమధ్యంలో అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రికి తీసుకెళ్లిన కొద్దిసేపటికే ఆయన కన్నుమూసినట్టు కుటుంబ సభ్యులు చెప్పారు. కుమారుడు సాత్విక్ ఖేల్ రత్న అవార్డును తీసుకునే క్షణాలను చూడాలన్న ఆకాంక్ష నెరవేరకుండానే విశ్వనాథం మరణించడంతో ఆ ఇంట విషాదఛాయలు అలముకున్నాయి. విశ్వనాథం రెండో కుమారుడు సాత్విక్. కాగా, ఇప్పటికే ఢిల్లీలో ఉన్న సాయిరాజ్.. తండ్రి మరణ వార్తతో హుటాహుటిన ఇంటికి చేరుకొన్నాడు.

గాయంతో ఫఖర్ అవుట్

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్ పాకిస్థాన్‌కు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. న్యూజిలాండ్‌తో తొలి పోరు సందర్భంగా గాయపడిన ఓపెనర్ ఫఖర్ జమాన్ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. అతడి స్థానంలో ఇమాముల్ హక్‌కు స్థానం కల్పించారు. పాకిస్థాన్ తదుపరి కీలక మ్యాచ్‌లో భారత్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ వచ్చే ఆదివారం దుబాయ్‌లో జరగనుంది.

పట్టుబిగించిన విదర్భ

● ముంబై లక్ష్యం 406
● ప్రస్తుతం 83/3 ● రంజీ సెమీస్

నాగ్‌పూర్: విదర్భతో రంజీ సెమీస్ మ్యాచ్‌లో ముంబై ఎదురీదుతోంది. 406 పరుగుల లక్ష్య ఛేదనలో.. గురువారం రెండో ఇన్నింగ్స్‌లో ముంబై 83/3 స్కోరు చేసింది. విజయానికి ముంబై ఇంకా 323 పరుగుల దూరంలో ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 147/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 292 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ (151) సెంచరీ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 383, ముంబై 270 పరుగులు సాధించాయి. కేరళతో రంజీ సెమీస్‌లో గుజరాత్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంపై కన్నేసింది. ఆటకు నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 222/1తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన గుజరాత్ 429/7 చేసింది. కేరళ తొలి ఇన్నింగ్స్ స్కోరు 457కు గుజరాత్ ఇంకా 28 పరుగుల దూరంలో ఉంది. ఒక్క పరుగు ఆధిక్యం లభించినా గుజరాత్ తుది పోరుకు అర్హత సాధిస్తుంది.

వీలైతే.. క్షమించేయండి బ్రో..!

ధోనీ లైఫ్ మంత్ర



ముంబై: 'కష్టమే అయినా.. క్షమించండి, మీ దారిన మీరు సాగిపోండి' ఇదే తన జీవన మంత్రం అని ధోనీ చెప్పాడు. ఇతరులు ఏమనుకొంటున్నారో అని అతిగా ఆలోచించి.. మంచి నిద్రను దూరం చేసుకోకన్నాడు. 'ధోనీ' యాప్ విడుదల సందర్భంగా అభిమానుల ప్రశ్నలకు మహీ సమాధానం చెప్పాడు. 'జీవితాన్ని నిరాడంబరంగా గడపాలి. నీకు మంచి చేసిన వారి పట్ల కృతజ్ఞతా భావంతో ఉండండి. ముఖంపై చెరగని చిరునవ్వే సగం సమస్యలను పరిష్కరిస్తుంది. కొన్ని విషయాలను ఏ మాత్రం పట్టించుకోకపోతేనే జీవితం సాఫీగా సాగుతుంది. చివరగా మన చేతుల్లోలేని వాటిని నియంత్రించాలనుకోవడం అనవసర ఒత్తిడికి దారితీస్తుందనే విషయాన్ని గుర్తించాలని మహీ పేర్కొన్నాడు.

బిజినెస్

భారత్‌లో గూగుల్ విక్రయ కేంద్రాలు



తొలుత ఢిల్లీ, ముంబై, బెంగళూరులో ఏర్పాటు!? • వచ్చే 6 నెలల్లో తొలి స్టోర్‌ను ప్రారంభించే చాన్స్

న్యూఢిల్లీ: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ సైతం యాపిల్ బాటను అనుసరిస్తోంది. భారత్‌లో గూగుల్ తన రిటైల్ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉంది. తొలుత ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాలను ఎంచుకునే అవకాశాలున్నాయని తెలిసింది. తొలి స్టోర్ కనీసం 15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనుందని, మరో ఆరు నెలల్లో ఇది ప్రారంభం కావచ్చని సమాచారం. రిటైల్ స్టోర్ల ద్వారా కంపెనీ పిక్సెల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇయర్‌బడ్స్‌తో పాటు పలు టెక్ ఉత్పత్తులను విక్రయించనుంది. ప్రస్తుతం గూగుల్ కేవలం 5 స్టోర్లను నిర్వహిస్తోంది. అవన్నీ అమెరికాలోనే ఉన్నాయి. యూఎస్ తర్వాత స్టోర్ల ఏర్పాటుకు గూగుల్ భారత్‌నే ఎంచుకోవడం విశేషం. గూగుల్‌కు అతిపెద్ద, కీలక మార్కెట్లలో భారత్ ఒకటి. మన దేశంలో సాంకేతిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ తదితర కార్యక్రమాల కంపెనీల ఇప్పటికే 1,000 కోట్ల డాలర్ల పెట్టుబడులను ప్రకటించింది. కాగా, యాపిల్ తన ఉత్పత్తుల విక్రయం కోసం ఢిల్లీ, ముంబైలో ఇప్పటికే స్టోర్లను ఏర్పాటు చేసింది.

పీఎన్‌బీ వడ్డీ రేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రిటైల్ రుణాలపై వడ్డీ రేటు తగ్గించింది. తమ గృహ, ఆటో, విద్య, వ్యక్తిగత రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటును పావు శాతం (0.25%) తగ్గిస్తున్నట్టు పీఎన్‌బీ ప్రకటించింది. ఈ నెల 10 నుంచే ఈ తగ్గింపు అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపు ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయంతో పీఎన్‌బీ కనీస వడ్డీ రేటు గృహ రుణాలపై 8.15 శాతం, ఆటో రుణాలపై 8.5 శాతం, విద్యా రుణాలపై 7.85 శాతం, వ్యక్తిగత రుణాలపై 11.25 శాతం చొప్పున ప్రారంభమవుతుంది. కాగా వచ్చే నెలాఖరు వరకు తీసుకునే గృహ రుణాలపై ఎలాంటి ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్ చార్జీలు కూడా ఉండవని పీఎన్‌బీ తెలిపింది.

టాటా ఈవీలపై సరికొత్త ఆఫర్లు

న్యూఢిల్లీ: విద్యుత్ వాహన (ఈవీ) రంగంలోనూ పోటీ పెరుగుతోంది. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా ఈ ఏప్రిల్‌లో భారత మార్కెట్లో తన ఈవీ మోడల్స్ విడుదల చేయబోతోంది. ఈ వార్తలతో దేశీయ ఈవీ మార్కెట్లో 62 శాతం వాటా ఉన్న టాటా మోటార్స్ అప్రమత్తమైంది. దీంతో పాత ఈవీ ఇచ్చి.. కొత్త ఈవీ తీసుకుంటే ఎక్స్ఛేంజీ ఆఫర్ కింద రూ.50,000, ఎలాంటి డౌన్‌పేమెంట్ లేకుండా వాహనం ఆన్ రోడ్ ధర మొత్తానికి ఫైనాన్స్ వంటి ఆఫర్లు ప్రకటించింది. కంపెనీ ఈవీల అమ్మకాలు రెండు లక్షల మైలురాయిని దాటిన సందర్భంగా 45 రోజుల పాటు ఈ ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉంటాయని టాటా మోటార్స్ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	430
చిత్తూరు	493	విశాఖపట్నం	440
		డజను గుడ్లు రూ. 60	

స్ప్లెండిడ్ హాస్పిటల్స్‌తో కిమ్స్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్ప్లెండిడ్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా స్ప్లెండిడ్ హాస్పిటల్స్ కార్యకలాపాలు, నిర్వహణ (ఓ అండ్ ఎం)ను కిమ్స్ చేపట్టనుంది. ఈ ఒప్పంద కాలపరిమితి ఏడేళ్లు. ఆ తర్వాత మరో మూడేళ్లు పొడిగించుకునే అవకాశం ఉంది. అలాగే వైద్య సేవలను కూడా అందించనుంది. హైదరాబాద్, కూకట్‌పల్లిలో నమోదిత కార్యాలయం కలిగి ఉన్న స్ప్లెండిడ్ హాస్పిటల్స్.. 150 పడకల సామర్థ్యం గల హాస్పిటల్‌ను నిర్మిస్తోంది. ఆ తర్వాత సామర్థ్యాన్ని 200 పడకలకు విస్తరించుకునే అవకాశం ఉంది. ఈ ఏడాది జూన్ నాటికల్లా ఈ హాస్పిటల్ కార్యకలాపాలు ప్రారంభించవచ్చని అంచనా వేస్తోంది.

● ఫ్రాన్స్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ థామ్సన్ భారత మార్కెట్లోకి తొలిసారిగా జియోటెలి ఓఎస్‌తో కూడిన 43 అంగుళాల క్యూఎల్ఈడీ టీవీని విడుదల చేసింది. ఈ-కామర్స్ పోర్టల్‌పై ఈ టీవీ ఈ నెల 21 నుంచి అందుబాటులో ఉండనుంది. జియోటెలి ఓఎస్ ఇంటిగ్రేషన్, స్మార్ట్ కనెక్టివిటీ, ప్రత్యేకమైన భారత కంటెంట్‌తో కూడిన ఈ టీవీ ధర రూ.18,999.

● వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్.. టెక్స్‌టైల్స్, అపారెల్, లగ్జరీ ఉత్పత్తుల విభాగంలో 2024 సంవత్సరానికి గాను అత్యధిక పర్యావరణ సస్టేనబిలిటీ రేటింగ్ అందుకుంది. ఎస్ అండ్ పీ గ్లోబల్ ఈ రేటింగ్‌ను మదింపు చేసింది.

● స్కోడా ఆటో ఇండియా.. సరికొత్త ఎస్‌యూవీ కైలాక్ బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌ను ప్రచారకర్తగా నియమించుకుంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	91
వరంగల్	80	గుంటూరు	80
కరీంనగర్	80	ఒంగోలు	80
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	85
కర్నూలు	80	నెల్లూరు	90
విశాఖపట్నం	83	అనంతపురం	90
గోదావరి	91		

2047 నాటికి అధిక ఆదాయ దేశంగా భారత్

23-35 లక్షల కోట్ల డాలర్లకు దేశ జీడీపీ • సేవల రంగమే వృద్ధికి ప్రధాన చోదకం • బెయిన్ అండ్ కో-నాస్కామ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: వచ్చే 22 ఏళ్లలో (2047 నాటికి) భారత్ అధిక ఆదాయం కలిగిన దేశంగా అవతరించనుందని, జీడీపీ 23-35 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోనుందని బెయిన్ అండ్ కో, నాస్కామ్ సంయుక్తంగా గురువారం విడుదల చేసిన నివేదిక అంచనా వేసింది. భారత సేవల రంగమే వృద్ధికి ప్రధాన చోదకం కానుందని నివేదికలో పేర్కొంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- 2047 నాటికి భారత జీడీపీలో సేవల రంగం వాటా 60 శాతానికి పెరగనుంది. మాన్యుఫాక్చరింగ్ రంగం 32 శాతం వాటా కలిగి ఉండనుంది. ఈ రెండూ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషించనున్నాయి.
- ముున్ముందు దశాబ్దాల్లో దాదాపు 20 కోట్ల ఉద్యోగాల కల్పన జరగవచ్చు. అధికాదాయం పంచే ఆధునిక ఉద్యోగాల కల్పన ద్వారా ఆర్థికంగా బలపడే వినూత్న అవకాశం భారత్ కలిగి ఉంది. రంగాల వారీగా సాంకేతిక పురోగతి ప్రణాళికలు ఈ పరివర్తనంలో కీలక పాత్ర పోషించగలవు.
- కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత చిప్ డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్‌లో పూర్తి స్థాయి యాంత్రీకరణ, విడిభాగాల తయారీ, డిజైన్‌తో తిరోగమన అనుసంధానం ద్వారా ధరలో పోటీ సామర్థ్యం, ఆవిష్కరణల సామర్థ్యాన్ని పెంచనుంది. దాంతో ఆ రంగ ఎగుమతి వాటా 24 శాతం నుంచి 2047 నాటికి 45-50శాతానికి పెంచుకునే వీలుంటుంది. అలాగే, జీడీపీలో ఈ రంగం వాటా 3 శాతం నుంచి 8-10 శాతానికి చేరుకోవచ్చు.



- 2023 నాటికి దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం విద్యుత్‌లో పునరుత్పాదక ఇంధన రంగం వాటా 24 శాతంగా ఉండగా.. 2047 నాటికి 70 శాతానికి చేరుకోవచ్చు.
- ఐసీఈ మార్కెట్లో వాటా పెంచుకోవడంతో పాటు ఈవీలకు మారడం ద్వారా వాహన విడిభాగాల ఎగుమతుల రంగం 2047 నాటికి 20,000-25,000 కోట్ల స్థాయికి చేరుకోవచ్చు. ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ, రసాయనాలు, ఆటోమోటివ్, సర్వీసెస్ రంగాలు వ్యూహాత్మక వృద్ధి చోదకాలుగా పనిచేయనున్నాయి. పెరుగుతున్న ఆదాయాలు, నిపుణులతో పాటు మెరుగవుతున్న మౌలిక వసతులు ఆర్థిక వృద్ధికి దోహదపడనున్నాయి.
- భారత ఆర్థిక వ్యవస్థకు కొన్ని సవాళ్లున్నాయి. 2030 నాటికి నిపుణుల కొరత 5 కోట్లకు పెరగవచ్చని అంచనా. ఈ నేపథ్యంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్ (ఎస్‌టీఈఎం) విద్యను మరింత మెరుగుపరచడంతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. స్థానికంగా తయారీ సహా కీలక విడిభాగాల ఉత్పత్తి, డిజైనింగ్‌కు మరింత ప్రాధాన్యమివ్వాలి. తద్వారా విడిభాగాల కోసం దిగుమతులపై ఆధారం తగ్గుతుంది.
- ఏఐలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం, హరిత ఇంధనం, ఇతర కీలక రంగాలు, ఆర్ అండ్ డీలో పెట్టుబడుల పెంపు దేశీయంగా ఆవిష్కరణలకు దోహదపడటంతో పాటు అంతర్జాతీయ సరఫరా వ్యవస్థపై ఆధారపడటాన్ని తగ్గించుకోగలుగుతాం.
- మౌలిక వసతుల పెంపు, నైపుణ్య కొరతను తగ్గించుకోవడంతోపాటు అంతర్జాతీయ భాగస్వామ్యాలు, సాంకేతికత ద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయడం పైనే భారత ఆర్థిక వృద్ధి ఆధారపడి ఉంది.
- డిజిటల్, రవాణా మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు, దేశీయంగా తయారీ పెంపు, భాగస్వామ్యాల ద్వారా పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా భవిష్యత్ టెక్నాలజీలు, ప్రపంచ వాణిజ్యంలో భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టవచ్చని నాస్కామ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంగీత గుప్తా అన్నారు. బహుముఖ, సాంకేతిక విధానం ద్వారా సమ్మిళిత, సుస్థిర వృద్ధికి బాటలు వేయవచ్చన్నారు.

బీఎస్ఈలో వేగా జువెలర్స్ లిస్టింగ్



వేగా జువెలర్స్ లిమిటెడ్.. గురువారం నాడు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ)లో లిస్టయింది. వేగా జువెలర్స్ ఎండీ నవీన్ కుమార్ వనమా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధాకర్ వనమా, చైర్మన్ రామ్ మోహన్ బండ్లమూడి, డైరెక్టర్ చంద్రకాంత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఎస్ఈలో కంపెనీని లిస్ట్ చేయటం ద్వారా తమ 20 సంవత్సరాల కల నెరవేరిందని సంస్థ ఎండీ నవీన్ కుమార్ ఈ సందర్భంగా అన్నారు. వేగా జువెలర్స్.. 15,000కు పైగా ప్రత్యేకమైన డిజైన్లు, 425 మంది సిబ్బందితో పాటు 4 లక్షల మంది విశ్వసనీయమైన కస్టమర్లను కలిగిఉందన్నారు. ప్రస్తుతం వేగా జువెలర్స్.. విజయవాడ, హైదరాబాద్, కాకినాడల్లో షోరూమ్స్ నిర్వహిస్తోంది.

బడా షేరు బేజార్.. చిన్నస్టాక్ జిగేల్

» సెన్సెక్స్ 203 పాయింట్లు డౌన్
» ఒక శాతానికి పైగా పెరిగిన స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా మూడో రోజు నష్టపోయాయి. గురువారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 203.22 పాయింట్లు కోల్పోయి 75,735.96 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 19.75 పాయింట్ల నష్టంతో 22,913.15 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెద్ద షేర్లలో అమ్మకాలకే మొగ్గుచూపడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం ఇందుకు కారణమయ్యాయి. కాగా, గత కొన్ని రోజుల్లో భారీగా క్షీణించిన చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో ట్రేడర్లు వాల్యూ బైయింగ్ జరిపారు. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.32 శాతం ఎగబాకగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.18 శాతం పెరిగింది. రంగాలవారీ సూచీల్లో బ్యాంకెక్స్, ఆర్థిక సేవలు, ఫోకస్డ్ ఐటీ, ఎఫ్ఎంసీజీ నేలచూపులు చూడగా.. పవర్, యుటిలిటీస్, మెటల్ 2 శాతానికి పైగా పెరిగాయి.

● **పబ్లిక్ ఇష్యూకి ఫోన్‌పే**

దేశంలో అతిపెద్ద డిజిటల్ చెల్లింపుల సేవల కంపెనీ ఫోన్‌పే సైతం ఐపీఓకు సన్నద్ధమవుతోంది. గడిచిన ఐదేళ్లలో ఐపీఓకు రాబోతున్న మూడో ఫిన్‌టెక్ కంపెనీ ఫోన్‌పే కానుంది. పేటీఎం, మొబిక్విక్ ఇప్పటికే ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్టయ్యాయి. యూపీఐ చెల్లింపుల్లో ప్రస్తుతం ఫోన్‌పేదే 48% వాటా. 2023లో కంపెనీ మార్కెట్ విలువను 1,200 కోట్ల డాలర్ల స్థాయిలో లెక్కగట్టారు.

● **వచ్చే నెలలో ఎన్ఎస్‌డీఎల్ రూ.3,000 కోట్ల ఐపీఓ**

నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) రూ.3,000 కోట్ల ఐపీఓ వచ్చే నెలలో ప్రారంభం కానుంది. ఎన్ఎస్‌డీఎల్ పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదనకు సెబీ గత సెప్టెంబరులోనే ఆమోదం తెలిపింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన జరగనున్న ఈ ఇష్యూ ద్వారా ఎన్ఎస్‌డీఎల్‌లో వాటాలు కలిగిన ఎన్ఎస్ఈ, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కలిసి మొత్తం 5.72 కోట్ల షేర్లను విక్రయించనున్నాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	88,040 ▲	80,700 ▲	1,07,000 ▼
విజయవాడ	89,350 ▲	83,500 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	86,210 ▼	79,030 ▼	97,480 ▼
రాజమండ్రి	88,040 ▲	80,700 ▲	1,00,000 ▲
ప్రొద్దుటూరు	89,050 ▲	82,460 ▲	98,500 ▲
ముంబై	86,520 ▼	79,252 ▼	97,789 ▲

ఆ ఊర్లో 500ఇళ్లు ప్రభుత్వ స్థలాల్లోనే...!

» ప్రైవేటువైనా ఈ-పంచాయతీలో ప్రభుత్వానివిగా నమోదు

» సంగారెడ్డి జిల్లా చేర్యాల గ్రామస్థుల్లో ఆందోళన

కంది, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆ స్థలాలు వారి తాతముత్తాల నుంచి వారసత్వంగా వచ్చాయి. స్థలాల పత్రాలు వారి పేరిటే ఉన్నాయి. ఇళ్లు కట్టుకుని ఉంటున్నారు. కానీ అవన్నీ సర్కారు స్థలాలని తాజా రికార్డులు చెబుతుండటంతో ఆ గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం చేర్యాల గ్రామంలోని సుమారు 500 ఇళ్ల స్థలాలు ప్రభుత్వ స్థలాలుగా 'ఈ- పంచాయతీ' వెబ్‌సైట్‌లో నమోదైనట్టు గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ఒకరు తన ఇంటి పత్రాలతో రుణం కోసం బ్యాంకుకు వెళ్లగా.. ఇంటి స్థలం ప్రభుత్వ స్థలంగా ఉందని, రుణం ఎలా ఇస్తామనడంతో ఆశ్చర్యపోయాడు. వెంటనే సదరు వ్యక్తి గ్రామ కార్యదర్శిని అడగ్గా.. ఆయన ఈ-పంచాతీయ వెబ్‌సైట్‌లో చూసి చేర్యాలలోని సుమారు 500 ఇళ్లు, ఇళ్ల స్థలాలు ప్రభుత్వానివిగా చూపుతున్నాయన్నారు. గ్రామంలో 846 ఇళ్లు ఉండగా సుమారు 500 ఇళ్లు ప్రభుత్వ స్థలాల్లో ఉన్నట్లు చూపడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల రికార్డులను 2012లో ప్రభుత్వ అధికారులు ఈ-పంచాయతీ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఈ సమయంలో అధికారుల నిర్లక్ష్యంతో గ్రామంలోని ప్రైవేట్ స్థలాలను ప్రభుత్వ స్థలాలుగా నమోదు చేసినట్లు అనుమానిస్తున్నారు. కాగా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చేర్యాల పంచాయతీ కార్యదర్శి సుధీర్ రెడ్డి తెలిపారు.



ఘర్షణ పడుతున్న ఆజంనగర్ గ్రామస్థులు, అటవీశాఖ సిబ్బంది

భూపాలపల్లి జిల్లాలో.. పోడు భూముల ఘర్షణ

కాకతీయఖని, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పోడు భూముల లొల్లి రాజుకుంది. భూపాలపల్లి మండల పరిధి ఆజంనగర్‌లోని పోడు భూముల వద్దకు ఫారెస్టు అధికారులు గురువారం ట్రెంచ్‌లు కొట్టేందుకు యంత్రాలతో వెళ్లగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఫారెస్టు అధికారులు, గ్రామస్థుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. అటవీ శాఖ అధికారులు, గ్రామస్థులు పరస్పరం పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. సుమారు 150 మంది అటవీశాఖ సిబ్బంది గ్రామానికి వచ్చారని, తాము వారి విధులను అడ్డుకోలేదని, జేసీబీలను పోడుభూముల్లోకి వెళ్లకుండా అడ్డుపడ్డామని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో అటవీ అధికారులు తమను దుర్భాషలాడుతూ దాడికి దిగారని, బూటుకాళ్లతో విచక్షణారహితంగా కొట్టడంతో పట్టం శారద అనే మహిళ స్పృహ కోల్పోయిందని చెప్పారు. ఆమెను చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రిలో చేర్పించామని వివరించారు. లంచం ఇవ్వలేదనే అక్కసుతో కందకాలు తవ్వేందుకు అధికారులు వచ్చారని ఆరోపించారు. అయితే.. గ్రామస్థులే తమపై దాడి చేశారని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. పరస్పర ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు.. 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. సామాన్యులపై అధికారుల దాడిని ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు.

కేసీఆర్ నోరు అదుపులో పెట్టుకో: లెఫ్ట్ పార్టీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు తొత్తులుగా మారారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్యానించడాన్ని సీపీఎం, సీపీఐ నాయకులు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. కమ్యూనిస్టుల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ.. కేసీఆర్‌ను హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీకి ఓట్లు వేయించి ఆ పార్టీ ఎంపీలు గెలిచేలా, రాష్ట్రంలో బీజేపీ బలపడేలా కేసీఆర్ వైఖరి తీసుకున్నారని, ఇది బీజేపీకి బీఆర్ఎస్ తొత్తుగా వ్యవహరిస్తున్నట్లేనని విమర్శించారు. తమపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐకి ఎప్పుడు నెగ్గాలో, ఎప్పుడు తగ్గాలో తమకు తెలుసునని పేర్కొన్నారు.



రంగుమారి దుర్వాసన వెదజల్లుతున్న ధర్మగుండం జలాలు

'రాజన్న' ధర్మగుండం.. నిండా దుర్గంధం!

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భక్తులు ఎంతో పవిత్రంగా భావించి స్నానాలు ఆచరించే రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలోని ధర్మగుండం తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. చాలా రోజులుగా ఈ నీటిని మార్చకపోవడంతో ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధం వెలువడుతోందని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మహాశివరాత్రి జాతర ఉండటంతో వారం రోజుల ముందు నుంచే రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణలో మోదీ, రేవంత్ చేసిందేమీ లేదు

» బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు వల్లే ఎస్సీ వర్గీకరణకు బాటలు పడ్డాయని, దీని కోసం ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఎస్సీ వర్గీకరణలో వారి పాత్ర ఏమీ లేదని ఆమె పేర్కొన్నారు. దళితుల మధ్య పంచాయతీ పెట్టొద్దని, ఎవరికీ అన్యాయం జరగకుండా వర్గీకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గురువారం తన నివాసంలో నిర్వహించిన దళిత బంధు సాధన సమితి సమావేశంలో కవిత మాట్లాడుతూ, కేసీఆర్ మంజూరు చేసిన దళిత బంధు నిధులను బడ్జెట్‌లోపు విడుదల చేయాలని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మిగిలిన 18వేల దళిత కుటుంబాలకు దళితబంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబుకు రేవంత్ గురుదక్షిణ

» అందుకే ఏపీ జల దోపిడీని అడ్డుకోవడం లేదు: హరీశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): "రేవంత్‌రెడ్డి, చంద్రబాబు మధ్య పరోక్ష సంబంధం ఉంది. అందుకే ఏపీ జల దోపిడీకి సహకరిస్తూ.. తెలంగాణ సీఎం గురు దక్షిణ చెల్లించుకుంటున్నారేమో..?" అని మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. నాగార్జున సాగర్ కుడి కాల్వ నుంచి రోజూ పది వేల క్యూసెక్కుల నీటిని ఏపీ సర్కారు తరలించుకుపోతుంటే.. అడ్డుకోవడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మండిపడ్డారు. ఏపీ తాత్కాలిక వాటా 512 టీఎంసీలుంటే.. 657 టీఎంసీలు తీసుకుపోయిందని.. 25 రోజుల్లోనే 65 టీఎంసీలు తరలించిందని పేర్కొన్నారు. తన వాటాలో తెలంగాణ ఇప్పటి వరకు 220 టీఎంసీలను మాత్రమే వాడుకుందని, మరో 123 టీఎంసీలను వినియోగించాల్సి ఉందని.. మన వాటా రాబట్టుకోవడంలోనూ విఫలమయ్యారని ధ్వజమెత్తారు. లెక్కకుమించి నీటిని తరలిస్తున్న ఏపీని అడ్డుకునేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రేవంత్ సర్కారుకు చేతకాకుంటే తాము వస్తామని.. అందరం ఢిల్లీకి వెళ్లి ధర్నా చేద్దామని పేర్కొన్నారు.

కుంభమేళాకు తెలుగు ప్రవాసీలు!



» ఎడారి దేశం నుంచి పెద్ద సంఖ్యలో రాక

» ప్రభుత్వ ఏర్పాట్లు భేష్ : భక్తుల ప్రశంస

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ న్యూస్)

నిత్య యాంత్రిక జీవనం, భిన్న సంస్కృతులుండే గల్ఫ్ దేశాల నుంచి తెలుగు ప్రవాసీ భక్తులు ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు తరలి వెళ్తున్నారు. పవిత్ర త్రివేణి సంగమంలో భక్తిప్రపత్తులతో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఎడారి పెట్రో దినార్ల నుంచి బయటపడి మాతృదేశంలో ఆధ్యాత్మికతను ఆస్వాదిస్తున్నారు. ప్రభుత్వ ఏర్పాట్లు బావున్నాయని ప్రశంసిస్తున్నారు. ప్రయాగ్‌రాజ్, వారణాసి, అయోధ్య తీర్థస్థలాల సందర్శన అనంతరం తిరిగి గల్ఫ్‌కు వస్తున్నారు. ఎటు చూసినా జనసముద్రంలా కనిపించే గంగ, యమున, సరస్వతి త్రివేణి సంగమంలో స్నానం ఆచరించడం తన జీవిత కాలపు స్వప్నమని సౌదీ అరేబియాలో పని చేసే టి.మల్లికార్జున్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. స్నానఘట్టాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రభుత్వం చేసిన ముందస్తు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. త్రివేణి సంగమంలో స్నానం అనంతరం అయోధ్యలో రేయింబవళ్లు అనే తేడా లేకుండా జనజాతరలో కలిసి శ్రీరాముడిని దర్శించుకోవడం వర్ణనాతీతమని దుబాయ్‌లో పని చేసే ఏపీలోని తణుకుకు చెందిన వేగ్నస్న శివరామకృష్ణ భావోద్వేగపూరితంగా చెప్పారు. తన జీవితంలో ఇసుకేస్తే రాలనంతగా జనాలను చూడడం ఇదే ప్రథమమని ఖతర్‌లో నివాసముండే హైదరాబాద్‌కు చెందిన సాయి సుధ పేర్కొన్నారు. త్రివేణి సంగమంలో స్నానం చేయడం ద్వారా తాను పొందిన ఆధ్యాత్మిక అనుభూతి అమూల్యమని ఖతర్‌లో పనిచేసే కరీంనగర్‌కు చెందిన వెలదండి-రుచికలు చెప్పారు.

వామపక్షాల ఐక్యత అత్యవసరం

భగత్‌సింగ్ మేనల్లుడు జగ్మోహన్‌సింగ్.. '50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం' సదస్సులో వ్యాఖ్య

» భగత్‌సింగ్ చదివిన చివరి పుస్తకం భగవద్గీత కాదని 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి) : దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో వామపక్షాల ఐక్యత అత్యవసరమని స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ మేనల్లుడు ఆచార్య జగ్మోహన్ సింగ్ అభిప్రాయపడ్డారు. ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్న ప్రస్తుత సందర్భంలో భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన 'యాభై ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం' సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వందేళ్ల క్రితం దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీసేందుకు ఆంగ్లేయులు పాటించిన పద్ధతులనే నేటి పాలకులు అమలు చేస్తున్నారని ఆరోపించారు. వీటిని తిప్పికొట్టడానికి అన్ని వర్గాల ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో పాల్గొన్న రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ వర్సిటీల్లో ప్రతి కుల సంఘం ఏదో ఒక దొంగల ముఠాకు అనుబంధంగా పని చేస్తుందని ఆరోపించారు. వామపక్ష విద్యార్థి సంఘాలలో పనిచేసిన వారంతా ఓ ఉమ్మడి కార్యాచరణ వేదిక ఏర్పాటుకు ప్రయత్నించాలని అన్నారు. సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశాల మధ్య ట్రేడ్ వార్ నడుస్తోందని, ప్రజల మీద పాలకులు యుద్ధాలు చేసే రోజులు రానున్నాయని హెచ్చరించారు. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ప్రతినిధి ప్రొ. కాత్యాయిని విద్మహే, పీడీఎస్‌యూ తొలితరం నాయకుడు బూర్గుల ప్రదీప్ తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.



: యాభై ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం సదస్సులో ఆచార్య జగ్మోహన్ సింగ్, ఆచార్య హరగోపాల్ తదితరులు

'భగత్‌సింగ్ చివరిగా చదివింది గీత కాదు

దేశ స్వాతంత్ర్యం కోసం నూనూగు మీసాల వయసులో ఉరి కంబం ఎక్కిన మహనీయుడు భగత్‌సింగ్.. జైల్లో చివరిగా భగవద్గీత చదివారనే ప్రచారం చాలాకాలంగా ఉంది. అయితే, భగత్‌సింగ్ చివరిగా చదివింది భగవద్గీత కాదని ఆయన మేనల్లుడు ఆచార్య జగ్మోహన్ సింగ్ స్పష్టం చేశారు. హైదరాబాద్ విచ్చేసిన ఆయన భగత్‌సింగ్‌కు సంబంధించిన కొన్ని విషయాలను 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా పంచుకున్నారు. అవి ఆయన మాటల్లోనే.. మామయ్య కోటు పైజేబులో గదర్‌పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన కర్తార్‌సింగ్ శరభ ఫొటో ఉండేదట. మరో జేబులో ప్రపంచ సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు, మరోవైపు జేబులో ఆంగ్ల నిఘంటవు ఎప్పుడూ ఉండేవని మా అమ్మమ్మ చెప్పగా విన్నా. మామయ్య 17వ ఏట డాన్‌బ్రీన్స్ ఆత్మకథ 'మై ఫైట్ ఫర్ ఐరీష్ ఫ్రీడమ్' పుస్తకాన్ని హిందీలోకి అనువదించారు. ఆయన అనువదించిన పుస్తకం అదొక్కటే. భగత్‌సింగ్ హిందీ, ఇంగ్లిషు, ఉర్దూ, బెంగాలీ, పంజాబీ భాషలు రాయగలరు, చదవగలరు. తన జీవితకాలంలో 350కుపైగా పుస్తకాలు చదివారు. భగత్‌సింగ్ జైల్లో చివరిగా చదివిన పుస్తకం భగవద్గీత అనేది పచ్చి అబద్ధం. ఉరిశిక్ష అమలుకు ముందు వరకు భగత్‌సింగ్ చదివిన పుస్తకం జర్మన్ మార్క్సిస్టు క్లారా జట్కిన్ రాసిన 'రెమినిసెన్సెస్ ఆఫ్ లెనిన్' అని జైలు రికార్డులు చెబుతున్నాయి. పాకిస్థాన్‌లోని ఫైసలాబాద్ సమీపంలో బంగా గ్రామంలో భగత్‌సింగ్ పుట్టి, పెరిగిన ఇల్లుకు షహీద్ భగత్‌సింగ్ హవేలీ అని పేరు పెట్టి పాక్ ప్రభుత్వం పరిరక్షించడం గొప్ప విషయం. లాహోర్‌లో భగత్‌సింగ్ కేసు విచారణ జరిగిన చారిత్రక భవనం పూంచ్ హౌస్‌లోనూ పాక్ ప్రభుత్వం భగత్‌సింగ్ మ్యూజియాన్ని ఏర్పాటు చేసింది. మహాత్మా గాంధీని, భగత్‌సింగ్‌కు శత్రువుగా చూడడం సరికాదు. విధానాలు వేరైనా వారిద్దరూ పరస్పరం గౌరవించుకున్నారనే విషయాన్ని మనం మరువకూడదు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు మూర్ఖులను ఉత్పత్తిచేసే కర్మాగారాలుగా మారాయి. నూతన విద్యావిధానం ద్వారా దేశాన్ని మరింత వెనక్కి తీసుకెళ్లేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని అందరూ ప్రతిఘటించాలి.

సేకరించిన సాక్ష్యాధారాలు నేర నిరూపణకు సరిపోవు!

'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్' కింద మార్గదర్శి కేసు మూసివేతకు అనుమతివ్వండి

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి చిట్స్‌పై నమోదు చేసిన కేసులో సేకరించిన సాక్ష్యాధారాలు నేరనిరూపణకు సరిపోవని సీఐడీ ఓ నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్(వాస్తవాలు గ్రహించడంలో పొరపడడం)' కింద కేసు మూసివేసి సంబంధిత కోర్టులో తుది నివేదిక దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని దర్యాప్తు అధికారి సీఐడీ అదనపు డీజీని కోరారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఎంసీఎఫ్‌పీఎల్) కేసులో చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) కుదరవల్లి శ్రవణ్‌కుమార్ అరెస్టుకు సంబంధించి 2023లో దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌లో విజయవాడ సీఐడీ ప్రాంతీయ కార్యాలయం అదనపు ఎస్పీ డి.ప్రసాద్ తాజాగా వేసిన కౌంటర్‌లో ఈ అంశాలు తెలియజేశారు.

కావేరీ ట్రిబ్యునల్ అవార్డుపై.. సుప్రీం తీర్పును పరిగణించండి

» కృష్ణా ట్రిబ్యునల్‌లో తెలంగాణ వాదనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కావేరీ ట్రిబ్యునల్ అవార్డుపై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును కృష్ణా ట్రిబ్యునల్ పరిగణనలోకి తీసుకోవాలని తెలంగాణ సర్కారు కోరింది. కావేరీ ట్రిబ్యునల్ అవార్డుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా.. గురువారం ఢిల్లీలోని కృష్ణా ట్రిబ్యునల్‌లో తెలంగాణ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. కావేరీ, కృష్ణా బేసిన్ల మధ్య కొన్ని సారూప్యతలు ఉన్నాయని.. రెండు బేసిన్లు కూడా లోటు నీటి బేసిన్‌లని.. రెండింటిలోనూ నీటి లభ్యత కన్నా డిమాండ్ అధికంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతంలో వినియోగించగా.. వదిలే నీటిని(రిటర్న్ ఫ్లోను) ఉమ్మడి ఏపీకి కేటాయించారని.. దాన్ని తెలంగాణ ప్రాంతానికి కేటాయించాలని కోరారు.

భార్య, అత్తమామలపై కత్తితో దాడి

» తల్లిగారింట్లో ఉంటోందని భర్త ఘాతుకం

» భార్య పరిస్థితి విషమం.. వరంగల్‌లో ఘటన

మట్టెవాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పనిలేక ఖాళీగా తిరుగుతుండటమే కాకుండా నిత్యం వేధింపులకు పాల్పడుతున్న భర్తను వదిలేసిన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇది జీర్ణించుకోలేక ఉన్మాదిగా మారిన ఆ భర్త, అత్తగారింటికి వెళ్లి కత్తితో భార్య మెడ భాగంలో నరికాడు. అడ్డుకోబోయిన అత్తామామలపైనా దాడికి పాల్పడ్డాడు. వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ ఎస్సీ కాలనీలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్సీ కాలనీకి చెందిన జన్ను వీరస్వామి అలియాస్ బాబు-అనిత దంపతుల కుమార్తె జన్ను పల్లవి కేఎంసీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఈమెకు రెండున్నరేళ్ల కిందట వరంగల్ ఉర్సు ప్రాంతానికి చెందిన కోట చంద్రశేఖర్‌తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర వయస్సు ఉన్న కుమారుడు ఉన్నాడు. చంద్రశేఖర్ పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండటంతో కొంతకాలంగా చంద్రశేఖర్-పల్లవిల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భర్త ప్రవర్తనతో విసుగుచెందిన పల్లవి, తన కుమారుడితో కలిసి తల్లిగారింట్లోనే ఉంటూ ఉద్యోగం చేసుకుంటోంది. గురువారం అకస్మాత్తుగా చంద్రశేఖర్ వచ్చి ఇంట్లో ఉన్న పల్లవిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో పల్లవి తల, ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. అడ్డుకునేందుకు వెళ్లిన అత్తమామలు వీరస్వామి, అనితలపైనా చంద్రశేఖర్ దాడి చేయడంతో వారికి గాయాలయ్యాయి. స్థానికులు ముగ్గురిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పల్లవి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు.

'గుట్ట' పరికి చెరువులో ఆక్రమణల తొలగింపు

» నిర్మాణాలు, బేస్‌మెంట్లను కూల్చిన హైడ్రా

» చెరువు పరిరక్షణ సమితి ఫిర్యాదుతో చర్యలు

హైదరాబాద్ సిటీ/జీడిమెట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, పార్కుల్లో ఆక్రమణలను తొలగించిన హైడ్రా చెరువులపైనా దృష్టి సారించింది. గురువారం కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్టలోని పరికి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను తొలగించింది. స్థానిక రాజకీయ నేత బాలకృష్ణ.. ప్రభుత్వ భూమితోపాటు, చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని స్థలాలను ప్లాట్లుగా చేసి నోటరీపై విక్రయిస్తున్నాడని పరికి చెరువు పరిరక్షణ సమితి ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. 60 ఎకరాల చెరువు ఇప్పటికే చాలా వరకు కబ్జాకు గురైందని, పాఠశాల మైదానం పేరుతో 1000 చదరపు గజాలకుపైగా స్థలాన్ని బాలకృష్ణ ఆక్రమించారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తెచ్చారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా బృందాలు పలు నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టు నిర్ధారణకు వచ్చాయి. పరికి చెరువు పక్కనే ఉన్న భూదేవి, షిరిడీ హిల్స్ వైపు నుంచి ఆక్రమణలు జరుగుతున్నాయని తేల్చారు. ఈ క్రమంలో ఇప్పటికే ప్రజలు నివాసముంటున్న ఇళ్ల జోలికి వెళ్లకుండా.. ఇతర నిర్మాణాలను తొలగించారు. ప్రొక్లెయినర్ డ్రైవర్ రవికి చెందిన బేస్‌మెంట్‌ను హైడ్రా తొలగించడంతో భార్య, కుమారుడితో కలిసి అక్కడకు వచ్చిన రవి కూల్చివేత యంత్రాలకు అడ్డుగా పడుకొని విలపించాడు. 'కాయ కష్టం చేసి.. కడుపు కట్టుకొని కూడబెట్టిన డబ్బుతో పాటు, కొంత అప్పు చేసి ఏడాది కిందటే రూ.15 లక్షలకు 50 గజాల స్థలం కొన్నా. నాకు న్యాయం చేయకుంటే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటా' అని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో అధికారులు, పోలీసులు రవికి నచ్చచెప్పడంతో శాంతించాడు.



నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా సిబ్బంది

హైడ్రా విధుల్లో డీఆర్ఎఫ్ పాత్ర కీలకం: రంగనాథ్

హైడ్రా నిర్వహిస్తున్న విధుల్లో విపత్తు స్పందన బృందాల (డీఆర్ఎఫ్) పాత్ర కీలకమని కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. డీఆర్ఎఫ్‌లోకి అవుట్ సోర్సింగ్ విధానంలో నూతనంగా తీసుకున్న 357 మందికి శిక్షణ కార్యక్రమాన్ని రంగనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలతోపాటు.. ఆస్తి నష్టం తగ్గించేందుకు డీఆర్ఎఫ్ కృషి చేస్తుందని, ఇప్పుడు అదనంగా హైడ్రా విధులూ తోడయ్యాయన్నారు.

ఆగస్టు నాటికి ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే సిద్ధం!

» శరవేగంగా పనులు.. 70 శాతం పూర్తి

ఖమ్మం,ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ నాలుగు లైన్ల జాతీయ రహదారి ఆగస్టు నాటికి అందుబాటులోకి రానున్నది. వాస్తవానికి మార్చినెలాఖరు నాటికి పనులు పూర్తి చేసుకోవాలని జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) లక్ష్యంగా పెట్టుకున్నా.. పలుచోట్ల బ్రిడ్జిల నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా ఆలస్యమైంది. వైరా నదిపై బ్రిడ్జితో పాటు పలుచోట్ల వాగులు, ఖమ్మం అర్బన్‌లోని వెంకటగిరి రైల్వే క్రాసింగ్ బ్రిడ్జి, ధంసలాపురం ఎగ్జిట్ ఏర్పాటు వల్ల పనులు కొంత జాప్యం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఆగస్టు నాటికి పనులు పూర్తి చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం ఐదు ప్యాకేజీలతో మొదలైన గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో 3 ప్యాకేజీలు తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో నడుస్తుండగా, మరో 2 ప్యాకేజీలు ఏపీలో నడుస్తున్నాయి. నేషనల్ హైవే 365 బీజీ కింద నిర్మితమవుతున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే ఖమ్మం మీదుగా రాజమండ్రి, విశాఖ మధ్య జరిగే రవాణాను మరింత సులభతరం చేయనుంది. కాకినాడ, విశాఖ పోర్టులకు కూడా వేగంగా సరుకు రవాణా చేయవచ్చు. ప్రస్తుతం కాకినాడ వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి కోదాడ మీదుగా ఎక్కువగా రాకపోకలు జరుగుతున్నాయి. మొత్తం 162 కి.మీ. పొడవున ఈ రహదారి నిర్మాణం పూర్తయితే విజయవాడ వైపు వెళ్లకుండానే సూర్యాపేట, ఖమ్మం, దేవరపల్లి మీదుగా రాజమండ్రి, విశాఖ, కాకినాడకు వేగంగా చేరుకోవచ్చు. సుమారు 4 గంటలపైగా సమయం ఆదా అవుతుంది. విశాఖ, రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా కోదాడ వైపు వెళ్లకుండా ఖమ్మం మీదుగా రాకపోకలు సాగించనున్నాయి. ఈ రహదారి త్వరలో నిర్మాణం కాబోతున్న నాగపూర్-అమరావతి జాతీయ రహదారులకూ అనుసంధానం కానుంది.



నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే

రహదారి పనులు 70 % పూర్తి

ఖమ్మం-దేవరపల్లి నాలుగు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు 70శాతం పూర్తయ్యాయి. ఆగస్టు నాటికి పూర్తి చేసి రాకపోకలు ప్రారంభిస్తాం. రైల్వే బ్రిడ్జితో పాటు ధంసలాపురం ఎగ్జిట్ వంటి పనుల వల్ల కొంత జాప్యం ఉంది. వైరా నుంచి దేవరపల్లికి రెండు నెలల్లో పనులు పూర్తవుతాయి. అయితే టోల్‌ప్లాజాల ఏర్పాటుకు టెండర్లు, ఇతర పనులకు ఆగస్టు వరకు సమయం పడుతుంది.

- కె.దివ్య, నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్

అడవి పందుల వేటకు వెళ్లి... విద్యుదాఘాతానికి ముగ్గురి బలి

» దంపతులు, కుమారుడి మృత్యువాత

» నిజామాబాద్ జిల్లాలో ఘటన

బోధన్‌రూరల్/కోటగిరి/రెంజల్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో ఘోరం జరిగింది. అడవి పందుల వేటకు వెళ్లిన ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన ఓర్సు గంగారాం(45)కు బాలమణి (40), శీల అనే ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య బాలమణికి కుమారులు కిషన్ (21), ప్రవీణ్, కుమార్తె యశోద ఉన్నారు. అడవి పందుల వేట ఈ కుటుంబ జీవనాధారం. అయితే, గంగారాం, తన భార్య బాలమణి, కుమారుడు కిషన్‌తో కలిసి గురువారం తెల్లవారుజామున బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామ శివారులోని ఓ పొలంలోకి వేటకు వెళ్లాడు. అక్కడ ఓ విద్యుత్ తీగను తాకి షాక్‌కు గురై ముగ్గురూ అక్కడికక్కడే మరణించారు. తెల్లవారిన తర్వాత పొలానికి వచ్చిన సదరు పొలం యజమాని ప్రకాశ్‌రావు మృతదేహాలను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్ బాబు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. కాగా, ఘటనాస్థలికి చేరుకున్న మృతుల కుటుంబసభ్యులు తమకు న్యాయం చెయ్యాలని ఆందోళనకు దిగారు. ప్రకాశ్‌రావు కోరిక మేరకే తమవారు పందుల వేటకు వచ్చారని ఆరోపించారు. పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు వారిని శాంతింపజేశారు. మరోవైపు, మృతులు ఎవరో తనకు కనీసం తెలియదని ప్రకాశ్‌రావు స్పష్టం చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పొలంలోని విద్యుత్ తీగలను కత్తిరించడం వల్లే ప్రమాదం జరిగిందని తమ ప్రాథమిక విచారణలో తేలిందని బోధన్ ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ అహ్మద్ తెలిపారు. తడిగా ఉన్న కర్రకు కత్తిని కట్టి వేలాడుతున్న విద్యుత్ తీగలను కత్తిరించారని చెప్పారు. అంతేకాక, మృతుల కుటుంబసభ్యులపై విద్యుత్ తీగల చౌర్యం కేసులు ఉన్నాయని డీఈ పేర్కొన్నారు.



పొలంలో నుంచి మృతదేహాలను బయటికి మోసుకొస్తున్న బోధన్ రూరల్ సీఐ

మృతదేహాలను మోసిన సీఐ

విద్యుత్ షాక్‌కు గురై పొలంలో మరణించిన వారి మృతదేహాలను బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు స్వయంగా మోశారు. మృతదేహాల ఉన్న చోటుకి వాహనం వచ్చే అవకాశం లేకపోవడంతో మృతదేహాలను తన భుజాలపైకి ఎత్తుకుని ఇతరులతో కలిసి 150 మీటర్ల దూరంలో రహదారిపై ఉన్న ట్రాక్టర్ వద్దకు మోసుకొచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

సోమేశ్ ఆదేశించారు.. వారు పాటించారు!

(మొదటిపేజీ తరువాయి)



వాడిన ఫోన్‌తోపాటు మిగిలిన ముగ్గురి ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే అప్పటికే ఆ ఫోన్లలో పాత వాట్సాప్ సందేశాలన్నింటినీ తొలగించారు. వాట్సాప్ గ్రూప్‌ను కూడా తీసేశారు. అయితే ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా స్పెషల్ ఇనిషియేటివ్స్ వాట్సాప్ గ్రూపులో సోమేశ్‌కుమార్‌కు, మిగిలిన వారికి మధ్య జరిగిన పరస్పర సందేశాలన్నింటినీ రిట్రీవ్ చేసినట్లు తెలిసింది. ఇప్పుడు ఈ నివేదికను ప్రభుత్వానికి, న్యాయస్థానానికి కూడా సమర్పించే అవకాశాలున్నాయి. జీఎస్‌టీ కుంభకోణంలో సుమారు రూ.1100 కోట్ల అక్రమాలు జరిగాయని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. రూ.3 వేల కోట్ల మేర పన్నుల ఎగవేతకు సంబంధించి వివిధ సంస్థలకు నోటీసులిచ్చి విచారించగా.. చివరకు ఈ మేరకు తేలినట్లు సమాచారం. ఈ విషయంపై తదుపరి చర్యలు తీసుకునేందుకు ఈ ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికలో వెలుగుచూసిన సందేశాలు బలంగా ఉపకరిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కుంభకోణంలో రెండు రకాల అక్రమాలున్నాయి. ఒకటి.. ఎలాంటి వస్తువులు విక్రయించకపోయినా విక్రయించినట్లు కొందరు డీలర్లు దొంగ ట్యాక్స్ ఇన్వాయిస్‌లు సృష్టించారు. వారి నుంచి.. వస్తువులను ఉత్పత్తి చేసేందుకు ముడిసరుకులు కొనుగోలు చేసినట్లు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి, ఆ ముడిసరుకులపై పన్నులు చెల్లించినట్లు చూపించి, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్ చేసి.. జీఎస్టీ కౌన్సిల్ నుంచి రీఫండ్ రూపంలో సొమ్ములు లాగేశారు. అయితే వారు నిజంగా ముడిసరుకులు కొన్నారా? లేదా? అన్నది తేల్చాల్సింది వాణిజ్యపన్నుల శాఖలోని సాఫ్ట్‌వేర్. కానీ, దానిలో సుమారు 76 సంస్థలకు సంబంధించిన సమాచారాన్ని చేర్చకుండా ఈ కుంభకోణానికి సహకరించారు. మరో కేసులో ఎలక్ట్రానిక్ బైక్‌లు తయారు చేయకపోయినా.. తయారు చేసినట్లు వ్యవహారం నడిపించారు. ఒక ఈ-బైక్‌ను అమ్మితే ఐదు శాతం జీఎస్‌టీ చెల్లించాలి. అది ప్రభుత్వానికి చెల్లించారు. కానీ, ఆ బైక్‌ల తయారీకి ఉపయోగించే స్పేర్‌పార్ట్‌లు, పరికరాలపై 12 నుంచి 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.

బైక్‌లను తయారు చేయకుండానే..

బైక్‌లను తయారు చేయకపోయినా తయారు చేసినట్లు చూపించి.. ఆ మేరకు ఐదుశాతం జీఎస్‌టీ కట్టేసి, స్పేర్‌పార్ట్‌లు, పరికరాల కొనుగోలుపై ఉన్న 12నుంచి 18శాతం జీఎస్‌టీ చెల్లించినట్లు చూపించారు. అంటే ఒక బైక్ అమ్మేటప్పుడు చెల్లించిన 5శాతం జీఎస్‌టీ కంటే చాలా ఎక్కువగా.. ఆ బైక్‌ను తయారుచేసే క్రమంలో కొనుగోలు చేసే స్పేర్‌పార్ట్‌లు, పరికరాలకు జీఎస్‌టీ చెల్లించినట్లు దొంగ రికార్డులు తయారు చేశారు. ఇలా అధికంగా చెల్లించినట్లు తయారుచేసిన దొంగ రికార్డులు, నకిలీ ఇన్వాయిస్‌ల ఆధారంగా.. అధికంగా చెల్లించిన జీఎస్‌టీ మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద క్లెయిమ్ చేసుకున్నారు. ఈ వ్యవహారాలపై సీసీఎస్ పోలీసులు తొలుత కేసు నమోదు చేసి, ఆ తర్వాత సీఐడీకి బదిలీ చేశారు. ఈ కేసు విచారణ కొనసాగుతోంది. మరోవైపు ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీ దీనిపై విచారణ చేపట్టింది. ఈ కమిటీకి టి.కె.శ్రీదేవి ఛైర్‌పర్సన్‌గా ఉండగా.. మరికొందరు అధికారులు సభ్యులుగా ఉన్నారు. ఇటీవలే ఈ కమిటీ పన్ను ఎగవేసిన సంస్థలకు నోటీసులు జారీచేసి వడ్డీతో సహా పన్ను కట్టాలని ఆదేశించింది. కొన్ని కంపెనీలు ఇప్పటికే వాటిని చెల్లించాయి కూడా. అయితే ఉద్దేశపూర్వకంగా చేసిన కుంభకోణం కావడంతో.. ముఖ్యంగా ఈ బైక్‌లు తయారు చేసినట్లు చూపించి జీఎస్‌టీ రీఫండ్ కాజేసిన కంపెనీతోపాటు, మరో నాలుగు కంపెనీలపై గతంలోనే పోలీసు కేసులు పెట్టి అరెస్టు కూడా చేశారు. పన్ను ఎగవేతదారుల నుంచి పన్నులు వసూలు చేయడం, కావాలని కుంభకోణం చేసినవారిపై పోలీసు కేసులు ముందుకు వెళ్లేందుకు ఇప్పుడు చేసిన ఫోరెన్సిక్ ఆడిట్ ఉపకరిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఉత్తమ్‌తో కృష్ణా బోర్డు చైర్మన్ సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్ అతుల్ జైన్ గురువారం జలసౌధలో భేటీ అయ్యారు. జూలై దాకా తమకు సాగు, తాగు నీటి అవసరాలు ఉన్న దృష్ట్యా శ్రీశైలం, సాగర్ నుంచి జలాలను తరలించకుండా ఏపీని అడ్డుకోవాలని ఈ సందర్భంగా ఉత్తమ్ కోరారు. దాంతో ఈ అంశంపై చర్చించడానికి శుక్రవారం ప్రత్యేక అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు అతుల్ జైన్ మంత్రికి తెలిపారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో మిగిలి ఉన్న నీటి వినియోగంపై తెలుగు రాష్ట్రాల అధికారులతో చర్చించడానికి కేఆర్ఎంబీ శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రత్యేక అత్యవసర సమావేశం నిర్వహించనుంది. ఇక కృష్ణా బేసిన్‌లో ప్రస్తుత నీటి సంవత్సరంలో 1,010.134 టీఎంసీల జలాలు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో 639 టీఎంసీలను ఏపీ తరలించగా.. 211.691 టీఎంసీలను తెలంగాణ వినియోగించుకుంది. తాత్కాలిక నీటి సర్దుబాటు ప్రకారం ఏపీకి 666.68 టీఎంసీలు, తెలంగాణకు 343.44 టీఎంసీల వాటా ఉంటుందని బోర్డు గుర్తు చేసిన విషయం విదితమే. ఈ లెక్కన ఏపీ కోటాలో 27.03 టీఎంసీలు మిగిలి ఉన్నాయి. తెలంగాణ కోటా కింద 131.75 టీఎంసీలు ఉన్నాయని బోర్డు తేల్చింది.

25, 26న 'బయో ఏషియా- 2025'

» కృత్రిమ మేధ ప్రధానాంశంగా చర్చ:మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హెల్త్‌టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకు ఈ నెల 25, 26 తేదీల్లో 'బయో ఏషియా- 2025' సదస్సును నిర్వహిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. కృత్రిమ మేధ(ఏఐ) ప్రధానాంశంగా ఈ సదస్సును నిర్వహిస్తామని, ఏఐ-ఆధారిత ఆరోగ్య సంరక్షణ-పరివర్తన, లైఫ్ సైన్సెస్‌లో ఆవిష్కరణలు, డాటా ఇంటర్-ఆపరేబిలిటీ, క్లినికల్ ట్రయల్స్‌లో భారత్ పాత్ర తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. ఈ వేదిక ద్వారా లైఫ్‌సైన్సెస్, ఫార్మా రంగాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, ఆవిష్కర్తలను ఒకే చోట చేర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. సదస్సును ప్రారంభిస్తారని తెలిపారు.

రంజాన్ మాసంలో 24 గంటల పాటు షాపులు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా మార్చి 2వ తేదీ నుంచి 31 వరకు 24 గంటల పాటు హోటళ్లు, దుకాణాలను తెరవడానికి వెసులుబాటు ఇస్తూ కార్మికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సమయంలో విధులు నిర్వర్తించే కార్మికులు/ఉద్యోగులకు ఓవర్ టైమ్ కింద చెల్లింపులు చేయాలని కార్మికశాఖ కమిషనర్ సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు.

రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రవాణశాఖ కమిషనర్ కె.సురేంద్రమోహన్‌కు, సహకార శాఖ కమిషనర్‌గా, మార్కెటింగ్ డైరక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలను ఐఏఎస్ అధికారి ఉదయ్‌కుమార్ నిర్వహించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరక్టర్ ఆర్.వి.కర్ణన్‌కు ఆరోగ్యశ్రీ సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఈ పోస్టులో కొనసాగిన శివశంకర్ లోహెటినీ జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి కె.హరితను వాణిజ్య పన్నుల శాఖ డైరక్టర్‌గా నియమించారు. ఉద్యాన శాఖ డైరక్టర్ యాస్మిన్ బాషాకు సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. హాకా ఎండీ కె.చంద్రశేఖర్ రెడ్డికి తెలంగాణ ఫుడ్స్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు తెలంగాణ ఫుడ్స్ ఎండీగా పనిచేసిన బి.శ్రీనివాసరెడ్డిని ఆయన మాతృశాఖ చేనేత జౌళి శాఖకు బదిలీ చేశారు. వనపర్తి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంచిత్ గాంగ్వార్‌ను నారాయణపేట అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా నియమించారు.

ఏఐజీ ఆస్పత్రికి మాజీ సీఎం కేసీఆర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హైదరాబాద్, గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో గురువారం పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గురువారం ఉదయం 10:10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేసీఆర్ ఆస్పత్రిలో ఉన్నారు. మాజీ సీఎంకు సాధారణ వైద్య పరీక్షలు చేశామని ఆస్పత్రి వర్గాలు వెల్లడించారు. గతంలో కూడా కేసీఆర్ ఏఐజీ ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు.

విద్యార్థిని చితకబాదిన గురుకుల ప్రిన్సిపాల్

» కొందుర్గు ఎస్సీ గురుకుల పాఠశాలలో ఘటన

చౌదరిగూడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థిని ప్రిన్సిపాల్ చితకబాదిన ఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు ఎస్సీ గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. గురువారం ఉదయం అల్పాహారంగా వడ్డించిన వడ ఉడకక కొంచెం పిండిగా ఉండటంతో 9వ తరగతి విద్యార్థి సందీప్ తినలేకపోయాడు. దీన్ని గమనించిన ప్రిన్సిపాల్ కుర్షిద్ వడను బలవంతంగా ఆ విద్యార్థి చేత తినిపించాడు. అలాగే కర్రతో చితకబాదడంతో విద్యార్థి వీపుపై వాతలు తేలాయి. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి కుటుంబ సభ్యులు పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థిని కొట్టిన విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా మరోసారి ఇలాంటి పొరపాటు జరగకుండా చూసుకుంటానని తెలిపారు. ప్రిన్సిపాల్ తీరుపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అశ్లీల 'యూట్యూబ్' చానళ్లను తొలగిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన స్పందించారు. గురువారం హైదరాబాద్‌లోని వీ-హబ్‌లో జరిగిన గ్రామీణ మహిళా స్టార్టప్ శిక్షణ ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జయేశ్ రంజన్.. 3 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధృవపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 'యూట్యూబ్, ఏ ఇతర సామాజిక మాధ్యమమైనా కానివ్వండి.. వాక్ స్వాతంత్ర్యం పేరుతో అశ్లీల, అసభ్య వీడియోలు రూపొందించడం, దేశ సమగ్రతకు భంగం కలిగించే వీడియోలు, వ్యక్తిగత భద్రతకు సంబంధించినవి, కులం, మతం, లింగ వివక్ష, బాలలపై లైంగిక దాడులకు సంబంధించిన వీడియోలు రూపొందించడం చట్టరీత్యా నేరమే.. పోలీసు శాఖతో కలిసి ఇలాంటి వీడియోలను యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల నుంచి తొలగిస్తాం. దీనికోసం త్వరలో ప్రత్యేక కార్యాచరణ చేపడతాం' అని వెల్లడించారు.

నేడు ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

నారాయణపేట జిల్లా అప్పక్‌పల్లిలో శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్

హైదరాబాద్/కొడంగల్/నారాయణపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మరో కీలకడుగు పడనుంది. మొదటి విడత కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. నారాయణపేట జిల్లాలోని అప్పక్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటివిడత కింద 72,045 ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. మొదటి దశలో సొంతస్థలం ఉన్న వారికే ఇళ్లను కేటాయించింది. ఈ పథకం కింద బేస్‌మెంట్ లెవల్‌లో రూ.లక్ష, గోడలు నిర్మించాక రూ.1.25లక్షలు, స్లాబ్ పూర్తయిన తరువాత రూ.1.75లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష కలిపి మొత్తం నాలుగు దశల్లో రూ.5లక్షల ఆర్థికసాయం అందజేయనుంది. ఇందులో భాగంగా నారాయణపేట జిల్లాలోని అప్పక్‌పల్లిలో మంజూరైన ఇళ్లకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, అప్పక్‌పల్లిలోనే జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తారు. మహిళల ఆధ్వర్యంలోనే నడిచే బంకు రాష్ట్రంలోనే ఇది మొదటిది కావడం గమనార్హం. ఆ తర్వాత నారాయణపేట మెడికల్ కాలేజీ అకడమిక్ బ్లాక్, ఇతర భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులు జరుగుతున్న తీరుపైనా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు గురుకుల హాస్టల్ ఆవరణలో బహిరంగ సభలో పాల్గొని, ప్రసంగించనున్నారు. మరోవైపు.. కొడంగల్ నియోజకవర్గంలోని పోలేపల్లిలో రేణుక ఎల్లమ్మతల్లి జాతరకు సీఎం హాజరుకానున్నారు. మినీమేడారంగా పేరు గాంచిన ఈ జాతరలో నియోజకవర్గ ప్రజలతో కలిసి సీఎం పాల్గొననున్నారు. కాగా, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణలో పాల్గొనాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందింది. మంత్రి కొండా సురేఖ, బీర్ల అయిలయ్య, అధికారులు, అర్చకులు సీఎంను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఫిబ్రవరి 23న నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.



యాదగిరిగుట్ట మహాకుంభాభిషేక సంప్రోక్షణకు సీఎం రేవంత్‌ను ఆహ్వానిస్తున్న మంత్రి కొండా సురేఖ

'ఎమ్మెల్సీ' ప్రచారం పక్కాగా ఉండాలి!

50 మంది ఓటర్లకో ఇన్‌చార్జిని నియమించాలి

పార్టీ నేతలతో సమావేశంలో సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార వ్యూహాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ నేతలకు పిలుపునిచ్చారు. 50 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించాలన్నారు. యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు గ్రామ స్థాయి నుంచి వ్యూహాలు రచించాలని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం పార్టీ నేతలతో జూమ్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌తో పాటు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. "మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు పూర్తి స్థాయిలో ఎన్నికల వ్యూహంతో పని చేయాలి" అని చెప్పారు. తొలగింపు పద్ధతిలో ఓట్ల లెక్కింపు ఉంటుంది కాబట్టి ప్రతి ఓటునూ చాలా ముఖ్యమైనదిగానే పరిగణించాలని సూచించారు. ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షించాలని రేవంత్ చెప్పారు. ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలు చాలా కీలకమైనవని, ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విజయం సాధించేలా కృషి చేయాలని పార్టీ నేతలకు సూచించారు.

రాకేశ్‌కు.. సీఎం రేవంత్ సాయం!

» కండరాల వ్యాధిలో బాధపడుతున్న వ్యక్తికి ఉచితంగా వైద్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కండరాల వ్యాధితో బాధపడుతూ, వైద్యం చేయించుకోలేక ఇబ్బందిపడుతున్న ఓ నిరుపేద యువకుడి గురించి తెలుసుకున్న సీఎం రేవంత్ చలించిపోయారు. తక్షణమే వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన గూళ్ల రాకేశ్ చాలా కాలం నుంచి జన్యు సంబంధ కండరాల వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి తీవ్రత పెరగడంతో నడవలేని పరిస్థితికి వచ్చాడు. రాకేశ్‌కు వచ్చిన వ్యాధి తగ్గాలంటే ఖరీదైన ఇంజక్షన్లను క్రమం తప్పకుండా ఇవ్వాలని వైద్యులు సూచించారు. నిరుపేద కుటుంబానికి పెద్ద ఆపద రావడంతో.. విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ వెంటనే వారిని ఆదుకునేందుకు ఆదేశాలు ఇచ్చారు. తక్షణమే రాకేశ్‌కు వైద్య సాయాన్ని ఉచితంగా చేయాలని, అదే విధంగా చార్జింగ్ వాహనంను కూడా అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు రాకేశ్ కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని సీఎం తరఫున వారికి హామీనిచ్చారు. తమ బిడ్డకు సాయం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాకేశ్ తల్లిదండ్రులు గూళ్ల సమ్మయ్య, లక్ష్మి ధన్యవాదాలు తెలిపారని సీఎంవో ప్రకటన విడుదల చేసింది.

జస్టిస్ ఘోష్ కమిషన్ గడువు

2 నెలలు పొడిగింపు

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ గడువును ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. కమిషన్ విచారణ నివేదిక సమర్పించడానికి ఇది వరకే ఇచ్చిన గడువు ఈనెల 28వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కమిషన్ గడువు పొడిగించారు.



జేబులు నింపుకోవడానికే ప్రాజెక్టులు

» కేసీఆర్, హరీశ్ వల్లే కృష్ణా జలాల్లో అన్యాయం: మంత్రి ఉత్తమ్

» కేసీఆర్, హరీశ్‌ను ఉరి తీసినా తప్పులేదు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జేబులు నింపుకోవడానికే సాగునీటి ప్రాజెక్టులను నిర్మించారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. నాడు నీళ్ల కోసం ప్రాజెక్టులు కట్టలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే నీటిపారుదల శాఖను అన్ని విధాలా నాశనం చేశారన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించడానికి జోక్యం చేసుకోవాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు. గురువారం జలసౌధలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో 2004-14 దాకా పదేళ్లలో ఆంధ్రా ప్రాంతానికి 727 టీఎంసీల కృష్ణా జలాలను తరలిస్తే.. బీఆర్ఎస్ పదేళ్ల పాలన(2014-23)లో 1200 టీఎంసీలను ఏపీ తరలించిందన్నారు. జగన్‌తో విందు, వినోదాలు చేసుకొని రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు చేసుకోవడానికి, ముచ్చుమర్రి, మల్యాల, పోతిరెడ్డిపాడును విస్తరించుకోవడానికి కేసీఆర్ సహకారం అందించారని ఆరోపించారు. అప్పటి సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ హరీశ్ రావు వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల నీటిని కేటాయించగా.. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అనంతరం 2015 జూన్‌లో 299 టీఎంసీలు తెలంగాణకు చాలని అప్పటి కేసీఆర్, హరీశ్‌రావు ఒప్పందం చేసుకున్నారని మండిపడ్డారు. లక్ష కోట్లు అప్పు తెచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, మేడిగడ్డ బ్యారేజీ కుంగినప్పుడు బీఆర్ఎస్సే అధికారంలో ఉందని చెప్పారు. ఈ నెలాఖరులోగా మేడిగడ్డపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ నివేదిక రానుందన్నారు. ఆ నివేదిక వచ్చాకే తదుపరి చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసి, రాష్ట్రాన్ని నాశనం చేసింది అగ్గిపెట్టెరావు(హరీశ్ రావు), కేసీఆర్, మాజీ ఈఎన్‌సీ మురళీధర్‌రావు అని, వీరిని ఉరి తీసినా తప్పులేదన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌లో 4% లంచం

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ జీఎం ఆనంద్.. బిల్లు పాసవ్వాలంటే 4% తప్పనిసరి అని హుకుం

» లంచం డబ్బుతో చర్చి నిర్మిస్తున్నట్లు వెల్లడి

» తండ్రి ఐసీయూలో ఉన్నాడని కాంట్రాక్టర్ చెబుతున్నా పట్టించుకోని ఆనంద్

» గతంలో దళితబంధులో కీలక పాత్ర





జీఎం ఆనంద్, ఏవో శంతన్‌కుమార్

హైదరాబాద్/మంథని/అశ్వాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల సహకార అభివృద్ధి సంస్థలో కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయాలంటే.. 4% లంచం డిమాండ్ చేస్తున్న జనరల్ మేనేజర్/ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బొప్పూరి ఆనంద్‌కుమార్ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. తాను చర్చిలు కట్టిస్తున్నాని, నేరుగా పాస్టర్ నంబర్‌కు డబ్బు వేయాలని హుకుం జారీ చేసే ఆనంద్.. వచ్చే నెలలో పదవీవిరమణ చేయనుండడం గమనార్హం..! ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. ఓ కాంట్రాక్టర్‌కు 2023, 2024 సంవత్సరాల్లో చేసిన పనులకు రూ.33.32 లక్షలు ఈ నెల 5న మంజూరయ్యాయి. 4% తన లంచం మొత్తం రూ.1.33 లక్షలు ఇవ్వాల్సిందేనని ఆనంద్ పట్టుబట్టారు. అడిగినంతా ఇస్తానని, తన తండ్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారని, ఇబ్బందుల్లో ఉన్నానని కాంట్రాక్టర్ చెప్పినా వినలేదు. "నేను ఎస్సీ చర్చిల నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తున్నాను. ఓ పాస్టర్ నంబర్ పంపుతాను. ఆయనకు గూగుల్‌పే లేదా ఫోన్‌పేలో డబ్బు పంపి, నాకు స్క్రీన్‌షాట్ పంపించు. ఇకపై బిల్లుల మంజూరులో ఇబ్బందులు ఉండకూడదంటే.. 4% లంచం మరిచిపోవద్దు" అని.. చెప్పడంతో.. బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. గురువారం ఉదయం కూడా వరుస ఫోన్లు చేసి.. లంచం డబ్బులు ఎప్పుడిస్తావని అడిగారు. ఆనంద్‌కుమార్‌కు ఆయన కార్యాలయంలో లంచం ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆనంద్‌కుమార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మీడియాకు చెప్పారు. ఆనంద్ ఇంట్లో, కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. ఆయన ఆస్తుల విలువను లెక్కగడుతున్నారు. 4% లంచం విషయం వెలుగులోకి రావడంతో.. గతంలో మంజూరైన బిల్లులపైనా ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా.. ఆనంద్‌కుమార్ వచ్చేనెల 31న రిటైర్ కానున్నారు. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన దళిత బంధు పథకంలోనూ ఆనంద్ కీలక పాత్ర పోషించడం గమనార్హం..!

రూ.3 వేలు తీసుకుంటూ చిక్కిన సర్వేయర్

పెద్దపల్లి జిల్లా మంథనిలో లంచం తీసుకుంటుండగా ఓ ల్యాండ్ సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మంథనికి చెందిన సువర్ణ క్రాంతినాగ్‌కు గంగాపురి గ్రామ సమీపంలో తన వ్యవసాయ భూమిని సర్వే చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. సర్వే చేయాలంటే రూ.17 వేల లంచం ఇవ్వాలని సర్వేయర్ జాటోత్ గణేశ్ డిమాండ్ చేశారు. ఈనెల 5న రూ.9 వేలు సర్వేయర్‌కు ఇచ్చిన క్రాంతినాగ్.. ఆ తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం మంథని బస్టాండ్ సమీపంలో క్రాంతినాగ్ నుంచి గణేశ్ మరో రూ.3 వేలు తీసుకుంటుండగా.. డీఎస్పీ వీవీ రమణమూర్తి నేతృత్వంలోని బృందం అరెస్టు చేసింది.

రైతు నుంచి రూ.30 వేల లంచం


రైతు నుంచి లంచం తీసుకుంటూ భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల వ్యవసాయాధికారి సాయి శంతన్‌కుమార్ ఏసీబీకి చిక్కారు. రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఓ రైతు తాను పండించిన పత్తి పంటను అమ్ముకునేందుకు టీఆర్(తాత్కాలిక రిజిస్ట్రేషన్) కావాలంటూ ఏవోను ఆశ్రయించారు. టీఆర్ నమోదుకు 30 వేల లంచం ఇవ్వాలని ఏవో డిమాండ్ చేయగా.. బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. బాధిత రైతు నుంచి రూ.30 వేలు తీసుకుంటుండగా.. ఏవో శంతన్‌ను అరెస్టు చేశారు.

విద్యపై కేంద్ర గుత్తాధిపత్యం తగదు

» రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి

» రాష్ట్రాలు పాలనా విభాగాలు కాదు

» దేశ పురోగతికి అవి జీవనాడులు: భట్టి



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యపై కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యం తగదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. యూనివర్సిటీలకు నిధుల కేటాయింపు, నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పజెప్పి.. వైస్ చాన్స్‌లర్ల నియామకాలు, అడ్మిషన్లు వంటి కీలక బాధ్యతలను కేంద్రం తన వద్దే పెట్టుకోవడం సరికాదన్నారు. "మీరు బిల్లు చెల్లించాలి కానీ.. ఫుడ్ ఆర్డర్ చేయలేరు " అన్న తరహాలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) కొత్త నిబంధనలున్నాయని విమర్శించారు. కేరళలోని తిరువనంతపురంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఏర్పాటు చేసిన జాతీయ ఉన్నత విద్య సమ్మేళనంలో మల్లు భట్టి విక్రమార్క తెలంగాణ తరఫున పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీలకు నిధులు సమకూర్చడంతో పాటు నిర్వహణ బాధ్యతలను కొనసాగించాలంటూ కేంద్రం చెబుతోందని, కానీ వైస్ చాన్స్‌లర్ల నియామకాలు, అడ్మిషన్లు వంటి నిర్ణయ బాధ్యతల నుంచి రాష్ట్రాలను తొలగిస్తోందని అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రాలు భవనాల రిబ్బన్ కటింగ్‌కు మాత్రమే పరిమితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యపై కేంద్రానిది గుత్తాధిపత్యం కాదని, అది ఉమ్మడి జాబితాలోని అంశమని తెలిపారు. రాష్ట్రాలు తమ ప్రజలు, వ్యవస్థలకు అనుకూలమైన విద్యా విధానాలను రూపొందించుకుంటాయని, ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రానికి పోలిక ఉండదని, చాలా వ్యత్యాసాలుంటాయని వివరించారు. రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి లేకుండా నాణ్యమైన విద్యను ఎలా అందిస్తాయని ప్రశ్నించారు. ఇంతటి ప్రాధాన్యమున్న అంశాన్ని చర్చలకు పరిమితం చేయకుండా.. రాష్ట్రాలు ఒక ఉమ్మడి లక్ష్యంతో కేంద్రం వద్ద తమ వాదనను వినిపించాలని చెప్పారు. కేంద్రం కూడా రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్రాలు కేవలం పరిపాలనా విభాగాలు మాత్రమే కాదని, అవి దేశ పురోగతికి జీవనాడులని అన్నారు. విద్యా వ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నడపలేరని స్పష్టం చేశారు. కేంద్రానికి సహకార సమాఖ్య విధానంపై విశ్వాసముంటే యూజీసీ నిబంధనలపై అన్ని రాష్ట్రాలతో చర్చించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణలో విద్యపై ప్రజెంటేషన్..

తెలంగాణలో విద్యా రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, కార్యక్రమాలపై భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విద్య, ఆరోగ్య రంగాల్లో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం స్వయం ప్రతిపత్తిని కల్పించాలని డిమాండ్ చేశారు. వీసీల నియామక బాధ్యతను, సెర్చ్ కమిటీల్లో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను తొలగించడం, వీసీల అర్హత ప్రమాణాలను మార్చడం ఆందోళనకరమని అన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి ప్రవేశ పరీక్షను తప్పనిసరి చేయడం వల్ల వెనకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రాలకు విద్యపై స్వయం ప్రతిపత్తిని కల్పించడంలో కేంద్రం సరైన నిర్ణయం తీసుకోకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

రెండో ఫోన్ ట్యాపింగ్ కేసులో

ముగ్గురికి బెయిల్

- మంజూరు చేసిన నాంపల్లి కోర్టు
- హరీశ్‌రావు పేరు చెప్పాలంటూ పోలీసులు.. తనను చిత్రహింసలకు గురి చేశారన్న వంశీకృష్ణ
- నిందితుల ఆరోపణలు అవాస్తవమన్న పోలీసులు
- దర్యాప్తుపై స్టే ఎత్తివేయాలని హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ ఫోన్ ట్యాపింగ్ కేసు (రెండో ఫోన్ ట్యాపింగ్ కేసు)లో ముగ్గురు నిందితులకు నాంపల్లి క్రిమినల్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. చంచల్‌గూడ జైలులో ఉన్న నిందితులు వంశీకృష్ణ, సంతోష్‌కుమార్, పరశురామ్ తరఫు న్యాయవాది లక్ష్మణ్ పిటిషన్ దాఖలు చేయగా.. ఒక్కొక్కరు రూ.20 వేల పూచీకత్తు, రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశిస్తూ బెయిల్ ఇచ్చింది. కాగా, ఈ కేసులో కీలక సూత్రధారిగా అభియోగాలు ఎదుర్కొంటున్న వంశీకృష్ణ గతంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు వద్ద పీఏగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేసులో హరీశ్‌రావు పేరు చెప్పాలంటూ పోలీసులు తనపై ఒత్తిడి తెస్తున్నారని పిటిషన్‌లో వంశీకృష్ణ పేర్కొన్నాడు. దీంతో అతణ్ని పోలీసు కస్టడీకి పంపించవద్దని న్యాయవాది కోరారు. ఏసీపీ మోహన్‌కుమార్, డీసీపీ విజయ్‌కుమార్ తనను చిత్రహింసలకు గురిచేశారంటూ వంశీకృష్ణ తనకు సమాచారం ఇచ్చాడని, ఈ మేరకు తాను జైలు అధికారుల అనుమతితో అతడి నుంచి అఫిడవిట్ తీసుకుని కోర్టులో సమర్పించానని వారి తరఫు న్యాయవాది చెప్పారు. వాదనలు విన్న న్యాయస్థానం ముగ్గురు నిందితులకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిందని తెలిపారు. అయితే.. ఈ ఆరోపణలను పంజాగుట్ట పోలీసులు ఖండించారు. రెండో ఫోన్‌ట్యాపింగ్ కేసుపై బుధవారం విధించిన స్టే ఉత్తర్వులను ఎత్తేయాలని కోరుతూ హైకోర్టుకు గురువారం వారు మధ్యంతర దరఖాస్తు సమర్పించారు. తాము ఏ నిందితుడినీ చిత్రహింసలకు, వేధింపులకు గురి చేయలేదని పేర్కొన్నారు. తీవ్ర ఆరోపణలు ఉన్న దృష్ట్యా దర్యాప్తునకు వీలుగా స్టే ఎత్తివేయాలని కోరారు.

అంతర్రాష్ట్ర మహిళా డ్రగ్ పెడ్లర్ అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర మహిళా డ్రగ్స్ సరఫరాదారును మియాపూర్, టీజీన్యాబ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమె నుంచి రూ.6 లక్షలు విలువ చేసే 60 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఝార్ఖండ్‌కు చెందిన శతాబ్ది మన్నా చదువు పూర్తయ్యాక.. బెంగళూరులోని ఓ కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ.. దేవనహళ్లిలో నివసించేవారు. గత ఏడాది ఆమెకు ఆఫ్రికాకు చెందిన డ్రగ్స్ సరఫరాదారు వారెన్ కొకరాంగతో పరిచయం ఏర్పడింది. తన ఇంట్లో డ్రగ్స్‌ను భద్రపరిచేందుకు అద్దె చెల్లిస్తానని వారెన్ చెప్పడంతో శతాబ్ది అంగీకరించారు. క్రమంగా ఆమె కూడా డ్రగ్స్ సరఫరాదారుగా మారారు. బుధవారం ఆమె తమ వినియోగదారులకు డ్రగ్స్ అందజేసేందుకు హైదరాబాద్‌లోని మియాపూర్‌కు వచ్చి.. పోలీసులకు పట్టుబడ్డారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు మాదాపూర్ డీసీపీ వినీత్, టీజీన్యాబ్ డీఎస్పీ హరిచంద్రారెడ్డి వెల్లడించారు.

కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించేలా ఆదేశాలివ్వండి

- హైకోర్టులో ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్స్ 'పిల్'

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడం వల్ల రైతుల సమస్యలు చర్చకు రావడం లేదని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్స్ ప్రధాన కార్యదర్శి విజయ్‌పాల్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. కేసీఆర్‌ను సభకు రప్పించేందుకు స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. అందువల్ల తగిన చర్యలు చేపట్టే విధంగా వారికి ఆదేశాలు జారీచేయాలని కోరారు. కేసీఆర్ సభకు వచ్చే వరకు కేటీఆర్ ఆ విధులు నిర్వర్తించేలా, లేదంటే కేటీఆర్‌ను అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమించేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఈ పిటిషన్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద త్వరలో విచారణకు రానుంది.

రేవంత్‌పై వ్యాఖ్యల కేసును కొట్టివేయండి

- హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యలపై బంజారాహిల్స్ పోలీసులు పెట్టిన కేసును కొట్టివేయాలని కోరుతూ గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. గతేడాది మార్చి 27న బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టిన కేటీఆర్.. 'సీఎం రేవంత్‌రెడ్డి కాంట్రాక్టర్ల నుంచి రూ. 2500 కోట్లు వసూలు చేసి ఢిల్లీ కాంగ్రెస్‌కు కప్పం కట్టారు. ఎన్నికల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరిపోతారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత బత్తిని శ్రీనివాసరావు పిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని కొట్టివేయాలని కేటీఆర్ కోరారు. కాగా, ముషీరాబాద్ పీఎస్‌లో నమోదైన ఎన్నికల కేసును కొట్టేయాలని ముషీరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

ఇద్దరు బార్ కౌన్సిల్ సభ్యుల రాజీనామా

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు నిర్వహించకుండా పదవుల్లో కొనసాగుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ బార్ కౌన్సిల్‌కు చెందిన ఇద్దరు సభ్యులు రాజీనామా సమర్పించారు. బార్ కౌన్సిల్ సభ్యులు గండ్ర మోహన్‌రావు, బి.శంకర్ తమ రాజీనామా పత్రాలను బార్ కౌన్సిల్ ఛైర్మన్ నర్సింహారెడ్డికి సమర్పించారు.

ఆరేళ్ల బాలికపై సామూహిక అత్యాచారం

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఆరేళ్ల బాలికపై ముగ్గురు కామాంధులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. సంగారెడ్డి జిల్లాలోని ఓ గ్రామంలో గురువారం రాత్రి ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామ సమీపంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో ఇంటి బయట ఆడుకుంటున్న బాలికను అదే కాలనీలో నివాసముండే ముగ్గురు యువకులు మాయమాటలు చెప్పి చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. సదరు చిన్నారికి తీవ్ర రక్తస్రావమై అరవడంతో సమీపంలోని స్థానికులు నిందితుల్లో ఒకరిని పట్టుకుని చితకబాదారు. నిందితులు మద్యం మత్తులో ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిసింది. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సంగారెడ్డి పోలీసులు వెల్లడించారు.

ఎన్ఎంఐఎంఎస్ వర్సిటీలో

విద్యార్థినులకు అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించే వైద్యుడితోనే చికిత్స చేయించారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులను నేలపై పడకోబెట్టి, కుర్చీలకు సెలైన్ బాటిళ్లు తగిలించి చికిత్స అందించారు. వర్సిటీలో చికెన్, గుడ్లు తినడంతోనే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తోటి విద్యార్థులు తెలిపారు. సమాచారం అందుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వెంటనే వర్సిటీకి వెళ్లారు. అక్కడ విద్యార్థినులకు చికిత్స చేస్తున్న తీరును చూసి.. వర్సిటీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థినులను రక్షించే పద్ధతి ఇదేనా? అని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో వర్సిటీ అధికారులు అస్వస్థతకు గురైన వారందరినీ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

బండి సంజయ్‌కు ఊరట

- మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా నమోదైన కేసును కొట్టివేసిన కోర్టు
- సంజయ్‌ను నిర్దోషిగా ప్రకటించిన
- ప్రజాప్రతినిధుల న్యాయస్థానం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఊరట లభించింది. 2023లో మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా కొందరు బీఆర్ఎస్ నేతలను సంజయ్ 'దండుపాళ్యం ముఠా'తో పోల్చారంటూ నల్లగొండ జిల్లా మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుపై గురువారం తుది విచారణ జరిపిన ప్రత్యేక న్యాయస్థానం సంజయ్‌ను నిర్దోషిగా ప్రకటించింది. కేసును కొట్టివేసింది. ఇక, 2021లో బండి సంజయ్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన తప్పుడు విమర్శలను నిరసిస్తూ బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, లంకల దీపక్‌రెడ్డి, రాహుల్, ప్రేమ్‌కుమార్ తదితరులు జూబ్లీహిల్స్‌లో నిరసన తెలిపిన కేసులో నిందితులందరికి ఊరట లభించింది. ఈ కేసును కూడా నాంపల్లి కోర్టు కొట్టివేసింది.

ఉద్దేశపూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేయలేదు

- ఎవరినీ కించపరచాలనుకోలేదు
- నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. మూడు కేసుల విచారణ నిమిత్తం ఆయన గురువారం కోర్టుకు వచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాజీ సీఎం కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలు, రిజర్వేషన్లపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ నల్లగొండ టూటౌన్, మెదక్ జిల్లా కౌడిపల్లి, బేగంబజార్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. గురువారం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఆయా కేసులు విచారణకు వచ్చాయి. తాను ఉద్దేశపూర్వకంగా ఎవరినీ కించపరిచేలా వ్యాఖ్యలు చేయలేదని రేవంత్‌రెడ్డి తెలిపారు. నాటి ప్రభుత్వ పాలనలోని లోపాలను ఎత్తి చూపించేందుకే అలా మాట్లాడినట్లు వివరించారు. ఈ కేసులను కొట్టివేయాల్సిందిగా రేవంత్ తరఫు న్యాయవాదులు అభ్యర్థించారు. వాదనల అనంతరం కోర్టు తదుపరి విచారణను మార్చి 20కి వాయిదా వేసింది.

రాజలింగమూర్తి హత్యపై

రాజకీయ దుమారం

(మొదటిపేజీ తరువాయి)



రాజలింగమూర్తి (ఫైల్)

ఏడో బ్లాకు కుంగుబాటుపై అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ప్రాజెక్టు ఇంజనీర్లపైనా కోర్టులో పిటిషన్ దాఖలు వేయడం కూడా ఆరోపణలకు కారణమైంది. బీఆర్ఎస్ నేతల దోపిడీని ప్రశ్నిస్తే హత్య చేస్తారా? అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాజలింగమూర్తి హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ ఘటనపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపించి దోషులను శిక్షించాలని అన్నారు. రాజలింగమూర్తిని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డే హత్య చేయించారని, దీని వెనుక కేసీఆర్, హరీశ్‌రావు ఉన్నారని మృతుడి కుటుంబసభ్యులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఘటన వెనుక ఎంత పెద్దవారున్నా వదిలే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కాగా, రాజలింగమూర్తి హత్య వెనుక రాజకీయ కుట్ర ఉందనే అనుమానాలున్నాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. దీనిపై ప్రభుత్వం సీబీసీఐడీ విచారణ చేపట్టి నిజాలను నిగ్గుతేల్చాలని కోరారు. హత్య చేసిన వ్యక్తులు లొంగిపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారని, పూర్తి స్థాయిలో విచారణ జరపాలని పోలీసులను ఆదేశించారని తెలిపారు.

హత్యారాజకీయాలను బీఆర్ఎస్ ప్రోత్సహించదు:వెంకటరమణారెడ్డి

రాజలింగమూర్తి హత్యతో తనకుగానీ, బీఆర్ఎస్ పార్టీకి గానీ ఎలాంటి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. హత్యా రాజకీయాలను బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రోత్సహించదన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజలింగమూర్తి హత్యపై దుష్ప్రచారం చేస్తున్నారని, తానే చేయించానంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. మేడిగడ్డ కేసును చట్టపరంగానే ఎదుర్కొంటామని, హత్యకు పాల్పడాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. ఘటనపై సీఐడీ, సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మృతుడి భార్య బీఆర్ఎస్ తరఫున కౌన్సిలర్‌గా గెలిచారని, వారి విధానాలు నచ్చకపోవడంతో పార్టీ దూరం పెట్టిందని తెలిపారు. ఆమెతో కొందరు తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. రాజలింగమూర్తి అనేక భూ వివాదాల్లో కూరుకుపోయాడని, గతంలో రౌడీషీటర్ అని చెప్పారు. ఆయన హత్యకు భూవివాదాలే కారణమై ఉండొచ్చన్నారు. ఇదిలా ఉండగా.. మృతుడి భార్య సరళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో.. భూపాలపల్లి పట్టణంలోని ఓ భూమికి సంబంధించి రేణికుంట్ల కొమురయ్య, రేణికుంట్ల సంజీవ్ కుటుంబాలతో తమకు గొడవ జరుగుతోందని తెలిపారు. దీనిపై కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చేలా ఉందని భావించి తన భర్తను హత్య చేశారని పేర్కొన్నారు. అయితే వీరిని రాజకీయంగా ప్రేరేపించి ఉంటారని, బీఆర్ఎస్ నేతలు, కేసీఆర్ కుటుంబ హస్తం ఉందని ఆరోపించారు. మరోవైపు సీఎంగా, హోంమంత్రిగా రేవంత్ విఫలమయ్యారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. హోం మంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసులకు లొంగిపోయిన ఇద్దరు?

రాజలింగమూర్తిని తామే హత్య చేశామంటూ ఇద్దరు వ్యక్తులు పోలీసులకు లొంగిపోయారు. మరొకరిని గురువారం అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకునేందుకు డీఎస్పీ సంపత్‌రావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఇంటెలిజెన్స్ ద్వారా హత్యపై సమాచారం తీసుకున్నట్టు పోలీస్ వర్గాలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాయి. కేసు దర్యాప్తును ఎస్పీ కిరణ్‌ఖరే స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. విచారణలో భూ వివాదాలే హత్యకు కారణమై ఉంటాయని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మరోవైపు రాజలింగమూర్తి మృతదేహాన్ని గురువారం మధ్యాహ్నం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సాయంత్రం అంత్యక్రియలు ముగిశాయి.

హత్య ఘటనను పక్కదారి పట్టించే ప్రయత్నం

- అందుకే కృష్ణాజలాలపై మాట్లాడుతున్న హరీశ్: కోమటిరెడ్డి

సామాజిక కార్యకర్త రాజలింగమూర్తిని హత్య చేయించిన గండ్ర వెంకటరమణారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి పోలీసులకు లొంగిపోవాల్సిందిగా ఆదేశించడానికి బదులు.. ఈ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు కృష్ణా నీటి కేటాయింపుల అంశంపై హరీశ్‌రావు మాట్లాడుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలను ఎండబెట్టి.. వైఎస్ జగన్‌ను వెంట పెట్టుకుని కృష్ణా నీటిలో ఏపీకి వాటా రాసిచ్చిందే కేసీఆర్ అని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు న్యాయవాది వామనరావు దంపతులను నడి రోడ్డుపై హత్య చేయించిన వ్యక్తికి కేసీఆర్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని, ఆ వ్యక్తి అప్పట్లో శ్రీధర్‌బాబును కూడా హత్య చేయించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. లగచర్లలో కలెక్టర్‌పై బీఆర్ఎస్‌కు చెందిన సురేష్ అనే రౌడీ షీటర్ దాడి చేశారనీ గుర్తు చేశారు. కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిందంటున్న కేసీఆర్.. ఏదైనా ఊరికి వెళ్లి కనుక్కున్నారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై కేసులు వేసినవారు ప్రభుత్వాన్ని సంప్రదిస్తే.. వారికి రక్షణ కల్పిస్తామన్నారు.

తప్పులు కొనసాగితే

హైడ్రాను రద్దు చేస్తాం

- వాటి నమోదుకు రిజిస్టర్ పెట్టాలేమో!
- దోపిడీ దొంగల్లా వ్యవహరించొద్దు
- హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం
- భూముల రక్షణకు వ్యతిరేకం కాదు.. చట్ట ప్రకారమే జరగాలని స్పష్టీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'ఎందుకంత తొందర.. ఏం చేసినా చట్ట ప్రకారం చేయాలే తప్ప ఇష్టం వచ్చినట్లు కాదంటూ గురువారం హైడ్రా తీరుపై హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా ఏకపక్ష చర్యలను తప్పుబట్టింది. వీటన్నింటినీ నమోదు చేయడానికి రిజిస్టర్ పెట్టాల్సి వస్తుందేమోనని వ్యాఖ్యానించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే హైడ్రాను రద్దు చేస్తామని ఒక దశలో హెచ్చరించింది. 'సరైన విచారణ నిర్వహించకుండా వారాంతాల్లో కూల్చివేతలకు పాల్పడుతున్నారు. దోపిడీ దొంగలు మాత్రమే అలా వ్యవహరిస్తారు. ఆక్రమణలు, అనుమతి లేని భవనాల కూల్చివేతకు మేం ఏ మాత్రం వ్యతిరేకం కాదు. కానీ ప్రతి దానికి చట్టం అంటూ ఉంటుంది. చట్టాలను అమలు చేసి తీరాల్సిందే' అని తేల్చిచెప్పింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలో మూడు గుంటల భూమిలోని షెడ్‌ను ఎలాంటి సమాచారం లేకుండా ఆదివారం కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ ప్రవీణ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ హైకోర్టు ఎదుట హాజరయ్యారు. హైడ్రా న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సెలవు రోజుల్లో కూల్చివేతలు జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'మీరు ప్రతిసారీ ఇలాగే చెబుతున్నారు. మళ్లీ అదే తప్పు చేస్తున్నారు. హైకోర్టు ఫుల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను లెక్కచేయకుండా వ్యవహరిస్తే హైడ్రాను రద్దు చేస్తాం'అని వ్యాఖ్యానించింది. గతంలో ఇచ్చిన యథాతథ స్థితి ఆదేశాలను పొడిగించింది. తదుపరి విచారణ మార్చి 5కు వాయిదా వేసింది. కాగా, హైడ్రా స్టాండింగ్ కౌన్సెల్‌గా కౌటూరి పవన్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. మూడేళ్ల వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు

ఆ పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో

పోటీ చేసే ధైర్యం లేదు

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తెరవెనుక నాటకం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



యాదాద్రి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేదని, అందుకే తెర వెనుక నాటకాలు ఆడుతున్నాయని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మార్పు ఏమీ లేదని, బీఆర్ఎస్ స్థానంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోపిడీకి పాల్పడుతున్నారని, గత సీఎం మాదిరిగానే ప్రస్తుత సీఎం తీరు ఉందని విమర్శించారు. ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి విస్మరించారని, రాష్ట్రంలో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఏమైందని, నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా మూడు డీఏలు, కాంగ్రెస్ వచ్చాక రెండు డీఏలు ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. భూపాలపల్లిలో రాజలింగమూర్తి దారుణహత్యను ఖండిస్తున్నామని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో తీవ్ర అసంతృప్తి!

టాప్-5 మంత్రులు తప్ప మిగిలిన వారిదీ అదే తీరు.. ప్రభుత్వం ఐదేళ్లూ ఉండాలని కోరుకుంటున్నాం

- అయితే.. ఎప్పుడైనా, ఏమైనా జరగొచ్చు!
- బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలోని టాప్-5 మంత్రులు తప్ప మిగిలిన ఎమ్మెల్యేలందరూ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆరు గ్యారెంటీలపై ప్రజలు నిలదీస్తుంటే ఏం చెప్పాలో అర్థంగాక, ఆ పార్టీ ఎమ్మెల్యేలు రహస్య సమావేశం పెట్టుకున్నారని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు ఉండాలని కోరుకుంటున్నామని.. అయితే, ఎప్పుడైనా ఏమైనా జరగొచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. 'వారం పదిరోజుల కిందట జరిగిన హోటల్ మీటింగే కాదు.. నిన్నగాక మొన్న ఫాంహౌస్‌లో కూడా పది మంది ఎమ్మెల్యేలు సమావేశమయ్యారట' అని సంజయ్ చెప్పారు. కృష్ణా జలాల వాటాలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందే కాంగ్రెస్, బీఆర్ఎస్ అని మండిపడ్డారు. కృష్ణా జలాల్లో మన వాటా 575 టీఎంసీలైతే, 299 టీఎంసీలకే ఎందుకు ఒప్పుకొన్నారని నాడు ప్రశ్నిస్తే అప్పటి సీఎం కేసీఆర్ ఇప్పటివరకూ జవాబు చెప్పలేదన్నారు. కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి అన్యాయం చేసిన తొలి ద్రోహి కేసీఆర్ అని సంజయ్ ఆరోపించారు. నాటి ఏపీ సీఎం జగన్‌ను ఆలింగనం చేసుకుని, చేపల పులుసు తినిపించి, తెలంగాణ ప్రజల కొంప ముంచారని విమర్శించారు. గురువారమిక్కడ ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. అసభ్య పదజాలంతో మోదీని అవమానిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు గ్రాఫ్ పడిపోయిందని, తామే అధికారంలోకి వస్తామంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యపై స్పందిస్తూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే ఆ పార్టీకి అభ్యర్థుల్లేరని సంజయ్ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కేసులో విజిలెన్స్ నివేదిక వచ్చినా కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. ఏ కేసుల్లోనూ చర్యలు తీసుకోకపోవడానికి కారణం.. బీఆర్ఎస్ ముఖ్యులు ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దలతో లాలూచీ పడడమేనని చెప్పారు. 'బీజేపీని అడ్డుకోవాలంటే మీరూ, మేం కలిసి ఉండాలె. అందుకే మాపై కేసులు పెట్టొద్దు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేం అభ్యర్థులను పెట్టం. ప్రత్యక్షంగా, పరోక్షంగా మీకు సహకరిస్తాం' అని కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ ముఖ్యులు హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు కాంగ్రెస్ నిధులు ఇస్తుంటే, కాంగ్రెస్‌కు ఓటు వేయాలని బీఆర్ఎస్ చెబుతోందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 శాతం ముస్లింలను తీసేస్తే బీసీలకు మిగిలేది 32 శాతమేనని గుర్తుచేశారు.

కేంద్ర బడ్జెట్‌లో 1.08 లక్షల కోట్లు

కేంద్ర బడ్జెట్‌లో పన్నులు, పథకాల రూపంలో తెలంగాణకు రూ.1.08 లక్షల కోట్లు కేటాయించినట్లు సంజయ్ తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందనడం పచ్చి అబద్ధమన్నారు. 6 గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేంద్రంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాలు, పట్టణాల వారీగా కేంద్రం ఏం చేసిందో, రాష్ట్రం ఏం చేసిందో చర్చించడానికి సిద్ధమా? అని సవాల్ చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే ఎలా ఉంటుందనడానికి ఏపీ ఉదాహరణ అని సంజయ్ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అయితే, తెలంగాణలో అధికారంలో లేకున్నా, ప్రజలు మెచ్చేలా కేంద్రం నిధులు కేటాయించిందని తెలిపారు. కాగా, సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్యపై విచారణ జరిపి నిజాయతీ నిరూపించుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందని సంజయ్ అన్నారు. హతుడి భార్య చేస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ఎప్‌సెట్.. 'ఏపీ' అప్‌సెట్!

- స్థానికేతర విభాగంపై స్పష్టత లేకుండానే నోటిఫికేషన్
- ఏప్రిల్ 29-మే 5 వరకు పరీక్షలు
- ఈ నెల 25 నుంచే దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్-2025 నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఆలస్య రుసుముతో ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 29 నుంచి మే 5వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. పునర్విభజన చట్టం మేరకు పదేళ్ల ఉమ్మడి ప్రవేశాలకు నిరుటితో గడువు ముగిసింది. ఫలితంగా ఈ ఏడాది నుంచి ఏపీ విద్యార్థులు ఎప్‌సెట్ రాసేందుకు అనుమతిపై సందిగ్ధత నెలకొంది. స్థానికేతర విభాగంలో ప్రవేశాలకు అర్హతపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. దీంతో ఎప్‌సెట్ అధికారులు అస్పష్టంగానే నోటిఫికేషన్ జారీచేశారు. ప్రభుత్వం ఇచ్చే ఉత్తర్వులకు లోబడే స్థానికేతర విభాగం ప్రవేశాలు ఉంటాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అంటే రాష్ట్రంలోని ప్రముఖ కళాశాలల్లో స్థానికేతర విభాగం (15 శాతం) కన్వీనర్ సీట్లకు పోటీ పడాలనుకునే ఏపీ అభ్యర్థులకు ప్రస్తుతానికి అవకాశం లేనట్లే. మరోవైపు యాజమాన్య కోటా సీట్లను ప్రతిభ ఆధారంగా భర్తీ చేస్తే.. ఏపీ అభ్యర్థులు ర్యాంకులు పొందాలంటే టీజీ ఎప్‌సెట్ రాసేందుకు అనుమతిస్తారా? లేదా? అన్నదానిపైనా స్పష్టత లేదు. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమయ్యే లోపే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉందని ఉన్నత విద్యామండలి వర్గాలు చెబుతున్నాయి. సకాలంలో ఉత్తర్వులు జారీకాకుంటే తెలంగాణ అభ్యర్థులకు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా ఎప్‌సెట్ అప్లికేషన్‌ను రూపొందించినట్లు సమాచారం. మరోవైపు బీఎస్సీ ఫారెస్ట్రీ ప్రవేశాలను ఈ ఏడాది ఎప్‌సెట్ ర్యాంకుల ఆధారంగానే భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం ఈఏపీసెట్.టీజీసీహెచ్ఈ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

విద్యుత్తు సౌధ వద్ద ఆర్టిజన్ల ఆందోళన

- 'చలో విద్యుత్తు సౌధ' పిలుపుతో భారీగా హైదరాబాద్‌కు..
- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు.. అరెస్టులు



ఆర్టిజన్లను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఆర్టిజన్ల విద్యార్హతలు నిర్ధయించి కన్వర్షన్ చేయడంతోపాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ తలపెట్టిన 'చలో విద్యుత్తు సౌధ' ఉద్రిక్తతకు దారి తీసింది. గురువారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధ కార్యాలయానికి ఆర్టిజన్ కార్మికులు వచ్చి ఆందోళనకు దిగారు. అప్పటికే అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు వారిని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల పరిధిలో 20 వేలకు పైగా ఉన్న ఆర్టిజన్ కార్మికులంతా ఆందోళనకు తరలిరానున్నారన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పంజాగుట్ట, ఖైరతాబాద్‌తో పలు చౌరస్తాల్లో భారీగా మోహరించి.. జిల్లాల నుంచి వస్తున్న కార్మికుల వాహనాలను ఎక్కడికక్కడ అడ్డుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కళ్లు గప్పి విద్యుత్తు సౌధ ముందుకు చేరుకున్న జేఏసీ ఛైర్మన్ ఈశ్వర్‌రావును అరెస్టు చేయగా, కన్వీనర్ వజీర్‌ను ఎర్రగడ్డలో అదుపులోకి తీసుకున్నారు. జేఏసీ కో కన్వీనర్ నాగరాజు, ఇతర ప్రతినిధులు సదానందం, నరేందర్, ఎల్లయ్యలను మరోచోట అరెస్టు చేశారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహించేందుకు వస్తున్న ఆర్టిజన్లను అక్రమంగా అరెస్టు చేశారంటూ తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ మండిపడింది. కాంగ్రెస్ సర్కారు ప్రజా పాలన ఇదేనా.. అని ప్రశ్నించింది. ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయడం వల్ల ఎలాంటి ఆర్థిక భారం పడదని తెలిసినా ప్రభుత్వం ఎందుకు చేయడం లేదో అంతు చిక్కడం లేదని పేర్కొంది. సర్కారు, విద్యుత్తు సంస్థల యాజమాన్యాల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని జేఏసీ నేతలు పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.